శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రము

వివరణ

శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు

తెలుగు అనువాదం – కాజ సుధాకర బాబు

5వ భాగము

Sri Vishnu Sahasra Nama Stotram

Annotated commentary by : Sri Narasimhan Krishnamachari

Telugu Translation by : Kaja Sudhakara Babu

Volume-5

శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము వివరణ

శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు

తెలుగు అనువాదం – కాజ సుధాకర బాబు

Sri Vishnu Sahasra Nama Stotram

Annotated commentary by : Sri Narasimhan Krishnamachari

Telugu Translation by : Kaja Sudhakara Babu

This work is published under

Creative Commons Non-Commercial License

The above license applies only to my translation, which is done with permission from the original author, Sri N. Krishnamachari.

Excerpts from other works reproduced in this work are not covered in the above license. Main examples of such reproductions are

(a) Telugu Translation of Bhagavdgitha Slokas, which are taken from the publication of Gita Press, Gorakhpur

(b) Excerpts from book of Sri Pemmaraju Rajarao (Especially translation of Purva Peethika)

(c) Excerpts from the book of Dr. Krovi Partha Saradhi

(d) Excerpts from other works which are mentioned in appropriate places.

All Photographs and pictures are by me (Kaja Sudhakara Babu) or taken from free sources such as Wikipedia.

<u>Cover Photo:</u>

Sculpture at Dwaraka Thirumala, West Godavari District, Andhra Pradesh.

ఉద్భవః క్షోభణో దేవః శ్రీగర్భః పరమేశ్వరః |
కరణం కారణం కర్తా వికర్తా గహనో గుహః || (41)

375. ఉద్భవః

- భవబంధములను తొలగించువాడు.
- సంసార బంధములకు అతీతుడు.
- సకల సృష్టికి మూలము

ఓం ఉద్భవాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

41వ శ్లోకము. 375వ నామము. ఉద్భవః – **ఉద్భవః క్షోభణో దేవః శ్రీగర్భః పరమేశ్వరః**

85వ శ్లోకము. 796వ నామము. ఉద్భవః – **ఉద్భవః సుందరః సుందో రత్ననాభః సులోచనః**

ఉదతః భవః యస్మాత్ సః ఉద్భవః – శ్రీమన్నారాయణుని ధ్యానించువారికి ఆయన సంసారబంధములనుండి ముక్తిని ప్రసాదించును. యశోదమ్మచే రోట కట్టబడిన కన్నయ్యను స్మరించినయెడల సంసార బంధములు పటాపంచలగునని శ్రీ భట్టులు వ్యాఖ్యనించారు. (**కణ్ణినుణ్ సిరుత్తాంబినాయ్ కట్టుణ్ణుప్ పణ్ణియ పెరుమాయన్**)

శ్రీ శంకరుల వ్యాఖ్య – **ఉద్గతో భవాత్ సంసారాత్ ఇతి ఉద్భవః** –ప్రాపంచిక బంధములకు అందనివాడు గనుక ఉద్భవుడు. శ్రీ శంకరులు మరొక అర్థమును కూడ చెప్పారు – **ప్రపంచ ఉత్పత్తి ఉపాదాన కారణత్వాత్ ఉద్భవః** – సమస్త లోకము ఉత్పత్తికి కారణమైనందున ఉద్భవుడు.

376. క్షోభణః

క్షోభింపజేయువాడు. చలనము, చైతన్యము కలిగించువాడు.

ఓం క్షోభణాయ నమః

క్షుభ్ – సంచలనే – అనే ధాతువునుండి ఈ నామమును వ్యాఖ్యానించారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **ప్రకృతేర్బంధనార్హాణాం క్షోభయతి ఇతి క్షోభణః** – సంసారమున బంధింపదగినవారిని క్షోభింపజేయువాడు క్షోభణుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – సృష్టి సమయమున ప్రకృతి, పురుషులయందు ప్రవేశించి వారిని క్షోభింపజేయువాడు. ఉత్తేజపరచువాడు. అందుకు శ్రీ శంకరులు విష్ణు పురాణము (1.2.29)నుండి ఉదాహరించారు.

ప్రకృతిం పురుషంచైవ ప్రవిశ్య ఆత్మేచ్ఛయా హరిః

క్షోభయామాస భగవాన్ సర్గకాలే వ్యయావ్యయౌ

శ్రీహరి తన యిష్టానుసారము సృష్టికాలమందు ప్రకృతి పురుషులయందు ప్రవేశించి క్షోభింపజేశాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ, శ్రీ చిన్మయానంద వంటివారు సమర్ధించిన మరొక వివరణ – సమస్త భూతములయందును అంతర్యామియై చేతనత్వమును కలగజేయువాడు గనుక క్షోభణుడు.

377. దేవః

- ప్రకృతి, మాయ, జీవులతో సృష్టికార్యమున క్రీడించువాడు.
- సర్వభూతములందు దైవస్వరూపుడై ప్రకాశించువాడు.

ఓం దేవాయ నమః

దీవ్యతి, క్రీడతి ఇతి దేవః – జీవులను మాయలో బంధించి క్రీడించువాడు దేవుడు.

వ్యాఘ్రాదివ జీవతతే మాయాపాశేన బంధనమ్

కృత్వా నిత్యం క్రీడయతి యః స దేవః పరికీర్తితః

జీవులను మాయ అనే పాశముచేత బంధించి, వ్యాఘ్రమువంటి ఆకారములనిచ్చి ఆడుకొనేవాడు. ఇదే భావము (312వ) 'నహుషః', (335వ) 'ఆదిదేవః' నామములందు సూచింపబడినది.

ఈ అర్ధంలో చాలా తెలుగు సినిమాపాటలున్నాయి.

తోలుబొమ్మలాటలోన నీకెవరు సాటి రారంట (మంజునాధ)

బొమ్మను చేసి, ప్రాణము పోసి ఆడేవు నీకిది వేడుకా (దేవత)

ఇక్కడ 'దీవ్యతి' అనగా ప్రకాశించువాడు, జయించువాడు, కీర్తింపబడువాడు అని శ్రీ చిన్మయానంద వివరణ.

శ్రీ శంకరులు శ్వేతాశ్వరోపనిషత్తు (6.11)లో చెప్పిన – **ఏకో దేవః సర్వభూతేషు గూఢః** – అన్ని భూతములందు అంతర్గతంగా (దాగి)యున్న దేవుడొక్కడే – అనే భావం ఆధారంగా వ్యాఖ్యానించారు. భగవానుడు దివ్యప్రకాశ స్వరూపుడు. సకల రాక్షస సంహారకర్త. తన భక్తులలోని అసురలక్షణములను పోగొట్టువాడు. సృష్టి, స్థితి, లయములను నాటకమునందు చక్కగా క్రీడించువాడు. భక్తులచేత సదా స్తవము చేయబడువాడు. కనుక 'దేవః' అను దివ్యనామమున స్తుతింపబడుచున్నాడు.

378. శ్రీగర్భః

- దేవుడై క్రీడించునపుడు సదా లక్ష్మీదేవి తోడుగలవాడు.
- విశ్వరూపమున లక్ష్మిని తనయందుంచుకొన్నవాడు.
- సకల శుభగుణములకు ('శ్రీ'లకు) నిలయమైనవాడు.

ఓం శ్రీగర్భాయ నమః

శ్రీమహావిష్ణువు, లక్ష్మీదేవి వేరువేరు కారు. దేవుడై క్రీడించు దేవదేవునకు దేవేరియై శ్రీదేవి అన్నివేళల తోడైనది. **విష్ణోరేషా అనపాయినీ** (విష్ణుపురాణము 1.9.144)

శ్రీ భట్టుల వ్యాఖ్య – **భోగక్రీడా సహాయత్వేన వర్ధనీయ అస్య శ్రీః ఇతి శ్రీగర్భః** – భోగక్రీడలయందు 'శ్రీ' తోడుగా కలవాడు శ్రీగర్భుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – తన ఉదరము (గర్భము)నందు విశ్వమునుంచుకొన్నవాడు శ్రీగర్భుడు. విశ్వము సకలైశ్వర్య సంపన్నము. కనుక 'శ్రీ'లన్నియు ఆయన గర్భమునందున్నవి.

ధర్మచక్రము రచయిత వివరణ – గర్భమునందలి బిడ్డయే తల్లికి సకలైశ్వర్యము. తల్లి బిడ్డను సంరక్షించుకొన్నట్లు, లోభి తన ధనమును దాచుకొన్నట్లు, జ్ఞాని తన విద్యను జాగ్రత్త చేసికొన్నట్లు శ్రీమహావిష్ణువు సకల విశ్వమును పరిరక్షించును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – విశ్వమునందు ('శ్రీ'యందు) అందరిలో అంతర్యామియై యున్నందున భగవానుడు శ్రీగర్భుడు.

379. పరమేశ్వరః

అందరికిని ఈశ్వరుడు, ప్రభువు, శక్తి, శోభ.

ఓం పరమేశ్వరాయ నమః

విష్ణుమండలము. 1420 కాలపు నేపాల్ చిత్రం, వికీపీడియానుండి

ఐశ్వర్యము, ఈశ్వరత్వము అనేవి ప్రభువు లక్షణములు. భగవానుడు అందరికిని, మహాలక్ష్మికి కూడ ప్రభువు. **తిరువుక్కుమ్ తిరువాగియ సెల్వా** (తిరుమొళి 7.7.1).

శ్రీ రాధాకృష్ణశాస్త్రి వివరణ – పరా-మా – పరమా – మహాలక్ష్మి. అన్ని శక్తులకును ఆదిలక్ష్మి. మహామాయ. మహేశ్వరి. పరబ్రహ్మస్వరూపిణి. పరమేశి. జగన్మాత. అట్టి శ్రీదేవి ఎవని వక్షఃస్థలమును ఆశ్రయించియున్నదో ఆ జగదీశ్వరుడు – **పరమాయాః ఈశ్వరః** – పరమేశ్వరుడు.

ధర్మచక్రము రచయిత – ఇంద్రియములను నిగ్రహించుకొన్న వ్యక్తికి తనపై అధికారము సిద్ధించును. విశ్వముపై అధికారము కలిగియున్న భగవానుడు పరమేశ్వరుడు.
శ్రీ సత్యదేవో వాసిష్ఠ వివరణ – 'మా' అనగా శోభ. అన్నింటికంటె శోభను కలిగినవాడు, అందరికిని ప్రభువు, సర్వమును ఆకర్షించువాడు – **పరా మా యస్య స పరమేశ్వరః స చ అసౌ ఈశ్వరః పరమేశ్వరః.**

380. కరణమ్

సాధనము. **క్రియతే అనేన ఇతి కరణమ్.**

భగవంతుని పొందుటకు భగవంతుడే సాధనము.

ఓం కరణాయ నమః

381. కారణమ్

హేతువు. **కారయతీతి కారణమ్**

సాధించువాడు.

ఓం కారణాయ నమః

ఈ రెండు నామముల భావసాన్నిహిత్యమువలన రెండింటిని ఉమ్మడిగా పరిశీలించవచ్చును. ఏ పనికైనా రెండు విషయములు అవుసరము. (1) కరణము – అనగా పనిచేయు సాధనము. ఒక కుండ తయారు

చేయడానికి మట్టి, పనిముట్లు కరణములు. కాని ఇవి మాత్రమే ఉంటే కుండ తయారవదు. (2) కారణము – ఇవే కాకుండా ఇతర హేతువులు. ఉదాహరణకు కుమ్మరి యొక్క పని, సంకల్పము, నైపుణ్యత, వాతావరణము వంటివి. ఈ కరణ కారణములు రెండును భగవంతుడే అని వ్యాఖ్యానకర్తలు వేరువేరు పనుల విషయములో వివరించారు.

భగవత్ప్రాప్తి (మోక్షము) గురించి – భగవంతుని పొందుటకు సాధించు యత్నములో జ్ఞానేంద్రియములు (కన్నులు, చెవులు, నోరు వంటివి), కర్మేంద్రియములు (కాళ్ళు, చేతులు వంటివి), అంతఃకరణములు (చిత్తము, మనసు, బుద్ధి, అహంకారము) పాల్గొంటాయి. అభ్యాస వైరాగ్యముల చేత నిగ్రహము సాధ్యమని గీతలో చెప్పబడినది. కన్నులకు చూపును, చెవులకు వినికిడిని, కాలికి నడకను, బుద్ధికి ఆలోచనను, మనసునకు విచక్షణను, అహంకారమునకు గమ్యమును, చిత్తమునకు దీక్షను ప్రసాదించు భగవానుడు కరణము. అదేవిధముగా భగవత్ప్రాప్తికి సాధించు దీక్ష, అభ్యాసము కూడ భగవత్స్వరూపములే. కనుక భగవంతుడే కారణము.

విశ్వసృష్టి గురించి – జగత్తును సృష్టించినవాడు గనుక ఆయన కారణము. సృష్టికి ఆయనకు వేరే పనిముట్లు, సహాయము లేవు. తననుండే జగత్తును సృష్టించెను. కనుక ఆయన కరణము. జగదుత్పత్తికి సాధనము, ఉపాదాన కారణము, నిమిత్త కారణము కూడ శ్రీనివాసుడే.

382. కర్తా

చేయువాడు (పరమ స్వతంత్రుడు).

ఓం కర్త్రే నమః

ఈ నామము రెండుమార్లు స్తుతింపబడినది.

34వ శ్లోకము. 31వ నామము. కర్తా – **క్రోధహా క్రోధకృత్ కర్తా విశ్వబాహుః మహీధరః**

41వ శ్లోకము. 382వ నామము. కర్తా – **కరణం కారణం కర్తా వికర్తా గహనో గుహః**

317వ నామము వివరణ సందర్భమున శ్రీ భట్టులు పరశురామావతార పరముగా చెబుతూ, కార్తవీర్యుని దండించినవాడు గనుక 'కర్తా'యని వివరించారు. ఇంక ఇప్పుడు 'కర్తా' అనగా అన్నికార్యములకు ప్రధానకర్త – తాను చేయువాడు లేదా ఇతరులచే చేయించువాడు – అని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

పాణిని సూత్రము – **స్వతంత్రః కర్తా** – ఆధారముగా ఈ నామమును శ్రీ చిన్మయానంద వివరించారు. సృష్టి స్థితి లయాది సకల కార్యములను సంపూర్ణ స్వాతంత్ర్యముతో నిర్వహించును గనుక భవానుడు కర్త. కేవలము

పంచభూతముల ఉనికివలన సృష్టి జరుగదు. కర్త వలననే సమస్తము జరుగును. మట్టియున్నంతవలన కుండ తయారుకాదు. కుమ్మరివాని పని కావలెను.

జీవాత్మలు తామే ఏదో చేయుచున్నామని భ్రమింతురు. కాని పరమేశ్వరుడే సకల కార్యములకు కరణము, కారణము, కర్త. ప్రతి పనికిని, సృష్టికిని, అంతటికిని సరుకులు, పనిముట్లు, పనితనము, పనివాడు కూడ పరమేశ్వరుడే.

కేవలము పని చేయించుట, పని చేయుటతో భగవంతుని పాత్ర పరిమితము కాదు. తత్ఫలితములు ఆయన అనుభవము చెందును. జీవాత్మలతో కూడి స్పందించును. **వ్యసనేషు మనుష్యాణాం భృశమ్ భవతి దుఃఖితః ఉత్సవేషు చ సర్వేషు పితేవ పరితుష్యతి** – జనులు బాధపడినపుడు రాముడు దుఃఖించెను. జనులు ఆనందించినపుడు తండ్రివలె సంతసించెను. అలాగే విభీషణుని పట్టాభిషిక్తుని చేసి - **కృతకృత్య ప్రముమోదః** – తృప్తితో మోదమునొందెను.

383. వికర్తా

- మార్పు చెందువాడు.
- బహువిధములైన జగములను సృష్టించినవాడు.

ఓం వికర్త్రే నమః

వి కుర్వాణః వికర్తా – అవికారుడైన భగవంతుడు స్థిరుడు. నిజానికి ఆయనలో మార్పు ఉండదు. కాని ఆయన సృష్టించిన ప్రపంచము మారుతూ ఉన్నందున ఆ విశ్వరూపుడు కూడ వికర్తయే. ఆయన రాగద్వేష రహితుడైనప్పటికిని జీవుల సుఖదుఃఖములందు, వికారములందు భావములను తనవిగా పాలు పంచుకొనును గనుక ఆయన వికర్త. శ్రీరాముడు రాజ్యము పోగొట్టుకున్నందుకు బాధపడలేదు. పట్టాభిషిక్తుడైనపుడు పొంగిపోలేదు. కాని విభీషణునకు రాజ్యమిచ్చి సంతసించెను.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **విచిత్రమ్ భువనమ్ కృతవాన్ ఇతి వికర్తా** – చిత్రవిచిత్రములైన భువనములకు కర్తయైనందున ఆయన వికర్త. ఆయన లీలలు అనంతములు. సృష్టియందు ఒకదానికొకటికి పోలిక లేదు. ప్రతి మనసు వేరు. మనుషులు వేరు. జన్మలు వేరు. ప్రతిక్షణము మరొక క్షణమునకు సంబంధము లేనిది. ఇదంతా ఆయన సృష్టిలోని వైచిత్ర్యము.

384. గహనః

తెలియరానివాడు. గ్రహింపజాలనివాడు.

ఓం గహనాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

41వ శ్లోకము. 384వ నామము. గహనః – **కరణమ్ కారణమ్ కర్తా వికర్తా గహనో గుహః**

58వ శ్లోకము. 548వ నామము. గహనః – **గుహ్యో గభీరో గహనో గుప్తః చక్రగదాధరః**

భగవంతుడు మన బుద్ధికి, తర్కమునకు, ఇంద్రియములకు తెలియరాడు. మనలోనున్ననూ ఆయనను మనమెరుగలేము. **యః పృథివ్యాస్తిష్ఠాన్ యమ్ పృథ్వీ న వేద** – ఆయన భూమిలోనుండినా గాని భూమి ఆయననెరుగదు (బృహదారణ్యకోపనిషత్తు 5.7.3). ఆయన దేవతలందు ఉండునుగాని దేవతలు కూడా ఆయననెరుగరు. **విణ్ణవరక్కు ఎణ్ణె అరియాన్** (తిరువైమొళి 1.9.2). **చక్షుశ్చ ద్రష్టవ్యమ్ చ నారాయణః** – చూచే కన్నులు, చూడబడే వస్తువులు నారాయణుడే. శ్రీ రాధాకృష్ణశాస్త్రి కఠోపనిషత్తు (1.21)నుండి చెప్పిన ప్రమాణము – **తమ్ దుదర్శమ్ గూఢమ్ గుహాహితమ్ గహ్వరేష్ఠమ్ పురాణమ్.**

శ్రీ శంకరాచార్యులు భగవానుని తత్వము, శక్తి, చర్యలు – అన్నీ మనకు అర్థము కావని వివరించారు. ధర్మచక్రము రచయిత బాలకృష్ణుని లీలలను విపులముగా ఉదాహరించారు. పూతన మరణము, గోవర్ధనగిరి ధారణము, గోపికా వస్త్రాపహరణము, యశోదమ్మచేత బంధనము – ఇవన్నీ మనము తెలిసికొనలేని లీలలు. భక్తిమాత్రముచేతనే అనుభవింపదగినవి.

385. గుహః

- లోకములను రక్షించువాడు.
- అజ్ఞానులకు (భక్తులు కానివారికి) కనిపించనివాడు.
- హృదయ గుహయందు వసించువాడు.

ఓం గుహాయ నమః

గుహతి రక్షతి ఇతి గుహః – లోకములను రక్షించేటివాడు గుహుడు అని శ్రీ భట్టుల వ్యాఖ్య. తన గర్భమున బిడ్డను తల్లి కాపాడునట్లుగా లోకములను భగవానుడు కాపాడునని శ్రీ రాధాకృష్ణశాస్త్రి వివరించారు.

గుహతే సంవృణోతి – తన తత్వమును దాచియుంచువాడు. అని వ్యాఖ్యానిస్తూ శ్రీ శంకరులు భగవద్గీత (7.25) నుండి ఉదాహరించారు.

నాహం ప్రకాశ సర్వస్య యోగమాయా సమావృతః

మూఢోఽయం నాభిజానాతి లోకో మామజమవ్యయమ్

నా యోగమాయయందు దాగియున్న నేను అందరికీ గోచరించను. కాబట్టి అజ్ఞానులు నన్ను జన్మరహితునిగా, శాశ్వతునిగా తెలియజాలరు.

శ్రీ చిన్మయానంద విష్ణుభాగవతము(10.37.11)నుండి ఉదాహరించినది – **గూఢో గుహాశయః సాక్షీ మహాపురుష ఈశ్వరః** – మహాపురుషుడైన ఈశ్వరుడు సాక్షిగా గూఢముగా గుహాశయుడై యున్నాడు. **'నిహితమ్ గుహాయామ్'** అని ముండకోపనిషత్తులో ఉన్నది.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి చూపిన రెండు ప్రమాణములు –

ఏష సర్వేషు భూతేషు గూఢాత్మా (న?) ప్రకాశతే – కఠోపనిషత్తు (3.12)

అవజానంతి మామ్ మూఢా మానుషీమ్ తనువాశ్రితమ్

పరంభావమజానంతో మమ భూత మహేశ్వరమ్ (గీత 9.1)

శ్రీ ఆర్. అనంతకృష్ణశాస్త్రి మరొక అర్థం చెప్పారు – అందరి హృదయము అనే గుహలో పవళించియున్నవాడు గుహుడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

వ్యవసాయో వ్యవస్థానః సంస్థానః స్థానదో ధ్రువః |
పరర్ధిః పరమస్స్పష్టః తుష్టః పుష్టః శుభేక్షణః || (42)

386. వ్యవసాయః

- (గ్రహనక్షత్రాదులకు) ఆధారము (ఇరుసు) అయినవాడు.

- నిశ్చలమైన, దృఢమైన బుద్ధిగలవాడు. స్పష్టమైన జ్ఞానము కలవాడు.

ఓం వ్యవసాయాయ నమః

386 నుండి 390వరకు నామములు భగవంతుని అవతారమైన ధృవుని కీర్తించేవిగా శ్రీభట్టులు అభివర్ణించారు.

జ్యోతిశ్చక్రమ్ ధృవేన్నిత్యం సీయతే బధ్యతే యతః

వ్యవసాయస్తతో జ్ఞేయో భగణాధార మూర్తిమాన్

గ్రహనక్షత్ర మండలములను దృఢముగా పట్టియుంచువాడు. నక్షత్రాలకు ఆధారమైన ఆకాశమే శరీరముగా గలవాడు. కనుక 'వ్యవసాయః' అబడెను. తేజశ్చక్రాన్ని తనయందు బంధించుకొన్నవాడు. **విశేషేణ అవసీయతే బధ్యతే జ్యోతిశ్చక్రమితి వ్యవసాయః.**

'వ్యవసాయము' అంటే దృఢమైన దీక్ష. చెదరని యోగము. ఏకాగ్రమైన చిత్తము. గీత 2వ అధ్యాయములో 41, 42, 43, 44 శ్లోకములు ఈ అర్థమును సమర్థిస్తున్నాయి.

వ్యవసాయాత్మికా బుద్ధిః ఏకేహ కురునందన

బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్

ఓ అర్జునా! ఈ (నిష్కామ) కర్మయోగమునందు నిశ్చయాత్మక బుద్ధి ఒకటియే యుండును. కాని భోగాసక్తులైన వివేకహీనుల బుద్ధులు చంచలములై (అవ్యవసాయములై) ఒక దారీ తెన్నూ లేక కోరికలవెంట నలువైపులా పరుగులు తీయుచూ అనంతములుగా నుండును.

387. వ్యవస్థానః

- ప్రారంభించు స్థానము.
- (వ్యవస్థను, ఆధారమును, కాలమును) ఏర్పరచువాడు.
- సృష్టిలో జీవులు, రక్షకులు, జీవనమార్గము – ఇలా సమస్తమును ఏర్పాటు చేయువాడు.

ఓం వ్యవస్థానాయ నమః

'స్థ' అనే ధాతువునుండి స్థితి, వ్యవస్థ, స్థానము వంటి పదములు వ్యుత్పన్నమయాయి. వ్యవస్థను, అనగా సవ్యమైన పద్ధతిని స్థాపించువాడు వ్యవస్థాపకుడు.

కలా ముహూర్తాది మయః ధ్రువే కాలోఽపతిష్ఠతే

యస్మాత్తస్మా ద్వ్యవస్థానో హ్యష్టార్ణ స్థానదో మనుః

'వ్యవస్థను ఏర్పరచుట' అనే భావములోనే భాష్యకారులు చెప్పిన వివరణలు –

శ్రీ భట్టులు – అన్నింటికి ఆధారమైన కాలమును ఏర్పరచినవాడు. ఇందుకు నక్షత్ర గ్రహగతులు మూలము. వానికి ధ్రువనక్షత్రము కేంద్రము.

శ్రీ శంకరులు – సృష్టిలో ధర్మము, జీవ వైవిధ్యము, పరిణామక్రమము, ప్రాణ సంరక్షణామార్గములు, ఆహారాది సౌకర్యములు ఇవన్నీ ఏర్పరచిన దేవుడు 'వ్యవస్థానః'.

388. సంస్థానః

- పరిసమాప్తియగు స్థానము. నిలకడగానుండు స్థానము.
- ఉత్తమమైన స్థానము.

ఓం సంస్థానాయ నమః

సర్వమ్ ఏతస్మిన్ సంతిష్ఠతే సమాప్యతే ఇతి సంస్థానః – అన్నింటికీ సరైన ముగింపు ఉండే స్థానము సంస్థానము. సమస్తమును ఆయనయందు నిలకడగా ముగియును (ప్రళయకాలమున?).

శ్రీ వి.వి.రామానుజన్ చెప్పిన అర్థము – అన్నింటిని ఎప్పుడో ఒకప్పుడు ముగించేవాడు.

శ్రీ శంకరులు మరొక అర్థమును కూడ చెప్పారు – **సమీచీనమ్ స్థానమ్ అస్య ఇతి సంస్థానః** – అన్నింటికిని ఉత్తమమైన స్థానము సంస్థానము. దీనిని వివరిస్తూ శ్రీ రాధాకృష్ణశాస్త్రి ఇలా చెప్పారు. పాలపుంత, సూర్యమండలము, యోగి హృదయము, ధ్రువమండలము – వీటన్నింటికీ ఉత్తమమైన ధ్రువనక్షత్రమే సంస్థానము.

389. స్థానదః

- పరమపదమును ప్రసాదించువాడు.
- తగిన ఫలము, స్థానము ప్రసాదించువాడు.

ఓం స్థానదాయ నమః

స్థానమ్ దదాతి ఇతి స్థానః – 'ద' అనగా 'ఇచ్చుట' అనే అర్థములో పెక్కునామములు ఈ పుణ్యస్తవములో కీర్తింపబడినవి – ప్రాణదః, మానదః, శాంతిదః, శ్రీదః, దర్పదః, సర్వకామదః, స్వస్తిదః వంటివి. అన్నింటికంటె ఉత్తమమైన స్థానమునిచ్చువాడు స్థానదుడు.

స ఏవ పరమాకాశ ప్రాప్తౌ హేతుత్వతః సదా
ప్రోచ్యతే స్థానద ఇతి సప్తార్ణో మనునాయకః

ఎల్లవేళలందు కూడా పరమపదము ఇవ్వడానికి కారణమైనవాడు. **'ఓం స్థానదాయ నమః'** అనేదానిని సప్తాక్షరీమంత్రము లేదా మంత్రరాజము అని అంటారు.

శ్రీ శంకరులవ్యాఖ్య మరింత విస్తారమైన అర్థములోనున్నది. జీవులకు వారికి తగిన స్థానమునిచ్చువాడు స్థానదుడు. **ధ్రువాదీనామ్ కర్మానురూపమ్ స్థానమ్ దదాతి ఇతి స్థానదః** – అందరకూ తగిన స్థానము నిచ్చువాడు. ధ్రువునకు ప్రత్యేకమైన (స్థిరమైన) స్థానమునిచ్చినవాడు స్థానదుడు.
శ్రీ చిన్మయానంద కఠోపనిషత్తులోనుండి ఉదాహరించిన సూత్రము – **యథా కర్మమ్ యథాశృతమ్** – **కర్మఫలదాతా నారాయణః.**

డా. క్రోవి పార్థసారథి రచన 'శ్రీ కైవల్యసారథి'నుండి – **బ్రహ్మపురాణంలో వైకుంఠము వర్ణన** – విష్ణులోకము సంసార నాశకము. సర్వాశ్చర్య స్థానము. కల్పవృక్ష స్థానము. సర్వవృక్షములు, పూలు, పళ్ళు, అనేక రకాల పద్మములు, కలువలు, దిగుడుబావులు, సరస్సులు ఉంటాయి. దేవతలు బంగారు విమానాలమీద విహరిస్తూ ఉంటారు. విష్ణులోకం మధ్యలో మేలిమి బంగారు రంగులో నవరత్నములు పొదగబడిన బంగారు ప్రాకారాలతో యోజన విస్తారంతో శ్రీమహావిష్ణువు మందిరం ఉంటుంది. అది చుక్కలలో చంద్రునిలాగా ప్రకాశిస్తుంటుంది. ఆయుధధారులైన ద్వారపాలకులు దాని నాలుగు ద్వారాలకు కాపలా కాస్తుంటారు. ఆ వైకుంఠమునందు ఇంద్రనీలము, మహానీలము, పద్మరాగమణిమయము, వజ్రమయము, వైఢూర్యమయము అయిన ఏడు పట్టణాలుంటాయి.

అక్కడ సిద్ధులయొక్క తేజస్సుతో దశదిశలు ప్రకాశిస్తుంటాయి. వారినడుమ మేఘశ్యాముడు, పీతాంబరధారి, శ్రీవత్సాంకితుడు అయిన శ్రీహరి శ్రీదేవితో ఉంటాడు. ఆయనచేత సుదర్శనమను చక్రము, పాంచజన్యమను శంఖము, కౌమోదకి అను గద, శార్ఙ్గము అను ధనుస్సు ఉంటాయి. దేవ, గంధర్వ, యక్ష, కిన్నెర, కింపురుష, సిద్ధ, సాధ్య, గరుడ, నాగ గణాలు, సప్తర్షులు, మహామునులు అతన్ని పరిపరివిధాల కీర్తిస్తుంటారు. కీర్తి మొదలు మాయవరకు అనేక శక్తులు అక్కడ ఉంటాయి. విష్ణుభవనము పరమానంద మయము, సర్వాభీష్టప్రదము.

390. ధ్రువః

నిశ్చలమైనవాడు. ఉన్నత స్థానము నిచ్చినవాడు.

ఓం ధ్రువాయ నమః

'ధ్రు' ధాతువునకు 'నిశ్చలము' అని అర్థము. ధ్రువునకు భగవంతుడు నిశ్చలమైన స్థానమును ప్రసాదించెను. వైకుంఠము శాశ్వత స్థానము. వైకుంఠమువలెనే ఏ స్థానమునైనా స్థిరమైన, నిత్యమైన, శాశ్వతమైనదిగా చేయగలడుగాన పరమాత్ముడు ధ్రువుడు.
ఆర్వాచీనం ధ్రువమసి తుంగస్థాన ప్రదానతః
ధ్రువీ చకార యస్మాద్ధి ధ్రువసస్తస్మా త్ప్రకీర్తితః

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవానుని (తత్వము) లక్షణము నిత్యము, శాశ్వతము, అచంచలము, స్థిరము, సత్యము. ఈ లక్షణమునే ఆయన ధ్రువునకు ప్రసాదించెను. కనుక భగవానుడు ధ్రువుడు.

ధర్మచక్రము రచయిత – సృష్టి లయ చక్రములో సర్వము అంతమగును. కాని భగవంతుడు శాశ్వతుడు, స్థిరుడు గనుక ఆయన ధ్రువుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'ధ్రువ' శబ్దమునకు 'నిశ్చయము' అని అర్థము. ప్రపంచములో అంతా 'అధ్రువము' అయినా గాని భగవంతుడు తన లక్షణమువల్ల వానికి నిశ్చయత్వ గుణమును ఆపాదించును. సూర్యోదయాస్తమయములు, జనన మరణములు – ఇవన్నీ నిశ్చయమైన ఘటనలు.

తరువాతి 16 నామములను శ్రీరామావతార పరముగా శ్రీభట్టులు వర్ణించారు. **"మృతులైనవారిని కూడా పునరుజ్జీవింపజేయు గాథ"** అని ఈ అధ్యాయమునకు శ్రీ భట్టులు నామకరణము చేశారు. రామావతారముపై శ్రీ భట్టులకు ప్రత్యేకమైన మక్కువ అని శ్రీ వి.వి. రామానుజన్ వ్యాఖ్యానించారు.

391. పరర్ధిః

- సకల శుభ, ఉత్తమ కళ్యాణ లక్షణములు గలవాడు.

- దివ్యమైన విభూతి, ఐశ్వర్యము గలవాడు.

ఓం పరర్ధయే నమః

చిన్న తిరుపతిలోని శ్రీరాముని శిల్పం.

'(ఋ)రిద్ధి' అనగా విభూతి (స్వరూపము). **పరా ఋద్ధిః యస్య స పరర్ధిః** – ఉత్కృష్టమైన కళ్యాణగుణ సంపన్నుడు పరర్ధి. నారదుడు వాల్మీకి మహర్షికి చెప్పిన శ్రీరామవర్ణనలో రెండు శ్లోకములు –

సముద్ర ఇవ గాంభీర్యే ధైర్యేణ హిమవానివ
విష్ణునా సదృశో వీర్యే సోమవత్ ప్రియదర్శనః
కాలాగ్ని సదృశః క్రోధే క్షమయా పృథ్వీసమః
ధనదేన సంస్త్యాగే సత్యే ధర్మ ఇవా పరః

శ్రీరాముని గాంభీర్యము సాగరమువంటిది. ఆయన ధైర్యము హిమాలయ సదృశము. విష్ణుసమాన వీరుడు. చంద్రునివంటి రూపముగలవాడు. ఆయన క్రోధము ప్రళయాగ్ని సమము. భూమాతతో సమమైన ఓర్పు, కుబేరునివంటి త్యాగము, ధర్మదేవతవంటి సత్యము శ్రీరాముని లక్షణములు.

శ్రీ రామానుజన్ ఇచ్చిన మరొక వివరణ – **పరేశామ్ ఋద్ధిరేవ ఋద్ధిః యస్య** – పరుల సమృద్ధినే తన ఋద్ధిగా భావించువాడు పరర్ధి. శ్రీరాముడు విభీషణునకు పట్టముగట్టి, **కృతకృత్యః తదా రామః** – సంతోషించెను. **ఉత్సవేషు చ సర్వేషు పితేవ పరితుష్యతి** – ప్రజలు సంబరములు చేసుకొన్నపుడు శ్రీరాముడు వారి తండ్రివలె సంతోషించుచుండెను.

'ఋద్ధి' అనగా విభూతి. పరమైన (అనంతమైన, ఉత్కృష్టమైన) విభూతులు గలవాడు పరర్ధి.
దివ్యానాత్మ విభూతయః (గీత 10.16) – నా విభూతులు దివ్యములు.
నాంతోఽస్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప (గీత 10.40) – నా దివ్య విభూతులకు అంతము లేదు.
ఇలా అంతు తెలియని విభూతులు కలిగినవాడు పరర్ధి.

392. పరమస్పష్టః

స్పష్టమైన పరతత్త్వము గలవాడు. తన పరతత్త్వాన్ని స్పష్టముగా గోచరింపజేసేవాడు.

ఓం పరమస్పష్టాయ నమః

స్పష్ట (ప్రత్యక్ష, దృష్టా) పారమ్యః పరమస్పష్టః – ఆయన ఔన్నత్యము, పరతత్వము స్పష్టమైనవి. ఈ వివరణలో శ్రీ భట్టులు రామాయణము (యుద్ధకాండము 114.4)లో రావణ వధానంతరము మండోదరి శ్రీరామునిగూర్చి చెప్పిన మాటలను ఉదాహరించారు – **వ్యక్తమేషాం మహాయోగీ పరమాత్మా సనాతనః** – శ్రీరాముడు మహాయోగి, పరమాత్ముడు, సనాతనుడు అని వ్యక్తమగుచున్నది.

అలాగే శ్రీరాముని చూచి తార అన్న మాటలు (4.24.31, 32) – **త్వమ్ అప్రమేయశ్చ దురాసదశ్చ** ... ...
మనుష్య దేహాభ్యుదమ్ విహాయ దివ్యేన దేహాభ్యుదయేన యుక్తః.
శ్రీరాముని చూడగానే ఆయన పరతత్వము తెలియవచ్చును. సుమిత్ర మాటలు – **సూర్యస్యాపి భవేత్ సూర్యః** – సూర్యునికంటె ఎక్కువ ప్రకాశము గలవాడు. సూర్యునికి కాంతినిచ్చువాడు.
ఇంకా శ్రీరాముని పరమస్పష్టతను గూర్చి ప్రస్తావనలు –
పుంసామ్ దృష్టి చిత్తాపహారిణమ్ – రూప సంహననమ్ లక్ష్మీమ్ తదృశుర్విస్మితాకారాః

ధర్మచక్రము రచయిత వివరణ – శ్రీ రఘునందనుని ఈ స్పష్ట పరతత్వమువల్లనే భరతుడు రాజ్యాధికారమును తృణీకరించి శ్రీరాముని పాదుకలకు శరణాగతుడయ్యెను. లక్ష్మణుడు నిద్రాహారములు పరిత్యజించి అన్నా వదినలకు వనవాససేవాదీక్ష నాచరించెను. ఒక్కమారు శ్రీరాముని దర్శించగానే హనుమంతుడు శాశ్వతముగా రామదాసత్వమును చేకొనెను.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ మరొక స్వతంత్రవ్యాఖ్యనిచ్చారు. 'స్పష్' అనగా బంధించుట (స్పశతి – బధ్నాతి). అన్నింటినీ అద్భుతముగా అల్లువాడు పరమస్పష్టుడు. అందువలననే రక్తమాంస శల్య నాడీ సంయుక్తమైన శరీరము ఒక సుందర రూపములో వ్యక్తమగుచున్నది. ఈ భావమునకు ఆయన చెప్పిన ఉదాహరణలు –
అస్య స్పశో న నిమిషన్తి (ఋగ్వేదము 9.73.4)
దివః స్పశః ప్రచరన్తి (అధర్వ వేదము 4.16.4)

393. తుష్టః

- ఆనందముతో నిండియున్నవాడు. పూర్ణ సంతుష్టుడు.
- సచ్చిదానందమూర్తి. తృప్తినొందువాడు.

ఓం తుష్టాయ నమః

వైకుంఠములో నిత్యసూరుల మధ్యనుండక మానవమాత్రుడైన దశరధునకు కొడుకై, నరునిగా సామాన్యులకు అందివచ్చిన భగవానుడు తుష్టుడు.

లాభాద్దాశరధి త్వస్య జగతః పాలనస్య చ

మనుష్యత్వేఽపి యః ప్రీతః సంతుష్ట ఇత కథ్యతే

భగవంతుడు తన భక్తులకు, దాసులకు ప్రియము కలిగినపుడు సంపూర్ణముగా సంతుష్టుడగును.

'తుష్టః' అనగా పరమానంద స్వరూపి అని శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు. పత్రముగాని, పుష్పము గాని, ఫలముగాని, జలముగాని భక్తితో నివేదించినది గ్రహించి సంతుష్టుడగు సర్వేశ్వరుడు తుష్టుడు.

ఏ విధమైన తాపములు, కామములు భగవానుని దరిచేరవు. శ్రీరాముడు పట్టాభిషేకమునకు పొంగిపోలేదు. వనవాస యోగమునకు కుంగిపోలేదు. గాంధారీమాత యాదవ కులమును శపించినపుడు శ్రీకృష్ణుడు చిరునవ్వుతో అనుగ్రహించెను.

సంతుష్టః సతతం యోగీ – ఘటనలకు, కర్మ ఫలములకు అంతఃకరణమును దూరముగానుంచి, సంతుష్టుడై యుండుట భగంతుని గురించిన జ్ఞానమునకు మార్గము.

394. పుష్టః

పరిపూర్ణుడు. ఉన్నత గుణ సంపన్నుడు.

ఓం పుష్టాయ నమః

పూర్ణత్వాత్ పుష్టః – అన్ని విధముల పరిపూర్ణుడు గనుక ఆయన పుష్టుడు. ఆయనలో ఇష్టానిష్టములకు, కామమోహములకు తావు లేదు. ఈ నామ వివరణలో ధర్మచక్రము రచయిత వళ్ళువార్ రచనను ఉట్టంకించారు. **వెండుదల్ వెండమాయి ఇలాన్** – ఆయనలో కొరత అనేది ఉండదు. ఈ నామస్మరణవలన ఇష్టానిష్టములను జయింపవచ్చును.

శ్రీ సత్యదేవోవాసిష్ఠ ఈ నామముయొక్క పరిధిని ఇంకా పెంచారు. **పుష్ణాతి ఇతి పుష్టః** – పోషించువాడు పుష్టుడు. తన సృష్టిలో అన్నింటికి సంతృప్తినిచెందు విధమును ప్రసాదించువాడు.

395. శుభేక్షణః

- మంగళకరమైన చూపు గలవాడు.
- చూపుతోనే సకల శుభములను ప్రసాదించువాడు.
- భగవంతుని చూసినవారికి, భగవంతునిచే చూడబడినవారికి సకల తాపత్రయములు నశించును. వారి పాపములు శమించును. కోరికలీడేరును.

ఓం శుభేక్షణాయ నమః

ఇంతకుముందు 346వ నామము ‘పద్మనిభేక్షణః’, 348వ నామము ‘అరవిందాక్షః’ కూడ భగవంతుని చల్లని చూపును ప్రస్తుతించినవి. శ్రీ భట్టులు ఉదాహరించిన అయోధ్యకాండము శ్లోకము (17.14) –

యశ్చ రామమ్ న పశ్యేత్తు యం చ రామో న పశ్యతి

నిందితః స వసేల్లోకే స్వాత్మాప్యేనం విగర్హతే

రాముని చూడనివాడు గాని, రామునిచే చూడబడనివాడు గాని లోకంలో అందరిచే నిందితుడై జీవిస్తాడు. చివరకు అతని ఆత్మ కూడ అతనిని నిందిస్తుంది.

సుభ్రూరాయత తామ్రాక్షః సాక్షాద్విష్ణురివ స్వయం – చక్కని కనుబొమలు, విశాలమైన ఎర్రని కనులతో రాముడు సాక్షాత్తు విష్ణువువలె ప్రకాశిస్తున్నాడని అయోధ్యాపురవాసులు కొనియాడిరి. **రామః కమలపత్రాక్షః సర్వసత్వ మనోరథః** – అని హనుమంతుడు వర్ణించెను. **తమ్ పద్మదళ పత్రాక్షమ్ ... ... ధన్యాః పశ్యన్తి మే నాథమ్** – అని సీతమ్మతల్లి ప్రస్తావించెను.

సౌశీల్యైశ్వర్య పిశునం శీతలం దీర్ఘమాయితమ్ తామ్రం చ లోచనం యస్య స శుభేక్షణ ఈరితః స్వకర్మ కర్తృకం చైవ శుభ యస్యేతి దర్శనమ్ శుభేక్షణస్యాత్ ... ... – సౌశీల్యము, ఐశ్వర్యమును సూచించునట్టి నల్లని పొడవైన, విశాలమైన ఎర్రని నేత్రములు గలవాడు. తాను చూడడం గాని, తనను చూడడం గాని శుభకరము చేయువాడు. అని శ్రీ భట్టులు ఈ నామమును వివరించారు.

శ్రీ సీతారాములకు నమస్కారము. శ్రీ లక్ష్మణస్వామికి నమస్కారము. శ్రీ భరత శత్రుఘ్నులకు నమస్కారము. జై వీరాంజనేయ.

శ్రీ శంకరులు ఇదే శుభనామార్థాన్ని ఇలా విపులీకరించారు –

ఈక్షణమ్ దర్శనమ్ యస్య శుభమ్, శుభకరమ్ నరాణామ్, ముముక్షూణామ్ మోక్షదమ్, భోగార్థినామ్ భోగదమ్, పాపినామ్ పావనమ్, సర్వ సందేహ విచ్ఛేదకారణమ్, హృదయగ్రంధేర్విచ్ఛేదకరమ్, సర్వకర్మాణామ్ క్షపణమ్, అవిద్యాయాశ్చ నివర్తకమ్, సః శుభేక్షణః

భగవానుని చూపు, దర్శనము సకల శుభకరము. సర్వ మంగళప్రదము. భోగములను కురిపించును. పాపములను నశింపజేయును. సకల సందేహములను నివారించును. హృదయగ్రంధిని ఛేదించును. కర్మలనుండి విముక్తి కలిగించును. అవిద్యను పటాపంచలు చేయును. కనుకనే ఆయన శుభేక్షణుడు. ఇందుకు శ్రీ శంకరులు ముండకోపనిషత్తు(2.2.8)నుండి చెప్పిన ప్రమాణము –

భిద్యతే హృదయగ్రంధిః ఛిద్యతే సర్వసంశయాః

క్షీయంతే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి కూడ శ్రుతులనుండి పలు ఉదాహరణలు చెప్పారు – ‘ఈక్షణము’ అంటే ‘దృష్టి’ మాత్రమే కాక భగవంతుని సంకల్పమును కూడ సూచించును. తాను ఏకమాత్రుడైనను పలువురిగా కావలెనను

ఆయన సంకల్పమే సృష్టికారణమైనది. అలా శుభమును సంకల్పించినవాడు (ఈక్షించినవాడు) గనుక భగవానుడు శుభేక్షణుడు. ఈ విషయమై శ్రీ రాధాకృష్ణశాస్త్రి చెప్పిన సూక్తులు –

తదైక్షత బహుస్యామ్ ప్రజాయెయేతి (ఛాందోగ్యోపనిషత్తు 6.2)

స ఈక్షత లోకాన్ సృజ ఇతి (ఐతరేయ 1.1.1)

స ఈక్షామ్ చక్రే (ప్రశ్నోపనిషత్తు 6.3)

సేయమ్ దేవతైక్షత హంతాహ్మిమాః తిస్రో దేవతా అనేన జీవేన ఆత్మాऽను ప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి (ఛాందోగ్యోపనిషత్తు 6.3)

భగవంతుని చల్లనిచూపువలన ధన్యులైన పెక్కురు పుణ్యాత్ములనుగురించి ధర్మచక్రము రచయిత ప్రస్తావించారు. శ్రీకృష్ణుని దర్శనమువలన అర్జునుని అజ్ఞానము పటాపంచలయ్యెను. గుహుడు, హనుమంతుడు, పరశురాముడు, శబరి వంటివారు ఎందరో శ్రీరాముని దర్శనమువలన ప్రయోజనము పొందినారు.

తిరుప్పావై – 22వ పాశురము

ఈ విశాల భూమండలమును పాలించే రాజులందరూ భయంతో నీముందు గుంపులు గుంపులుగా శరణాగతులైనట్లే మేముకూడా అహంకారమును వీడి నీ వాకిట చేరియున్నాము. చిరుగంటలా, అరవిరిసిన తామరపూవులాగా ఉన్న నీ కంటిచూపును మాపై కటాక్షించు స్వామీ!

సూర్యచంద్రులిరువురూ ఒకేసారి ఆకాశంలో ఉదయించినటులుగా నుండే నీ దివ్యనేత్రాలతో మావైపు అనుగ్రహంతో చూడు. ప్రారబ్దకర్మ కూడ భస్మమై మేము అనుభవింపవలసిన శాపంవంటి కర్మలు దానితో పటాపంచలైపోతాయి.

శ్రీమహావిష్ణువునకు సూర్యచంద్రులు ఇద్దరూ రెండు నేత్రములు. మహావిష్ణువు విశ్వరూపమును దర్శించుటకు ముందుగా అహంకారమును వీడవలయును. ఆపైననే ఆత్మనివేదనము సాధ్యమగును. ఈ స్థితినుండి దాస్యభావము దశకు చేరిన జీవునికి ఆ విశ్వరూపము దర్శించు మార్గము సుగమమగును. **'నీవే తప్ప నితఃపరంబెరుగ'** అన్న ఉన్నతదిశ భగవద్దర్శనమునకు అనువగు మార్గము.

(డా. వేదవ్యాస వ్యాఖ్యనుండి)

---

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

రామో విరామో విరతో (విరజో) మార్గో నేయో నయోఽనయః |

వీరః శక్తిమతాం శ్రేష్ఠో ధర్మో ధర్మవిదుత్తమః || (43)



శ్రీ సీతారామ పట్టాభిషేకము. 1940 కాలపు చిత్రం. వికీపీడియానుండి

396. రామః

రమింపజేయువాడు. నిత్యానంద స్వరూపుడు. అందరి ఆనందమునకు కారకుడు.

ఓం రామాయ నమః

రమంతే యోగినః అస్మిన్ ఇతి రామః – యోగులందరు ఆయనయందు రమించెదరు గనుక ఆయన రాముడు. ఈ విషయమై శ్రీ శంకరులు పద్మపురాణమునుండి ఉదాహరించారు.

రమంతే యోగినో యస్మిన్ నిత్యానందే చిదాత్మని

ఇతి రామ పదే నైతత్ పరం బ్రహ్మోऽభిధీయతే

నిత్యానందస్వరూపుడగు దేనియందు యోగులు నిరంతరము రమించుచుందురో అట్టి పరబ్రహ్మము 'రామ' శబ్దముతో కీర్తింపబడుచున్నది.

రెండవ అర్థము – శ్రీరాముని శుభగుణములవలన అందరికీ ఆనందము కలుగును. కనుక ఆయన రాముడు. జగదానందకారకుడు. ఇందుకు శ్రీభట్టులు పలు ఉదాహరణలు చెప్పారు –

రామో రమయతాం శ్రేష్ఠః (రామాయణము. అయోధ్యాకాండము. 53.1)

గుణాభిరామం రామంచ (మహాభారతము. సభాపర్వము. 58.42)

తథా సర్వప్రజాకాంతైః ప్రీతి సంజననైః పితుః

గుణైః విరురుచే రామః దీప్తః సూర్య ఇవాంశుభిః (రామాయణము. అయోధ్యాకాండము. 1.33)

రాముడు సకల జనులకు ప్రీతిపాత్రుడు. తండ్రికి ఆనందకారకుడు. సకల కళ్యాణగుణ సంపన్నుడు. సూర్యునివలె ప్రకాశించువాడు.

తిరుప్పావైలో అండాళ్ తల్లి '**మనతుక్కు ఇనియన్**' అని దేవదేవుని సంబోధించినది. రాముని రూపము శత్రువులనుకూడ ఆకర్షించునట్టిది. వాలి మరణ సమయమున తార, రావణుని మరణ సమయమున మండోదరి శ్రీరాముని దివ్యత్వమును గ్రహించారు.

శూర్పణఖ రామలక్ష్మణులను వర్ణించిన విధమును శ్రీ వి.వి. రామానుజన్ ఉదాహరించారు –

తరుణౌ రూపసంపన్నౌ సుకుమారౌ మహాబలౌ

పుండరీక విశాలాక్షౌ చీరకృష్ణాజినాంబరౌ

శ్రీ సత్యదేవో వాసిష్ఠ, శ్రీ వి.వి. రామానుజన్ '**క్రీడాయాం**' అనే మూలము ఆధారముగా వివరణ ఇచ్చారు. భగవంతుడు తన క్రీడ (లీల)వలన సంతోషించువాడు, సంతోషపరచువాడు గనుక రాముడు.

ధర్మచక్రము రచయిత ఇంకా ఇలా వివరించారు – క్షణికమైన ఆనందమునిచ్చి, దుఃఖకారణమైనవి ఒక విధమైన సుఖములు. శాశ్వతమైన ఆనందమునిచ్చు పరబ్రహ్మానుభవము మరొకటి. అట్టి సచ్చిదానంద శాశ్వత సుఖకారకుడైన పరబ్రహ్మమే రాముడు. కనుకనే రాముని దర్శనముకొరకు శబరి ప్రాణములను నిలుపుకొన్నది. రాముని దర్శించి ఋషులు పరవశించారు. కృష్ణునితో క్రీడించి గోపీజనులు ధన్యులయ్యారు.

రామ ఏవ పరంబ్రహ్మ రామ ఏవ పరంతపః
రామ ఏవ పరం తత్వం శ్రీరామో బ్రహ్మతారకమ్

“ఓం నమో నారాయణాయ” అనే అష్టాక్షరీమంత్రములోని బీజమైన **‘రా’** అక్షరమును, **“నమః శివాయ”** అనే పంచాక్షరీమంత్రములోని బీజాక్షరమైన **‘మ’** అక్షరమును కలుపగా వచ్చిన దివ్యమంత్రము పరమాత్మ నామమైనది. ఇది వారి కులగురువు వశిష్టమహర్షియొసర్చిన నామకరణము.

రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః

శ్రీ రామ రామ రఘునందన రామ రామ
శ్రీ రామ రామ భరతాగ్రజ రామ రామ
శ్రీ రామ రామ రణకర్కశ రామ రామ
శ్రీ రామ రామ శరణం భవ రామ రామ

శ్రీరామచంద్రచరణౌ మనసా స్మరామి
శ్రీరామచంద్రచరణౌ వచసా గృణామి
శ్రీరామచంద్రచరణౌ శిరసా నమామి
శ్రీరామచంద్రచరణౌ శరణం ప్రపద్యే

మాతా రామో మత్పితా రామచంద్రః
స్వామీ రామో మత్సఖా రామచంద్రః
సర్వస్వం మే రామచంద్రో దయాలుః
నాన్యం జానే నైవ జానే న జానే

దక్షిణే లక్ష్మణో యస్య వామే చ జనకాత్మజా
పురతో మారుతిర్యస్య తం వందే రఘునందనమ్

లోకాభిరామం రణరఙ్గధీరం రాజీవనేత్రం రఘువంశనాథం
కారుణ్యరూపం కరుణాకరం తం శ్రీరామచంద్రం శరణం ప్రపద్యే

మనోజవం మారుతతుల్యవేగం జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్
వాతాత్మజం వానరయూథముఖ్యం శ్రీరామదూతం శరణం ప్రపద్యే

కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకికోకిలమ్

ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదామ్
లోకాభిరామం శ్రీరామం భూయోభూయో నమామ్యహమ్

భర్జనం భవబీజానామర్జనం సుఖసంపదామ్
తర్జనం యమదూతానాం రామరామేతి గర్జనమ్

రామో రాజమణిః సదా విజయతే రామం రమేశం భజే
రామేణాభిహతా నిశాచరచమూః రామాయ తస్మై నమః
రామాన్నాస్తి పరాయణం పరతరం రామస్యదాసోస్మ్యహం
రామేచిత్తలయః సదా భవతు మే భో రామ మాముద్ధర

శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే

397. విరామః

- ఆయనవద్దకొచ్చేసరికి అందరూ శక్తిహీనులవుతారు (వారి వారి శక్తులు విరమణ చేయబడుతాయి).
- అందరికి అంతిమ విశ్రాంతి స్థానము.

ఓం విరామాయ నమః

బ్రహ్మాది దేవతల శక్తులకు, వారిచే వరములు పొందినవారి శక్తులకు శ్రీమహావిష్ణువు విరామస్థానము. అనగా వారిశక్తులు ఆయనవద్ద విరమించును. **విరమ్యతే అస్మిన్ వరప్రదై బ్రహ్మాదిభిః వరైశ్చ అవధ్యాదిభిః లబ్ధ వరైశ్చ రావణాదిభిః ఇతి విరామః**

వరప్రదైః బ్రహ్మముఖ్యైః అవధ్యత్వాదిభిర్వరైః
యస్మిన్విరమ్యత ఇతి స విరామ ప్రకీర్తితః

రావణుడు, హిరణ్యకశిపుడు వంటివారు బ్రహ్మాది దేవతలనుండి ఎన్ని వరములు పొందినా అవి శ్రీనివాసునిముందు నిర్వీర్యమయ్యెను. ఎందుకంటే ఆయన అప్రమేయుడు. అమోఘుడు. విరాముడు. ఈ

వివరణతో శ్రీ భట్టులు రామాయణము సుందరకాండమునుండి హనుమంతుని భాషణముల నుదాహరించారు.

దేవాశ్చ దైత్యాశ్చ నిశాచరేంద్ర గంధర్వ విద్యాధర నాగయక్షాః
రామస్య లోకత్రయ నాయకస్య స్థాతుం న శక్తా స్సమరేషు సర్వే (సుందరకాండము 51.44)

దేవతలు, దైత్యులు, గంధర్వులు, విద్యాధరులు, నాగ, యక్షులు మొదలైనవారు విడివిడిగా గాని, కలిసిగాని ముల్లోకాధిపతియైన శ్రీరామునకు ఎదురుగా యుద్ధమందు నిలువజాలరు.

బ్రహ్మా స్వయంభూ శ్చతురాననో వా రుద్రస్త్రినేత్ర స్త్రిపురాంతకో వా
ఇంద్రో మహేంద్ర స్సురనాయకో వా త్రాతుం న శక్తా యుధి రామవధ్యమ్

సమరమున శ్రీరాముని చేతిలో చావు మూడినవానిని స్వయంభువు, చతుర్ముఖుడు ఐన బ్రహ్మగాని, త్రినేత్రుడు, త్రిపురాంతకుడు అయిన రుద్రుడుగాని, మహైశ్వర్య సంపన్నుడు, సురపతియు ఐన దేవేంద్రుడుగాని రక్షింపజాలరు.

అన్నింటికి, అందరికి అంతిమ విరామ స్థానము గనుక భగవంతుడు 'విరాముడు' అని శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు. **విరామః అవసానమ్ ప్రాణినామ్ అస్మిన్ ఇతి విరామః.**

శ్రీ రాధాకృష్ణశాస్త్రి రామాయణము (2.8.13)నుండి చెప్పిన ఉదాహరణ –

న హి తస్మాత్ మనః కశ్చిత్ చక్షుషీవా నరోత్తమాన్
నరః శక్నోత్యపాక్రష్టుమ్ అతిక్రాంతే అభిరాఘవే

శ్రీరాముని దర్శించినవారు, ఆయనపై మనసు నిలిపినవారు ఇంక తమ మనసును మరలించడానికి యత్నించరు.

శ్రీ చిన్మయానంద – భగవంతుని చేరినవారికి మరల పునర్జన్మయుండదు గనుక రాముడే విరాముడు. ఇదే నామమునకు కొందరు వ్యాఖ్యానకర్తలు 'ప్రళయకాళమున భిన్నత్వము ఏకత్వములో విలీనమగును' అని అర్థము చెప్పారు. **యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ** – అని భగవద్గీతలో భగవానుడు ప్రవచించెను. ఇది గ్రహించి విరాముని ధ్యానించవలెను.

'రామ'. 'విరామ' నామముల భావములను అనుసంధిస్తూ శ్రీ సత్యదేవోవాసిష్ఠ ఇలా చెప్పారు – **రమంతే అస్మిన్ రామః, విరమంతి అస్మిన్ ఇతి విరామః** – ఎవనియందు జనులు ఆనందింతురో ఆయన రాముడు. ఎవనియందు జనులు విశ్రమింతురో ఆయన విరాముడు. **యత్ర రమణమ్ తత్ర రమణ అవసానమ్** – ఆనంద స్థానమే విశ్రాంతిస్థానము. సృష్టికారకుడు, లయకారకుడు కూడ ఆయనే. పంచభూతములనుండి జనించినది పంచభూతములయందే కలిసిపోయినట్లు, ఉదయించిన సూర్యుడు అస్తమించినట్లుగాని, ఆ

పరమేశ్వరుని చేతనే జగములు జనించును. ఆయనలోపలనుండును. ఆయనయందు డిందును. ఇందుకు శ్రీ సత్యదేవోవాసిష్ఠ శృతులనుండి పెక్కు ఉదాహరణలు చెప్పారు –

తస్మిన్ ఇదమ్ సమ్ చ విచయితి సర్వమ్ స ఓత ప్రోతశ్చ విభుః ప్రజాసు – యజుర్వేదము 32.8
యో మారయతి ప్రాణయతి యస్మాత్ ప్రాణంతి భువనాని విశ్వా – అధర్వణవేదము 13.3.3.
కాలేనోదతి సూర్యః కాలేనివిశతే పునః – అధర్వణ వేదము 19.54.1
యత్రామృతమ్ చ మృత్యుశ్చ పురుషేఽధి సమాహితే – అధర్వణ వేదము 10.5..17

398. విరజో-మార్గః, విరతోమార్గః

విరజః - రజోగుణము లేనివాడు (పూర్ణ సత్వస్వరూపుడు).

విరతః - విషయచింతన (ఆసక్తి) లేనివాడు.

మార్గః - ఆయనను పొందుటకు ఆయనే దారి.

విరజోమార్గః - దోషరహితమైన మార్గము చూపువాడు.

విరతో మార్గః - ఆయన విషయచింతన లేనివాడైనను అందరూ ఆశించువాడు.

ఈ నామపాఠముగురించి వేరువేరు అభిప్రాయములున్నవి. ఒకే నామముగా భావించినవారు 'విరజోమార్గః' అనీ, రెండు నామములుగా భావించినవారు 'విరతః', 'మార్గః' అనీ అధికంగా చెబుతున్నారు. కొంతమంది ఒకే నామముగా లెక్కవేసి, అర్థము మాత్రము రెండు నామములుగా చెబుతున్నారు.

34వ శ్లోకములో ('ఇష్టోఽవిశిష్టః' లేదా 'ఇష్టః' మరియు 'విశిష్టః' నామములుగా) ప్రారంభమైన సంఖ్యాభేదము ఈ 43వ శ్లోకముతో మరల కలిసిపోవుచున్నది (వ్యాఖ్యలనుబట్టి). మొత్తానికి వివిధ భాష్యకారులు బహువిధములైన భగవద్గుణానుభవములను ఈ నామవ్యాఖ్యద్వారా మనకు ప్రసాదించారు.

ఓం విరతాయ నమః

విగతమ్ రతమ్ అస్య విషయ సేవాయామ్ ఇతి విరతః – విషయములందు రతము (అనురక్తి, చింతన, కోరిక) లేనివాడు గనుక భగవానుడు విరతుడు. అయోధ్యాపురమున పట్టాభిషేకము చేజారినపుడు శ్రీరాముడు చింతితుడు కాలేదు. రాత్రిసమయములో చంద్రుని చల్లదనము, సౌందర్యము విడచిపోవు. అదేవిధముగా రాజ్యము దూరమైనను రామచంద్రుడు చిదానంద స్వరూపుడే.

న చాస్య మహతీమ్ లక్ష్మీమ్ రాజ్యనాశోఽపకర్షతి
లోక కాంతస్య కాంతత్వమ్ శీతరశ్మేరివ క్షపా – అయోధ్యాకాండము 19.32

సుందరకాండము (36.29)లో సీతమ్మతల్లి హనుమంతునితో నిట్లన్నది –

ధర్మోపదేశాత్ త్యజతశ్చ రాజ్యమ్

మామ్ చాప్యరణ్యమ్ నయతః పదాతిమ్

ధర్మము కొరకు రాజ్యమును త్యజించి కాలినడకన మాతో అడవులకు వెడలినపుడు ఆయన ముఖమున బాధగాని, నిరుత్సాహముగాని, భయముగాని లేవు.

శ్రీ వి.వి. రామానుజన్ – భీకరయుద్ధంలో రావణుని కూల్చినాగాని లంకారాజ్యముపై రాముని కిసుమంతయినా ఆసక్తి లేదు. విభీషణునికి పట్టముగట్టి ఆయన ఆనందభరితుడయ్యెను. శ్రీరాముని విరత గుణమునకు ఇది మరొక తార్కాణము.

ఓం విరజాయ నమః

శ్రీ చిన్మయానంద – రజోగుణము, మనోవికారములు లేనివాడు. సంపూర్ణశుద్ధ సత్వ స్వరూపుడు గనుక విరజుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఒక్కో నామము అర్థమును వివరిస్తూ ఒక్కో శ్లోకమును రచించారు. 'విరజః' నామార్థములో ఆయన చెప్పిన శ్లోకము –

రజో న తస్మిన్ న తమశ్చ తస్మిన్

సత్వ స్వభావో హి స విష్ణురుక్తః

నోఽస్తి స్వభావాత్ అమితో ప్రకాశో

దేవేఽస్తి గీతః తమసః పరస్తాత్

ఓం మార్గాయ నమః

ఇంతకుముందు "**విక్షరో రోహితో మార్గో హేతుః** ... ." అనే 40వ శ్లోకములో ఈ నామము 367వ నామముగా స్తుతింపబడినది.

మార్గయతే ఇతి మార్గః – శాస్త్రానుబద్ధమైన జీవనము సాగించువారలకు జ్ఞానస్వరూపుడైన భగవంతుడే మార్గము. (మృజు – శుద్ధౌ – అనే ధాతువునకు 'శుద్ధి చేయుట' అని అర్థము.) భరద్వాజునివంటి మునివర్యులుకూడ శ్రీరాముని అనుసరించారు. (జ్ఞానసముపాసనామార్గము శ్రీమన్నారాయణుని స్వరూపమే) అని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. భగవత్ప్రాప్తి గమ్యము. అందుకు భగవంతుడే మార్గము.

శ్రీ శంకరులు తైత్తరీయోపనిషత్తు (3.13)నుండి చెప్పిన ప్రమాణము –

నాన్యః పంథా విద్యతేऽయనాయ – వేరు మార్గము లేదు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి బృహదారణ్యకోపనిషత్తు (4.49) నుండి చెప్పిన ప్రమాణము –

ఏషా పంథా బ్రహ్మణా హానువిత్తః

పరశురాముడు, వాలి, రావణుడు తదితరులు శ్రీరాముని దర్శనమువలననే భగవత్తత్త్వము తెలిసికొన్నారని ధర్మచక్రము రచయిత వివరించారు.

గజేంద్రుని ప్రార్థన –

ముక్తసంగులైన మునులు దిదృక్షులు
సర్వభూతహితులు సాధుచిత్తులు
అసదృశ వ్రతాఢ్యులై కొల్తురెవ్వని
దివ్యపదము వాడు దిక్కు నాకు

ఓం విరజోమార్గాయ నమః

శ్రీ భట్టులు 'మార్గః' అనే నామంగానూ, 'విరజోమార్గః' అనే నామంగానూ కూడా పరిగణించారు. 'విరజోమార్గః' అనగా దోషరహితమైన మార్గము (కలవాడు).

పాతస్తు విరజోమార్గ ఇతి నిర్దోష దర్శితః
సంధాస్యాద్యేన విరజోమార్గ స్సన్మార్గ దర్శనాత్

పరమపదాన్ని చేర్చే అర్చిరాదిమార్గమును తన భక్తులకు చూపినవాడు.

ఓం విరతోమార్గాయ నమః

శ్రీ శ్రీనివాసరాఘవన్ 'విరతోమార్గః' అనే ఏకనామమును పరిగణించారు. భగవంతుడు నిరాసక్తుడు అయినప్పటికీ అందరూకోరే (దివ్యపదము) దివ్యమార్గము భగవంతుడే.

శ్రీ భట్టులు 'మార్గః', 'విరజోమార్గః' అనే రెండు విధాల నామములనూ పరిగణించారు.

శ్రీ శంకరులు 'విరతః', 'మార్గః' అనే రెండు వేరువేరు నామములుగా పరిగణించారు.

399. నేయః

- (భక్తుల మాటలకు) విధేయుడై యుండువాడు.
- అన్ని విధములుగాను ప్రాప్తిని కోరుటకు అర్హుడు (గమ్యముగా కోరదగినవాడు).
- మార్గమును చూపించువాడు.

ఓం నేయాయ నమః

'నేత' అనగా నడిపించువాడు. 'నేయ' అనగా నేతను అనుసరించువాడు. 'నియోగము' అనగా ఆదేశము. **నియోగ అర్హత్వాత్ నేయః** – అని శ్రీ భట్టులు వివరించారు. ఆదేశములకు అనుగుణముగా వర్తించుటకు (భక్తులు) ఎవరిని నమ్ముకొనవచ్చునో ఆయనే నేయుడు. భక్తజనాదేశ విధేయుడు. భక్తులు చెప్పినట్లుగా నడచుకొనువాడు. ఇందుకు శ్రీ భట్టులు పెక్కు ప్రమాణములు చెప్పారు –

ఆజ్ఞాప్యోఽహమ్ తపస్వినామ్ (రామాయణము. అరణ్యపర్వము. 6.22) – తాపసుల ఆజ్ఞలను నేను అనుసరింతును. (అని రాముడు పలికెను)

నియుంక్ష్వ చాఽపి మామ్ కృత్యే సర్వం కర్మాస్మి తే వచః (మహాభారతము. అనుశాసన పర్వము. 33.25) – నీవు చెప్పినదేదైనా నేను నెరవేర్చెదను (అని కృష్ణుడు యుధిష్ఠిరునితో అనెను).

అయమస్మి మహాబాహో బ్రూహియత్తే వివక్షితమ్
కరిష్యామీహ తత్సర్వమ్ యత్త్వమ్ వక్ష్యసి భారత (మహాభారతము. అరణ్యపర్వము. 71.5)
భరతవీరా! నీవు చెప్పినది చేయడానికే నేనిక్కడున్నాను. నీవు చెప్పినట్లే అంతా చేస్తాను.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ వివరణ – **ప్రాప్యః ప్రాప్తుమ్ యోగ్యః** – (భక్తులకు) ప్రాప్తి కొరకు ప్రయత్నించడానికి యోగ్యమైనవాడు. ధ్యాన, స్మరణ, భక్తి మార్గముల ద్వారా ఏ దేవదేవుని ప్రాప్తి కొరకు సాధన చేయదగునో అట్టి దేవదేవుడు. **సర్వ ప్రమాణ అవిషయత్వాత్ స మనసా నేతుమ్ అర్హః.**

శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి – 'నేయః' అనగా మార్గదర్శి. భక్తులకు భగవంతుడు మార్గము మాత్రమే కాక ఆ మార్గమున మార్గదర్శియును ఆ కరుణామయుడే గదా కనుక 'నేయః' అని ప్రసిద్ధుడయ్యెను.

400. నయః

అందరిని తనవైపు లాగుకొనేవాడు (నడిపించువాడు, ఆకర్షించుకొనేవాడు).

ఓం నయాయ నమః

నయతి ఇతి నయః – అందరిని తనవైపు లాగుకొనేవాడు. **నీయంతే అస్మిన్నితి నయః** – మహానుభావులు కూడా తన మాటలను ఆచరించునట్లుగా చేయువాడు. **యస్మిన్ తపోధనా నిత్యం నీయంత ఇతి వై నయః** – తపోధనులైన మహర్షిపుంగవులు కూడా తన ఆజ్ఞను ఉల్లంఘించలేనట్లుగా ఆకర్షించేవాడు.

తపోధనసంపన్నులైన మహర్షులుకూడ తమ రక్షణాభారమును శ్రీరామచంద్రునికి అప్పగించిరి. శ్రీ శ్రీవరాహావతారమున భగవంతుని పలుకులను శ్రీ వి.వి.రామానుజన్ ఉదాహరించారు – **నయామి పరమామ్ గతిమ్** – అందరిని పరమపదమునకు నడిపించెదను. గీతోపదేశముద్వారా భగవంతుడు అర్జునుని కర్తవ్యమార్గమున నడిపించిన విధమును ధర్మచక్రము రచయిత ఉదాహరించారు. ఈ పుణ్యనామము ద్వారా తెలియవచ్చేదేమంటే భగవంతునిపై దృష్టి సారించి, ఆయన ననుసరించుటయే మోక్షమార్గము. ఆయనే మోక్షము.

శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి – పైమూడు నామములను పరిశీలించినయెడల

మార్గః - భగవంతుడే మార్గము.

నేయః - భగవంతుడే దారి చూపువాడు.

నయః - భగవంతుడే నడిపించువాడు.

భక్తులు పూర్ణమగు శ్రద్ధతో భగవానుని ఆశ్రయించినచో ఆయనయే మార్గమై - మార్గదర్శియై - నాయకుడై - సారధియై - సచివుడై - నెయ్యమై - అండయై - దండయై - జంటయై - వెంటనంటి చరించుచు గమ్యమునకు తీసికొనిపోవును.

401. అనయః

- తేలిక కానివాడు (ఆయనను తొలగించుట, తృణీకరించుట అసాధ్యము).
- ఆయన లేకున్న భాగ్యములు లేవు.
- అందరినీ నడుపువాడు. ఆయనను నడిపేవారు లేరు.

ఓం అనయాయ నమః

ఆయనను కదిలించుట అసాధ్యము. ఆయన దృఢుడు. నిశ్చలుడు. ఈ భావమును వివరించుచు శ్రీ భట్టులు రామాయణమునుండి ఉదాహరించారు. రావణుడు బ్రహ్మదత్తమైన శక్తిని సౌమిత్రిమీద ప్రయోగించాడు. లక్ష్మణుడు దాన్ని నిరోధించాలని బాణాలతో కొట్టాడు. కాని అది అతని వక్షస్థలంమీద నాటుకుంది. దాని ప్రభావానికి లక్ష్మణుడు తెలివితప్పాడు. వెంటనేవచ్చి రావణుడు లక్ష్మణుని పట్టుకొనిపోబోయాడు కాని ఎత్తలేకపోయాడు. కైలాసం ఎత్తవచ్చు. మందర పర్వతం ఎత్తవచ్చు. త్రిలోకాల్ని పైకెత్తి పట్టుకోవచ్చు. కాని యుద్ధరంగంలో ఉన్నంతసేపూ శత్రువు ఎంతటివాడయినా లక్ష్మణుడిని ఎత్తలేడు. లక్ష్మణుడు బ్రహ్మదేవుని శక్తి తన వక్షస్థలంమీద నాటగానే తాను విష్ణుభాగం అయిఉండడం తలుచుకొన్నాడు. అంచేతనే రావణుడు

సౌమిత్రిని ఎత్తలేకపోయాడు. ... ... తరువాత తేజఃశాలియైన హనుమంతుడు లక్ష్మణుని తన భుజాలతో ఎత్తి రామునివద్ద పడుకోబెట్టాడు. హనుమంతుడు హితుడూ, పరమభక్తుడూ గనుక లక్ష్మణుడు అతని చేతిలో చాలా తేలిక అయినాడు ... (బ్రహ్మశ్రీ కొంపెల్ల వెంకటరామశాస్త్రి రచన – వాల్మీకి రామాయణం. సరళ సుందర వచనము – నుండి)

శ్రీ భట్టులే మరొక భావమును కూడ చెప్పారు – 'అయః' అనగా భాగ్యమును కలుగజేయు సాధనములు, మార్గములు. 'అనయః' అనగా ఆయన లేనియెడల భాగ్యము ఉండజాలదు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – అందరికి దారి చూపేది, దారిలో నడిపించేది, దారి కూడ శ్రీహరియే. కనుక ఆయనకు మార్గదర్శి వేరొకరుండజాలరు. అందువల్ల ఆయన అనయుడు.

భగవానుడు పరస్పర విరుద్ధములైనట్లుగా కనిపించే తత్వాన్ని శ్రీ సత్యదేవో వాసిష్ఠ వివరించారు.

నయః - నడచువాడు, నడిపించువాడు.

అనయః - కదలనివాడు.

ఇలా ఉండుట భగవత్తత్వము. ఇందుకు శాస్త్రములలో పెక్కు ఉదాహరణలున్నవి.

తదేజతి, తన్నైజతి – అనేజాదేకమ్ మనసో జవీయో – ఈశావాస్యోపనిషత్తు.

అరమ్ కామాయ హరయో వధన్విరే స్థిరాయ హిన్వాన్ హరయో హరీతురా – ఋగ్వేదము 10.96

402. వీరః

వీరుడు. శత్రుభయంకరుడు. బలపరాక్రమ తేజః సంపన్నుడు.

ఓం వీరాయ నమః

'వీరః' అనే నామము రెండు లేదా మూడు మార్లు వస్తుంది.

43వ శ్లోకము. 402వ నామము. వీరః – **వీరః శక్తిమతాంశ్రేష్ఠో ధర్మో ధర్మవిదుత్తమః**

67వ శ్లోకము. 649వ నామము. వీరః – **కాలనేమినిహా వీరః శౌరిః శూరజనేశ్వరః** (శ్రీ శంకరుల పాఠము ప్రకారము)

70వ శ్లోకము. 64వ నామము. వీరః – **అనిర్దేశ్యవపుః విష్ణుః వీరః అనంతో ధనంజయః**

సజ్జనులను బాధించు దుష్టులను తన తిరుగులేని బాణములద్వారా నాశనము చేయువాడు వీరుడు.

విక్రమశాలిత్వాత్ వీరః – అని శ్రీ శంకరుల భాష్యము.

శ్రీ వి.వి. రామానుజన్ వివరణ – వీరత్వము, శౌర్యము, పరాక్రమము అనేవి భగవానుని మహాగుణములు. ఈ మూడు గుణములను భీష్మపితామహుడు 'వీరః' అని స్తుతించెను. వీరత్వము శత్రువుల గుండెలలో

కంపనము సృష్టించును. శూరుడు (శౌర్యము గలవాడు) ఏకాకిగానైనను శత్రు సమూహములో చొరబడి వారిని ఛిన్నాభిన్నము చేయును. పరాక్రమశాలి తాను ఇసుమంతయినా గాయపడకుండానే శత్రుసైన్యమును నిర్మూలించును. 'రఘువీర గద్యము' ప్రారంభవచనమే **"జయ జయ మహావీర!"**

భగవంతుని వీరత్వమును ప్రస్తావించే పెక్కు ఉదాహరణలను శ్రీ భట్టులు చెప్పారు.

వృక్షే వృక్షే చ పశ్యామి చీరకృష్ణాజినాంబరమ్
గృహీత ధనుషామ్ రామమ్ పాశహస్తమివాంతకమ్ – రామాయణము. అరణ్యకాండము. 39.14
ప్రతి చెట్టులోనూ నాకు కృష్ణాజినధారియైనవాడు, ధనుస్సును ఎక్కుపెట్టినవాడును, యమపాశములవంటి బాణములను సంధించినవాడును అయిన రాముడే కనిపిస్తున్నాడు. అని మారీచుడన్నాడు. రాముడి పేరు వినేటప్పటికి మారీచుని ఒడలు నీరుకారి వాడిమొగంలో ప్రేతకళ వచ్చేసింది. పెదవులెండిపోయాయి. నిలువుగ్రుడ్లు పడిపోయాయి. భయంతో కొయ్యబారిపోయాడు. (బ్రహ్మశ్రీ కొంపెల్ల వెంకటరామశాస్త్రి రచన – వాల్మీకి రామాయణం. సరళసుందర వచనము – నుండి)

రకారాదీని నామాని రామత్రస్తస్య రావణ
రత్నాని చ రథాశ్చైవ విత్రానం జనయంతి మే
రత్నాలు, రథము – ఇలా 'ర'తో మొదలయ్యే ఏ పదం విన్నా నాకు రాముడే గుర్తువచ్చి కంపనం కలుగుచున్నది.

మాతంగ ఇవ సింహేన గరుడేనేవ పన్నగః
అభిభూతోऽభవ భవద్రాజా రాఘవేణ మహాత్మనా – యుద్ధకాండము. 60.2
బ్రహ్మదండ ప్రకాశానామ్ విద్యుత్ సదృశ వర్చసామ్
స్మరన్ రాఘవ బాణానామ్ వివ్యతే రాక్షసేశ్వర – యుద్ధకాండము. 60.3
కోదండపాణి ప్రకాశహీనుడైన లంకేశ్వరునితో – రావణా! నువ్వు మహాభయంకరమైన యుద్ధం చేశావు. ప్రస్తుతం నువ్వు బాగా అలసియున్నావు కనుక, నిన్నిప్పుడు వధించక విడిచిపెడుతున్నాను. నేను అనుమతిస్తున్నాను. లంకలోకి వెళ్ళి అలసట తీర్చుకో. అప్పుడు నా బలం ఏపాటిదో చూడగలవు – అని హెచ్చరించి పంపేశాడు. రావణుడు అంతఃపురంలో ప్రవేశించి చాలాసేపు దుఃఖించాడు. సింహాన్ని చూసిన ఏనుగులాగా, గరుత్మంతుని చూచిన నాగుపాములాగా, అయోధ్యరాముణ్ణి తలచి రావణుడు వ్యాకులచిత్తుడైపోయాడు. బ్రహ్మాస్త్రాలవంటి, మెరుపుతీగలవంటి రామబాణాలు గుర్తుకొస్తే చాలు అతను గడగడలాడిపోయాడు. (బ్రహ్మశ్రీ కొంపెల్ల వెంకటరామశాస్త్రి రచన – వాల్మీకి రామాయణం. సరళసుందర వచనము – నుండి)

ఇంకా శ్రీ వి.వి. రామానుజన్ దివ్యప్రబంధాలనుండి చాలా ఉదాహరణలు చెప్పారు – పెరుమాళ్ తిరుమొళి 10.1, 10.3, సిరియ తిరుమడాల్, తిరుప్పావై మొదలగునవి. తిరుప్పావై 13వ పాశురములో గోదామాత 'రావణుని పది తలలను గిల్లివేసినవాడు' అని శ్రీరాముని వర్ణించినది. 'యుద్ధసమయములో ఖరదూషణులకు నరకము చూపినాడు' అని తిరుమంగై సిరియతిరుమడల్ లో రాముని స్తుతించిరి.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ శ్రుతులనుండి చెప్పిన ప్రమాణములు –

శృణ్వే వీరో విందమానో వసూని మహద్దేవానామ్ అసురత్వమేకమ్ – ఋగ్వేదము 3.55.10

స ఘా వీరో న రిష్యతే యమింద్రో బ్రహ్మణస్పతిః సోమో హినోతి మర్త్యమ్ – ఋగ్వేదము 2.28.4

శ్రీ రాధాకృష్ణశాస్త్రి 'వీర' శబ్దమును చక్కని పదములలో వర్ణించారు (మూలమును చెప్పలేదు) –

యస్మాత్ స్వమహిమ్నా సర్వాన్ లోకాన్ సర్వాన్ దేవాన్ సర్వానాత్మనః సర్వాణి భూతాని విరమతి విరామయతి, అజస్రమ్ సృజతి విస్సృజతి వాసయతి, యతో వీరః కర్మణ్యః సుదృక్షో యుక్తగ్రావ జాయతే దేవకామః తస్మాత్ ఉచ్యతే వీరమ్ ఇతి –

ఆయనను ఎదిరించ శక్యము కాదు. జయించ సాధ్యము కాదు. ఆయన బలపరాక్రమములు స్వయంప్రకాశమానములు. శత్రునాశకములు. కనుక ఆయన వీరుడు.

403. శక్తిమతాం శ్రేష్ఠః

- శక్తిమంతులైనవారిలోకెల్ల శక్తిగలవాడు.
- శక్తిమంతులైన దేవతలచే కొనియాబడువాడు.

ఓం శక్తిమతాం శ్రేష్ఠాయ నమః

శక్తిమతామపి శక్తిమతత్వాత్ శక్తిమతాం శ్రేష్ఠః – శక్తిమంతులైనవారికంటె శక్తిమంతుడు, ఉత్తముడు, ప్రధముడు.

సురాదీనాం శక్తిమతాం యః ప్రశస్యత మస్స్మృతః
తస్మాచ్ఛక్తిమతాం శ్రేష్ఠః దశార్ణ శ్రేష్ఠదోమనుః
శక్తిమంతులైన వారిచేత, దేవతలచేత కొనియాడబడువాడు. బ్రహ్మాదులకు కూడ శక్తిని ప్రసాదించువాడు. ఇంద్రాది దేవతలు రక్షణకొరకు ఆయనను శరణుజొచ్చెదరు. ఈ నామము దశాక్షరీమంత్రము. శ్రేష్ఠమైనవానినిచ్చును. ఓం శక్తిమతాంశ్రేష్ఠాయ నమః.

పరశురాముడు శ్రీరామునితో ఇట్లనెను – **అక్షయం మధుహంతారం జానామి త్వాం సురేశ్వరమ్** (రామాయణము. బాలకాండము. 76.17) – రామా! నీవు అక్షయుడవు. మధుసూదనుడవు అని తెలిసికొనుచున్నాను. సురేశ్వరుడవు నీవే.

శ్రీభట్టులు హనుమంతుడు రావణునితో చెప్పిన పలుకుల నుదాహరించారు (సుందరకాండము 51-40, 41, 42, 43, 44, 45. గీతాప్రెస్ వారి ప్రచురణ – అనువాదం. డా. యం. కృష్ణమాచార్యులు, డా. గోలి వెంకట్రామయ్య) – మహాయశస్వియైన శ్రీరామచంద్రుడు రుద్రునివలె సమస్తలోకములను సంహరింపగలడు. పంచభూతాత్మకములైన చరాచరములతో నిండినవాటినన్నింటిని మఱల అదేవిధముగా క్షణకాలములో సృష్టింపగలడు. దేవతలలో, అమరులలో, నరేంద్రులలో, యక్షులలో, రాక్షసులలో, విద్యాధరులలో, సమస్త గంధర్వులలో, నాగులలో, సిద్ధులలో, కిన్నరులలో, పక్షులలో, సకల ప్రాణులలో ఎవ్వరును విష్ణుతుల్య పరాక్రముడైన శ్రీరాముని ఎదిరించి, యుద్ధము చేయుటకు ఏ విధముగనైనను, ఎచ్చటనైనను, ఏ కాలమునందైనను సమర్థులు గారు. సకల లోకములకు ప్రభువు, రాజశ్రేష్ఠుడు ఐన శ్రీరామునియెడ ఈ విధముగా ఘోరమైన అపరాధము గావించి, ఇక నీవు జీవించియుండుట అసాధ్యము.

దేవాశ్చ దైత్యాశ్చ నిశాచరేంద్ర - గంధర్వ విద్యాధర నాగయక్షాః
రామస్య లోకత్రయ నాయకస్య -స్థాతుం న శక్తా స్సమరేషు సర్వే

ఓ రాక్షసరాజా! దేవతలు, దైత్యులు, గంధర్వులు, విద్యాధర, నాగ, యక్షులు మొదలైనవారు విడివిడిగా గాని, కలిసి గాని ముల్లోకాధిపతియైన శ్రీరామునకు ఎదురుగా యుద్ధములయందు నిలువజాలరు. సమరమున శ్రీరామునిచేతిలో చావుమూడినవానిని స్వయంభువు, చతుర్ముఖుడు ఐన బ్రహ్మగాని, త్రినేత్రుడు, త్రిపురాంతకుడు ఐన రుద్రుడుగాని, మహైశ్వర్య సంపన్నుడు, సురపతియు ఐన దేవేంద్రుడు గాని రక్షింపజాలరు.

404. ధర్మః

- మూర్తీభవించిన ధర్మస్వరూపుడు.
- సర్వమును ధరించువాడు.

ఓం ధర్మాయ నమః

ధృఙ్ – ధారణే – **ధారయతి ఇతి ధర్మః** – ధరించునది ధర్మము. **ధార్యతే వా యేన జగత్ ఇతి ధర్మః** – ఎవరిచే జగత్తు ధరించబడినదో (నిలుపబడినదో) అతడే ధర్మము. అని శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఈ నామము అర్థమును వివరించారు.

శ్రీ భట్టుల వివరణ – అందరికీ ఐశ్వర్యమును, మోక్షమును ప్రసాదించి వారిని ధరించువాడు గనుక భగవానుడు ధర్మము. యుద్ధకాండములో బ్రహ్మదేవుడు శ్రీరామునిగూర్చి ఇలా చెప్పాడు – **లోకానామ్**

త్వమ్ పరమో ధర్మః – సమస్త లోకములకును నీవు పరమధర్మమువు. మహాభారతములో – **సాక్షాత్ దేవః పురాణోऽసౌ సహి ధర్మః సనాతనః** – ఆయనే పురాణ దేవుడు. సనాతన ధర్మము.

యే చ వేదవిదో విప్రాః యే చ అధ్యాత్మవిదో జనాః
తే వదన్తి మహాత్మానమ్ కృష్ణమ్ ధర్మమ్ సనాతనమ్
వేదవిదులైన బ్రాహ్మణులు, బ్రహ్మజ్ఞానము తెలిసినవారు మహాత్ముడైన కృష్ణుడే సనాతనుడు, ధర్మము అని చెప్పుదురు.

శ్రీ వి.వి. రామానుజన్ వివరణ – అరణ్యకాండములో మారీచుడు రామునిగురించి ఇలా చెప్పాడు. రాముడు మూర్తీభవించిన ధర్మము.
రామో విగ్రహవాన్ ధర్మః సాధుః సత్యపరాక్రమః
రాజా సర్వస్య లోకస్య దేవానామివ మానవః

అండాళ్ తల్లి నాచియార్ తిరుమోళిలో భగవంతునిపై తనకున్న చనువు కారణంగా ఆయనను **'ధరుమామ్ అఱియాక్ కురుంబన్'** అని సంబోధించినది.

'ధర్మము' అనే పదము భావమును శ్రీ చిన్మయానంద మరింత విస్తారంగా చర్చించారు. దేని కారణముచేత ఒక పదార్ధము నిలిచియుండునో (ఉనికి కలిగియుండునో) అది ఆ పదార్ధ ధర్మము. ఉదాహరణకు తీయగా నుండుట పంచదార ధర్మము. వేడిగానుండుట నిప్పు ధర్మము. ఆయా ధర్మములు లేనియెడల ఆయా పదార్ధములకు ఉనికియుండదు. అలాగే సకల జీవులకు ధర్మము ఆత్మ (ఆత్మ లేనిచో జీవుడు ఉండుట అసంభవము). అటువంటి ఆత్మలన్నీ పరమాత్ముని వలననే ఉనికి కలిగియుండును. కనుక భగవంతుడు పరమధర్మము.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – **ధర్మో రక్షతి రక్షితః, ధర్మయేవ హతోహన్తి.** ధర్మము మార్గమునకు ఇరువైపులా ఉండే హద్దువంటిది. హద్దులలోపల మార్గాన్ని అనుసరించేవారు గమ్యాన్ని చేరుతారు. హద్దుమీరినవారు ప్రమాదాల పాలౌతారు. అలాగే భగవంతుడు ధర్మబద్ధులను కాపాడుతాడు. ధర్మసంస్థాపనకై యుగయుగమున అవతరిస్తాడు. ధర్మచక్రము రచయిత ఈ విషయముపై పెక్కు ఉదాహరణలిచ్చారు. ధర్మమును నమ్ముకొన్న హరిశ్చంద్రునకు, పాండవులకు భగవంతుడు అండ. ధర్మమును అతిక్రమించిన రావణునకు, దుర్యోధనునకు నాశనము తప్పలేదు. ధర్మము తెలిసినవాడైన భీష్ముడు దుర్యోధనుని పక్షాన ఉన్నాగాని ధర్మరాజుదే అంతిమవిజయం. విభీషణుని ధర్మబోధను తిరస్కరించిన రావణుడు తన అధర్మకార్యాలకు బలికాక తప్పలేదు. ఈ పుణ్యధర్మనామస్మరణ చేయువారికి భగవంతుని రక్షణ తప్పక లభిస్తుంది.

405. ధర్మవిదుత్తమః

- ధర్మము తెలిసినవారిలో శ్రేష్ఠుడు.

- ధర్మశాస్త్రములను ప్రసాదించినవాడు.

ఓం ధర్మవిదుత్తమాయ నమః

ధర్మ-విత్-ఉత్తమః – ధర్మము తెలిసినవారిలో ఉత్తముడు.

శ్రీ భట్టుల వివరణ – వశిష్ఠుడు, వామదేవుడు, మార్కండేయుడు వంటి గురూత్తములు కూడ ధర్మసందేహ నివృత్తి కోసం శ్రీరామునిపై ఆధారపడిరి. ధర్మవిదులలో ఉత్తముడనుటకు ఇంతకంటె వివరణ అవుసరం లేదు.

శ్రీ శంకరుల వివరణ – స్మృతులవంటి ధర్మశాస్త్రములు భగవంతుని ప్రసాదములు. కనుక ఆయనకంటె బాగా ధర్మము తెలిసినవారు లేరు. **శృతి స్మృతి మమైవాऽజ్ఞే** (విష్ణుధర్మోత్తరము 76.31).

ధర్మచక్రము రచయిత – ధర్మమేదో, ధర్మము కానిదేదో తెలిసికొనుట సులభము కాదు. శ్రీమహావిష్ణువును ధ్యానించుటవలన ధర్మాధర్మ విచక్షణ లభించును. అందుకు నిర్మలమైన మనస్సు అత్యవసరము. ఇదే సంగతి తిరుక్కురల్ లో చెప్పబడినది – **మనత్తుక్కాణ్ మాశిలన్ ఆదల్ అనైత్తు అఱన్.**

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

శ్రీసుందరకాండము సంక్షిప్త కథ

(తెలుగువికీపీడియా నుండి).

కిష్కింధ కాండ చివరిలో సీతాన్వేషణానికై దక్షిణదిశకు బయలుదేరిన బృందం ఎలాగో సాగర తీరానికి చేరుకొంటారు. నూరు యోజనాల అవతల రావణుని నగరం లంకలో సీత ఉండవచ్చునని సంపాతి ద్వారా తెలుసుకొంటారు. కాని సాగర తరణం సాధ్యమయ్యేది ఎలాగని హతాశులౌతారు. జాంబవంతుని ప్రేరణతో సాగరాన్ని తాను గోష్పాదం లాగా లంఘించగలనని హనుమంతుడు సన్నద్ధుడౌతాడు. అక్కడినుండి సుందరకాండ కథ మొదలౌతుంది.

హనుమంతుని సాగర తరణం

హనుమంతుడు పర్వత సమానంగా దేహాన్ని పెంచి, సాగరాన్ని దాటడానికి సన్నద్ధుడై మహేంద్రగిరిపైకి ఎక్కాడు. సూర్యునికి, ఇంద్రునికి, బ్రహ్మకు, భూతకోటికి నమస్కరించాడు. పిక్కలు బిగబట్టి, చేతులు అదిమి, ఒక్కుదుటున

లంఘించాడు. ఆ అదురుకు పర్వతం బీటలు వారింది. ఆకాశంలో మేఘంలా, విడచిన రామబాణంలా, హనుమంతుడు వేగంగా లంకవైపుకు వెళ్ళసాగాడు.

రామ కార్యానికి సహాయపడదలచి, దారిలో మైనాకుడనే పర్వతం తనపై విశ్రాంతి తీసికోమని కోరాడు. ఆ ఆతిథ్యాన్ని వినయంతో తిరస్కరించి హనుమంతుడు ముందుకు సాగాడు. సురస అనే నాగమాత హనుమను పరీక్షింపదలచి, మృత్యుగహ్వరంలాంటి తన నోరు తెరచి అతని దారికి అడ్డు నిలచింది. యుక్తిగా ఆమె నోట ప్రవేశించి, మళ్ళీ బయటకు వచ్చి, ఆమె ఆశీర్వచనం పొంది హనుమంతుడు ముందుకు సాగాడు. సింహిక అనే ఛాయాగ్రాహక రాక్షసి హనుమంతుని నీడను పట్టి లాగసాగింది. హనుమంతుడు శరవేగంతో దాని కడుపులో దూరి, కడుపును చీల్చి వేసి, అప్రతిహతంమైన రామబాణంలా లంకలోని త్రికూటగిరి శిఖరంపై వాలాడు.

లంకా నగర ప్రవేశం

దూరంనుండి లంకానగరం శోభను, సౌందర్యాన్ని, సురక్షిత వ్యవస్థను చూసి హనుమంతుడు ఆశ్చర్యపోయాడు. చీకటి పడిన తరువాత చిన్నపాటి దేహం దాల్చి నగరంలో ప్రవేశించబోయాడు. ద్వారం వద్ద లంకా నగరాధిదేవత లంకిణి అతనిని అడ్డగించిండి. హనుమంతుడు ఆమెను దండించాడు. అతడు కారణజన్ముడనీ, బ్రహ్మ చెప్పిన విధంగా లంకకు కీడు వాటిల్లనుందనీ లంకిణి గ్రహించింది. ద్వారం గుండా కాకుండా ప్రాకారాన్ని లంఘించి, ఎడమ కాలు ముందుంచి, హనుమంతుడు మయుని అపూర్వ సృష్టియైన లంకలో ప్రవేశించి, సీతను వెదుకసాగాడు. ఆ సమయంలో చంద్రోదయం జరిగి, లంకానగరం మరింత శోభాయమానం అయింది.

అంతఃపురంలో సీతాన్వేషణ

చిన్న శరీరము ధరించి, హనుమంతుడు రావణుని మందిరములోనూ, పానశాలలోనూ, పుష్పక విమానములోనూ .. అన్నిచోట్లా సీతను వెదకాడు. రాత్రి వేళ రావణుని మందిరంలో కాంతలు భోగ లాలసులై, చిత్ర విచిత్ర రీతులలో నిద్రిస్తూ ఉన్నారు. ఆ దృశ్యాలను చూచి కలవరపడిన హనుమంతుడు, తాను రామ కార్యాచరణ నిమిత్తం ఏ విధమైన వికారాలకూ లోను గాకుండా సీతాన్వేషణ చేస్తున్నందున తనకు దోషం అంటదని, తన బ్రహ్మచర్య దీక్షకు భంగం వాటిల్లదని సమాధానపడ్డాడు. పుష్పక నిమానం అందాన్ని, రావణుని ఐశ్వర్యాన్ని చూసి అబ్బురపడ్డాడు. నిద్రించుచున్న స్త్రీలలో మండోదరిని చూచి సీత అని భ్రమించాడు. మరల తప్పు తెలుసుకొని అన్వేషణ కొనసాగించాడు. సీతమ్మ జాడ కానక చింతించాడు. ఏమిచేయాలో తోచలేదు. ఊరకే వెనుకకు మరలి అందరినీ నిరాశపరచడానికి ఇష్టం లేదు. తన కార్యం విఫలమైతే సుగ్రీవుడు, రామ లక్ష్మణులు, మరెందరో హతాశులౌతారని వగచాడు. ఆత్మహత్య గురించి కూడా ఆలోచించాడు. సీత కనుపించకుండా తాను వెనుకకు వెళ్ళేది లేదని నిశ్చయంచుకొన్నాడు. ఆ సమయంలో అశోక వనం కనిపించింది.

"నమోస్తు రామాయ సలక్ష్మణాయ, దేవ్యైచ తస్యై జనకాత్మజాయై, నమోస్తు రుద్రేంద్ర యమానిలేభ్యో, నమోస్తు చంద్రార్క మరుద్గణేభ్యః" అని ప్రార్థించాడు. దేవతలు, మహర్షులు తనకు కార్య సాఫల్యత కూర్చవలెనని కోరాడు. బ్రహ్మ, అగ్ని, వాయుదేవుడు, ఇంద్రుడు, వరుణుడు, సూర్య చంద్రులు, అశ్వినీ దేవతలు, మరుత్తులు, శివుడు, సకల భూతములు, శ్రీమహావిష్ణువు తనకు కార్యసిద్ధి కలిగించవలెనని ప్రార్థించి సీతాన్వేషణకై అశోకవనంలో అడుగుపెట్టాడు.

అశోకవనంలో సీతమ్మ దర్శనం

అశోకవనం అనన్య సుందరమైనది. అందులో చక్కని వృక్షాలు, పూలు, చిత్ర విచిత్రములైన కృతక పర్వతాలు, జలధారలు ఉన్నాయి. మణిమయాలైన సరస్సులున్నాయి. అద్భుతమైన చైత్య ప్రాసాదములున్నాయి. వాటిలో అతి మనోహరమైన ఒక శింశుపా వృక్షాన్ని ఎక్కి హనుమంతుడు చుట్టుప్రక్కల పరిశీలింపసాగాడు.

అక్కడ శింశుపా వృక్షము క్రింద, రాక్షసకాంతలచే పీడింపబడుతూ, సింహముల మధ్యనున్న లేడివలే భీతయై కృశించిన ఒక స్త్రీని చూచాడు. ఆమె ఏకవస్త్రయై, ధూమావృతమైన అగ్ని శిఖవలె, మిధ్యాపవాదువలన భంగపడిన కీర్తివలె, మేఘాచ్ఛాదితమైన చంద్రబింబంవలె ఉంది. ఆమె ధరించిన ఆభరణాలు, ఆమె తీరు, ఉన్న స్థితిని బట్టి హనుమంతుడు '''ఈమె సీతయే''' అని నిర్ధారించుకొన్నాడు. ఆమె దీనావస్థను, రామలక్ష్మణాదుల దుఃఖమును తలచుకొని, కాలం ఎంతటివారికైనా అతిక్రమింపరాని బలీయమైనది అనుకొని, హనుమంతుడు దుఃఖించాడు.

త్రిజటాస్వప్నం

అక్కడికి కామాతురుడైన రావణుడు వచ్చి సీతను బెదరించి, తనకు వశముకావలెనని ఆదేశించాడు. సీత ఒక గడ్డిపరకను అడ్డముగా పెట్టుకొని, రావణుని ధర్మహీనతను, భీరత్వాన్ని నిందించింది. భోగాలము దాపురించినందువల్లనే ఈ నీచ సంకల్పము అతనికి కలిగిందని హెచ్చరించింది. శ్రీరాముని బాణాగ్నితో లంక భస్మమగుట తథ్యమని రావణునకు గట్టిగా చెప్పినది. ఒక నెల మాత్రము గడువు పెట్టి రావణుడు వెళ్ళిపోయాడు. రాక్షసకాంతలు సీతను నయానా, భయానా అంగీకరింపచేయాలి అని ప్రయత్నించ సాగారు. రావణునికి వశం కాకపోతే ఆమెను తినేస్తామని బెదరించారు. భయ విహ్వలయై, ఆశను కోల్పోయిన సీత ప్రాణత్యాగం చేయాలని నిశ్చయించుకొన్నది.

వారిలో సహృదయయైన త్రిజట అనే రాక్షసకాంత మిగిలిన రాక్షస స్త్రీలను గద్దించి, సీతవంటి పుణ్యస్త్రీకి హాని చేయడం రాక్షస జాతికి వినాశకరమని హెచ్చరించింది. తనకు వచ్చిన కలలో ఇలా జరిగిందని చెప్పింది - "వేయి హంసలు పూన్చిన తెల్లని ఏనుగుదంతపు పల్లకీలో రామలక్ష్మణులు లంకకు వచ్చారు. తెల్లని పర్వతాగ్రంపై సీత ఆసీనయై ఉంది. ఆమె సూర్య చంద్రులను స్పృశించింది. నాలుగు దంతాలు కలిగిన తెల్లని ఏనుగు నెక్కి, రాముని ఒడిలో సీత కూర్చుని ఉంది. సీతారామలక్ష్మణులు అధివసించిన భద్రగజం ఆకాశంలో లంకపైభాగాన నిలిచింది. ఎనిమిది వృషభములు పూన్చిన రథంపై రాముడు తెల్లని వస్త్రాలతో, సీతా లక్ష్మణులతో లంకలో కనిపించాడు. తరువాత, వారంతా పుష్పకం ఎక్కి ఉత్తర దిశగా వెళ్ళారు.

"ఎర్రని వస్త్రములు ధరించి, తైలము పూసుకొని రావణుడు మత్తిల్లి, పుష్పకంనుండి క్రింద పడ్డాడు. గాడిదలు పూన్చిన రథంలో ఉన్నాడు. అతని మెడలో త్రాడు కట్టి, నల్లని వస్త్రములు ధరించిన ఒక స్త్రీ దక్షిణానికి లాగుచున్నది. అతడు దుర్గంధ నరక కూపంలో పడిపోయాడు. రావణుడు పందినెక్కి, కుంభకర్ణుడు పెద్ద ఒంటెనెక్కి, ఇంద్రజిత్తు మొసలినెక్కి దక్షిణ దిశగా పోయారు. విభీషణుడు మాత్రం తెల్లని గొడుగుతో, దివ్యాభరణాలతో, తెల్లని గజం అధిరోహించి, మంత్రులతో

కూడి ఆకాశంలో ఉన్నాడు. లంకా నగరం ధ్వంసమై సముద్రంలో కూలింది. రాక్షస స్త్రీలంతా తైలము త్రాగుచు, పిచ్చివారివలె లంకలో గంతులు వేయుచున్నారు."

ఇలా చెప్పి త్రిజట తమను ఆపదనుండి కాపాడమని సీతాదేవిని వేడుకోనమని తక్కిన రాక్షస కాంతలకు హితవు పలికింది. భయంకరమైన ఆ కల విని రాక్షసకాంతలు భీతిల్లారు. ఆత్మహత్యకు సిద్ధపడిన సీతకు శుభ శకునములు కనిపించసాగాయి..



శ్రీరామ వర్ణన

చెట్టుపైనుండి ఇదంతా గమనించిన హనుమంతుడు ఇంక ఆలస్యము చేసినచో సీత ప్రాణత్యాగము చేయగలదని ఊహించాడు. కాని ఒక్కమారుగా ఆమెకు కనిపించినట్లయితే ఆమె ఖంగారుపడి కేకలు వేయవచ్చనీ, అలాగయితే అసలు పని చెడుతుందని భావించాడు. చెట్టుపైనుండి మెల్లగా దశరథ కుమారుడైన రాముని కథ చెప్పనారంభించాడు. ఆ రాముడు సీతను వెదకడానికి పంపిన దూతలలో ఒకడైన తాను ప్రస్తుతం లంకను చేరి, చెట్టుపైనుండి, సీతను చూచానని ఆ కథాక్రమంలో తెలియజేశాడు. ఆ రామకథా శ్రవణంతో సీత కొంత ఆనందించింది. కానీ తాను కలగంటున్నానేమోనని భ్రమ పడింది. తల పైకెత్తి, మెరుపు తీగవలె, అశోక పుష్పము వలె ప్రకాశిస్తున్న వానరుని చూచి కలవరపడింది. తాను విన్న విషయాలు సత్యాలు కావాలని బ్రహ్మకు, మహేంద్రునికి, బృహస్పతికి, అగ్నికి నమస్కరించింది. హనుమంతుడు మెల్లగా చెట్టు దిగివచ్చి ఆమెకు శుభం పలికాడు. సీతకు తన వృత్తాంతమునూ, రాముని దుఃఖమునూ వివరించాడు. శ్రీరాముని పరాక్రమాన్నీ, గుణగణాలనూ ప్రశంసించి ఆమెకు త్వరలో విముక్తి కలుగుతుందని అనునయ వచనాలు పలికాడు. సీత దుఃఖించి, అందరి క్షేమసమాచారములు అడిగి, ఆపై రాముని వర్ణించమని కోరింది.

హనుమంతుడు భక్తితో అనన్య సుందరుడు అయిన రాముని, అతని సోదరుడైన లక్ష్మణుని వర్ణించాడు. "రాముడు ఆజానుబాహుడు. కమల పత్రాక్షుడు. రూప దాక్షిణ్య సంపన్నుడు. శుభలక్షణములు గలవాడు, తేజోమూర్తి, ధర్మ రక్షకుడు, సర్వ విద్యాపారంగతుడు, లోకమర్యాదలను పాటించువాడు. సమ విభక్తములైన శరీరాంగములు కలవాడు. దీర్ఘములైన బాహువులు, శంఖమువంటి కంఠము, కండరములతో మూసుకొనిపోయిన సంధి యెముకలు కలవాడు. మూడు దృఢమైన స్థానములు, మూడు దైర్ఘ్యముగల అవయవములు, మూడు సమ అవయవములు, మూడు ఎత్తైన అవయవములు కలవాడు. పదునాలుగు సమమైన అవయవములు కలవాడు. నాలుగు విధములైన నడక గలవాడు. ఉత్తముడు, వీరుడు. నల్లనివాడు. అతని తమ్ముడు లక్ష్మణుడు అట్టి శుభలక్షణములే కలిగి, ఎర్రని మేని ఛాయ గలవాడు - అట్టి రామలక్ష్మణులు నీకై పరితపించుచున్నారు. సుగ్రీవునితో చెలిమి జేసి, నిన్ను వెదకుటకై నలుతెరగుల వానరులను పంపియున్నారు. ఓ సీతా దేవీ! త్వరలోనే శ్రీరాముడు నిన్ను ఇచటనుండి తీసికొని పోనున్నాడు" - అని హనుమంతుడు చెప్పాడు.

శ్రీరాముని గురించి విని, సీత ఊరడిల్లింది. తరువాత హనుమంతుడు ఆమెకు శ్రీరాముని ఆనవాలైన అంగుళీయకమును ఇచ్చాడు. రాముడు చెప్పిన మాటలు తెలియజేశాడు. ఆమెకు శుభం పలికాడు. తనతో వస్తే ఆమెను తీసికొని వెళ్ళగలనని కోరాడు. సీత హనుమంతుని పలుకులకు సంతోషించి అతని పరాక్రమాన్ని ప్రశంసించింది. కాని స్వయంగా శ్రీరాముడే వచ్చి, రావణుని పరిమార్చి, తనను తీసికొని వెళ్ళాలని చెప్పింది. రాముని పరాక్రమానికి ముల్లోకాలలోను ఎదురు లేదని తెలిపింది. రామలక్ష్మణులకు, సుగ్రీవునకు, భల్లూక వానరులకు ధర్మక్రమ మనుసరించి కుశలం అడిగినట్లు తెలుపమని పలికింది. హనుమంతుని ఆశీర్వదించి, తన చూడామణిని ఆనవాలుగా ఇచ్చినది. ఒక్క నెలలో రాముడు తనను కాపాడకున్న తాను బ్రతుకనని చెప్పినది. ఆ మహాంబుధిని దాటడం (హనుమంతుడు, వాయుదేవుడు, గరుత్మంతుడు తప్ప) ఇతరులకు ఎలా శక్యమని సంశయించింది.

అందుకు హనుమంతుడు తనకంటే గొప్పవారైన మహావీరులు వానరులలో ఎందరో ఉన్నారని, తాను సామాన్యుడను గనుకనే ముందుగా తనను దూత కార్యానికి (యుద్ధానికి కాదు) పంపారని ఆమెకు నచ్చచెప్పాడు. మహావీరులైన రామలక్ష్మణులు కపి భల్లూక సేనా సమేతంగా, త్వరలో లంకకు వచ్చి సూర్య చంద్రుల వలె, అగ్ని వాయువులవలె లంకను వాశనం చేసి రావణ సంహారం సాగించడం తథ్యమని ఆమెను అనునయించాడు. హనుమంతుని సీతమ్మ ఆశీర్వదించింది.

రాక్షసులను దండించడం

సీతా దర్శనంతో సంతుష్టుడైన హనుమంతుడు ఇక పనిలో పనిగా రావణునితో భాషింపవలెననీ, లంకను పరిశీలింపవలెననీ నిశ్చయించుకొన్నాడు. అలా చేయడం వల్ల రావణుని హెచ్చరించడానికీ, లంక రక్షణా వ్యవస్థను తెలుసుకోవడానికీ వీలవుతుంది. అంతే గాకుండా ఆ ప్రయత్నంలో లంకకు వీలయినంత నష్టం కలిగించవచ్చును. ఇలా సంకల్పించిన హనుమంతుడు వెంటనే ఉగ్రాకారుడై వనమునూ, అడ్డు వచ్చిన వేలాది రాక్షసులనూ ధ్వంసం చేసి మకరతోరణాన్ని అధిష్ఠించి కూర్చున్నాడు.

ఆ కపిని బంధించమని రావణుడు ఎనుబదివేల మంది సైన్యాన్ని పంపాడు. హనుమంతుడు - "**జయత్యతిబలో రామో, లక్ష్మణశ్చ మహాబలః, రాజా జయతి సుగ్రీవో, రాఘవేణాభిపాలితః, దాసోహం కోసలేంద్రస్య, రామస్యా క్లిష్ట కర్మణః, హనుమాన్ శత్రు సైన్యానాం నిహన్తా మారుతాత్మజః**" అని జయఘోష చేశాడు - "మహా బలవంతుడైన శ్రీరామునకు జయము. మిక్కిలి పరాక్రమశాలియైన లక్ష్మణునకు జయము. రాఘవుల విధేయుడైన కిష్కింధ ప్రభువు సుగ్రీవునకు జయము. నేను శ్రీరామ దాసుడను, వాయుపుత్రుడను, హనుమంతుడను. శత్రు సైన్యాన్ని నాశనం చేస్తాను. వేయి మంది రావణులైనా యుద్ధంలో నన్నెదిరించలేరు. వేల కొలది శిలలతోను, వృక్షాలతోను సకల రాక్షసులను, లంకాపురిని నాశనం చేస్తాను. నా పని ముగించుకొని, సీతమ్మకు నమస్కరించి వెళతాను. రాక్షసులు ఏమీ చేయలేక చూచుచుందురు గాక" - ఇలా గర్జిస్తూ హనుమంతుడు ముఖద్వారానికి బిగించిన ఇనుప గడియతో రాక్షసులనందరినీ చావగొట్టాడు. పర్వతాకారంలో దేహాన్ని పెంచి, చైత్య ప్రాసాదాన్ని కూలగొట్టి, ఆ ప్రాసాదము యొక్క ఒక పెద్ద స్తంభాన్ని పరిఘులా త్రిప్పుతూ అందరినీ చావగొట్టాడు.

అప్పుడు రావణుడు, ప్రహస్తుని కుమారుడు మహా బలశాలీ అయిన జంబుమాలిని పంపాడు. హనుమంతుని చేతి పరిఘతో జంబుమాలి శరీరం చూర్ణమయ్యింది. ఆపై అగ్నివలె తేజరిల్లే యుద్ధవిద్యా నిపుణులైన ఏడుగురు మంత్రి పుత్రులు పెద్ద సేనతో కలిసి హనుమంతునిపై దండెత్తారు. హనుమంతుడు భయంకరంగా గర్జించి కొందరిని అఱచేతితోను, కొందరిని ముష్టిఘాతాలతోను, కొందరిని తన వాడిగోళ్ళతోనూ చంపగా యుద్ధ భూమి అంతా శత్రువుల రక్త మాంసాలు చెల్లాచెదరయ్యాయి. పిమ్మట విరూపాక్షుడు, యూపాక్షుడు, దుర్ధరుడు, ప్రఘసుడు, భాసకర్ణుడు అనే గొప్ప సేనా నాయకులు తమ సేనలతో వచ్చి వన ముఖ ద్వారంపై కూర్చున్న హనుమంతునిపై విజృంభించారు. వారంతా కూడా హనుమ చేత నిహతులైపోయారు. రణ భూమి అంతా రాక్షస, వాహన కళేబరాలతోను, ఆయుధ, రధ శకలాలతోను నిండిపోయింది.

ఇక దుర్ధర్షమైన ప్రతాపశాలి, వర సంపన్నుడు, గొప్ప రథము కలవాడును అయిన అక్షకుమారుడు సకలబలములతో హనుమంతుని సమీపించాడు. వారి మధ్య జరిగిన యుద్ధం సురాసురులను సంభ్రమపరచింది. వర్షంలాంటి అక్షకుమారుని బాణాలు హనుమంతుని చాలా నొప్పించాయి. అతని పరాక్రమానికి హనుమంతుడు ముచ్చటపడ్డాడు. అంతటి పరాక్రమశాలిని, తేజోమయుని చంపడానికి తటపటాయించాడు. కాని అతనిని ఉపేక్షిస్తే తనకు పరాభవం తప్పదని తెలిసికొని హనుమంతుడు విజృంభించాడు. ఆకాశానికెగిరి వాయువేగంతో సంచరిస్తూ అరచేతితో అక్షకుమారుని గుర్రాలను చరచి చంపేశాడు. తరువాత, గరుత్మంతుడు మహా సర్పాన్ని పట్టుకొన్నట్లుగా అక్షకుమారుని కాళ్ళను గట్టిగా చేజిక్కించుకొని, గిరగిర త్రిప్పి వేలకు విసరికొట్టాడు. అక్షకుమారుని శరీరం నుగ్గునుగ్గయ్యింది.

ఈ సంగతి తెలిసిన రావణుడు కలవరపడి, పెక్కు జాగ్రత్తలు చెప్పి, ఇంద్రజిత్తును యుద్ధానికి పంపాడు. ఇంద్రజిత్తు బ్రహ్మవర సంపన్నుడు, ఇంద్రాదులకు కూడా నిలువరింప శక్యంగాని పరాక్రమశాలి, మంత్ర తంత్ర యుద్ధవిద్యానిపుణుడూను. అతడు తండ్రికి నమస్కరించి, రణోత్సాహంతో పొంగిపోతూ, సేనలు లేకుండా ఒకడే దివ్యరథాన్ని అధిరోహించి హనుమంతునిపైకి వెళ్ళాడు. వారిద్దరి మధ్య యుద్ధం చిత్ర విచిత్ర రీతులలో సకల గణాలకు సంభ్రమం కలిగించింది. ఒకరిని ఒకరు జయించడం అశక్యమని ఇద్దరికీ తెలిసిపోయింది. ఇక లాభం లేదు, కనీసం ఆ వానరుని బంధించాలని సంకల్పించి ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. అది హనుమంతుని బంధించింది. బ్రహ్మ హనుమంతునకిచ్చిన వరం ప్రకారం ఆ అస్త్రం అతనిని బాధించకుండా మరుక్షణమే తొలగిపోయింది. అయినా బ్రహ్మదేవునిపట్ల గౌరవసూచకంగా ఆ అస్త్రానికి కట్టుబడిపోయినట్లుగా నటించాడు. ఆ విధంగా రావణునితో సంభాషించ దలచాడు. రాక్షస సేనలు హనుమంతుని బంధించి, బాధిస్తూ రావణుని సభా ప్రాంగణానికి తీసుకుపోయారు.

రావణునితో సంవాదం

బ్రహ్మాస్త్రానికి వశుడైనట్లు నటించి, హనుమంతుడు రావణుని సభాభవనంలో ప్రవేశించి రావణుని చూశాడు. రావణాసురుని సభాప్రాంగణం మణిమయమై శోభిల్లుతున్నది. రావణుని కిరీటం, ఆభరణాలు, వస్త్రాలు, అనులేపనాదులు అత్యద్భుతంగా ఉన్నాయి. మహా తేజశ్శాలియు, వీరుడును ఐన రావణుడు పది శిరస్సులతో ఒప్పుచు, అనేక క్రూర మృగములతో నిండిన శిఖరములు గల మందరగిరి వలె ప్రకాశిస్తున్నాడు. మణిమయాలంకృతమైన ఉన్నతాసనంపై కూర్చొని ఉన్నాడు. మంత్రాంగ నిపుణులైన నలుగురు మంత్రులచే

పరివేష్టితుడై కాటుక కొండవలె ఉన్నాడు. అప్పుడు హనుమంతుడు ఇలా అనుకొన్నాడు. - 'ఆహా! ఈ రావణుని రూపం అత్యద్భుతం. ధైర్యం నిరుపమానం. సత్వం ప్రశంసార్హం. తేజస్సు అసదృశం. నిజముగా ఈ రాక్షస రాజు సర్వ లక్షణ శోభితుడు. ఈ అధర్మానికి ఒడి గట్టకపోతే సురలోకానికి సైతం ప్రభువయ్యేవాడు. లోకాలన్నీ ఇతనికి భయపడుతున్నాయి. ఇతడు కృద్ధుడైనచో సమస్త జగత్తునూ సముద్రమున ముంచి ప్రళయం సృష్టించగల సమర్ధుడు గదా!'

హనుమంతుడు ఎవరు? ఎందుకు వచ్చాడు? ఎవరు పంపారు? - తెలిసికోమని రావణుడు మంత్రులకు ఆదేశించాడు. హనుమంతుడు రావణునకు ఇలా చెప్పాడు - రాజా! నేను సుగ్రీవుని మంత్రిని. రాముని దూతను. హనుమంతుడనే వానరుడను. నీ కుశలము తెలిసికొమ్మని సుగ్రీవుడు స్నేహ భావంతో చెప్పాడు. రాముని పత్ని సీతను తెచ్చి నువ్వు పెద్ద తప్పిదం చేశావు. దీని వలన నీవు చేసుకొన్న పుణ్యమంతా నిష్ఫలమై పోతుంది. వాలిని రాముడే సంహరించాడు. రాముని బాణాల ధాటికి నీవు గాని, మరెవరు గాని నిలువజాలరు. ఈ అకృత్యం వలన నీకు, లంకకూ చేటు దాపురించింది. రాముడు మానవుడు. నీవు రాక్షసుడవు. నేను వానరుడను, నాకు పక్షపాతం లేదు. కనుక నా మాట విని సీతను అప్పగించి రాముని శరణు వేడుకో. రాముని క్రోధానికి గురియైనవానిని ముల్లోకాలలో ఎవరూ రక్షింపజాలరు. - అని హితవు చెప్పాడు.

రావణుడు కోపించి ఆ వానరుని చంపమని ఆదేశించాడు. అంతలో విభీషణుడు అడ్డుపడి - దూతను చంపడం రాజ ధర్మం కాదు. అంతే కాకుండా ఇతను తిరిగి వెళ్ళకపోతే నీను శతృవులతో యుద్ధం చేసి వారిని నిర్జించే అవకాశం కోల్పోతావు. కనుక, దండించి వదలమని సూచించాడు. ఆ మాటలకు కాస్త నెమ్మదించిన రావణుడు ఆ వానరుని తోకకు నిప్పంటించి వూరంతా త్రిప్పమని ఆనతిచ్చాడు.

లంకా దహనం

రావణుడు ఉగ్రుడై హనుమంతుని తోకకు నిప్పు పెట్టమని ఆదేశించాడు. రాక్షస కింకరులు హనుమంతుని తోకకు పాత గుడ్డలు చుట్టి నిప్పు పెట్టారు. ఊరంతా త్రిప్పసాగారు. ఈ అవకాశం చూసుకొని హనుమంతుడు లంకా నగరాన్ని నిశితంగా పరిశీలించాడు. జరిగిన సంగతి విన్న సీతాదేవి హనుమంతుని చల్లగా చూడమని అగ్నిదేవుని ప్రార్ధించింది. తన తోక కాలుతున్నా గాని ఏ మాత్రం బాధ లేకపోవడం సీతమ్మ మహిమ వలన అని, తన తండ్రి వాయుదేవుని మిత్రుడైన అగ్ని కరుణ వలన అని గ్రహించిన హనుమంతుడు ఆ అగ్నికి లంకను ఆహుతినీయ సంకల్పించాడు. తన బంధాలను త్రెంచుకొని, ఒక పరిఘతో రాక్షస మూకను చావబాదాడు. పైకెగిరి, మండుతున్న సూర్యునిలా విజృంభించాడు. ప్రహస్తుని ఇంటితో మొదలుపెట్టి లంకలోని అద్భుతభవనాలకు నిప్పంటించాడు. ఒక్క విభీషణుని ఇల్లు తప్ప లంకలో భవనాలను బుగ్గి చేశాడు.

అప్పుడు ఒక్కమారుగా సీత సంగతి గుర్తు వచ్చి హనుమంతుడు హతాశుడయ్యాడు. తన తొందరపాటువలన లంకతో పాటు సీతమ్మ కూడా అగ్నికి ఆహుతయ్యిందేమో అన్న ఊహతో విలవిలలాడిపోయాడు. తన చాంచల్యం వలన తన జాతికి, పనికి కీడు తెచ్చినందుకు రోదించి ప్రాణత్యాగానికి సిద్ధమయ్యాడు. కాని సీత క్షేమంగా ఉన్నదని తెలిసి, ఊరట

చెందాడు. మరొక్కమారు సీతను దర్శించి, ఆమెకు సాంత్వన వచనాలు పలికి, రాముడు సకల వానరసేనతో త్వరలో రాగలడని అభయం పలికాడు. ఆమెకు ప్రణమిల్లి, తిరిగి ఉత్తరదిశకు బయలుదేరాడు.

ఇలా హనుమంతుడు రాముని దూతగా సాగరాన్ని లంఘించి, సీతను కనుగొని, రాక్షసులను సంహరించి, లంకను భయభ్రాంతమొనర్చి, రావణుని మదమణచి, సీతకు సాంత్వన కూర్చి, తిరుగు ప్రయాణానికి అరిష్టము అనే పర్వతాన్ని అధిరోహించాడు.

తిరుగు లంఘనం

హనుమంతుడి పద ఘట్టనంతో అరిష్ట పర్వతం నేలలో క్రుంగిపోయింది. ఒక మహానౌక సముద్రాన్ని దాటినట్లుగా హనుమంతుడు సునాయాసంగా ఆకాశాన్ని దాటాడు. దారిలో మైనాక పర్వతాన్ని గౌరవంగా స్పృశించి, ఉత్తర సాగర తీరం సమీపించగానే పెద్దయెత్తున గర్జించాడు. ఆ కేక విని జాంబవంతాదులు ఇది హనుమంతుని విజయసూచక ధ్వానమని గ్రహించి హర్షంతో గంతులు వేయసాగారు. మేఘంలాగా హనుమంతుడు మహేంద్రగిరిపై దిగి గురువులకు, జాంబవంతాది వృద్ధులకు, యువరాజు అంగదునకు ప్రణామం చేశాడు. - ''**కనుగొంటిని సీతమ్మను.**'' ఆమె రాక్షసుల బందీయై, రాముని కొరకు ఎదురు చూచుచు కృశించియున్నది. " అని హనుమంతుడు చెప్పాడు. "కనుగొంటిని" అన్న మాటలతో "వానరు లందరూ పరమానందము పొందారు." అతనిని కౌగలించుకొని సంతోషంతో చిందులు వేశారు. తరువాత తన లంకా నగర సందర్శనా విశేషాలను అన్నింటినీ తన బృందంలోనివారికి వివరంగా చెప్పాడు హనుమంతుడు.

ఇంక అంతా కలసి వెళ్ళి లంకను నాశనం చేసి, రావణుని ఓడించి, సీతను తెచ్చి రామునకు అప్పగించాలని అంగదుడు అభిప్రాయపడ్డాడు. కాని జాంబవంతుడు అందుకు వారించి, ముందుగా జరిగిన సంగతిని రామునకు, సుగ్రీవునకు నివేదించుట సరైనపని అని చెప్పాడు. అందరూ సంరంభంగా కిష్కింధకు బయలుదేరారు.

మధువనం

సీత జాడ తెలియడం వలన అంగదాది వానరులంతా ఉత్సాహంగా హనుమంతుని పరివేష్టించి కిష్కింధకు బయలుదేరారు. దారిలో మధువనమనే మనోహరమైన వనాన్ని చేరుకొన్నారు. అది సుగ్రీవునిది. దధిముఖుడనే వృద్ధ వానర వీరుని పరిరక్షణలో ఉంది. అంగదుని అనుమతితో వానరులంతా ఆ వనంలో ఫలాలను కోసుకొని తింటూ, మధువులను గ్రోలుతూ, చిందులు వేస్తూ, మత్తెక్కి పిచ్చిగా ఆడుతూ వనాన్ని ధ్వంసం చేయసాగారు. అడ్డు వచ్చిన దధిముఖుని తీవ్రంగా దండించారు. దిక్కు తోచని దధిముఖుడు తన తోటి వన రక్షకులతో కలిసి వేగంగా సుగ్రీవుని వద్దకు ఎగిరిపోయి జరిగిన అకృత్యం గురించి మొరపెట్టుకొన్నాడు.

సీతాన్వేషణా కార్యం సఫలమయి ఉండకపోతే తన భృత్యులైన వానరులు అంతటి సాహసం చేయజాలరని సుగ్రీవుడు ఊహించాడు. వనభంగం అనే నెపంతో దధిముఖుడు సీతాన్వేషణా సాఫల్య సమాచారాన్ని ముందుగా సూచిస్తున్నాడని, శుభవార్త వినే అవకాశం ఉన్నదని రామలక్ష్మణులకు సుగ్రీవుడు చెప్పాడు. శుభవార్త తెలిపినందుకు దధిముఖుని అభినందించాడు. దధిముఖుడు మధువనానికి తిరిగి వెళ్ళి అంగదాదులతో సాదరంగా మాట్లాడి త్వరగా

సుగ్రీవుని వద్దకు వెళ్ళమన్నాడు. అంగదుడు, హనుమంతుడు, తక్కిన బృందం రివ్వున ఆకాశానికెగిరి ఝుంఝామారుతంలాగా సుగ్రీవుని వద్దకు బయలుదేరారు.

రామునకు సీత జాడ తెలుపుట

అంగదాది ప్రముఖులు, హనుమంతుడు మహోత్సాహంతో సుగ్రీవుడు, రామలక్ష్మణులు మొదలైనవారున్న ప్రస్రవణగిరిపై దిగారు. ''**దృష్టా దేవీ (చూచాను సీతను)**'' అని హనుమంతుడు చెప్పగానే రామలక్ష్మణులు మహదానంద భరితులయ్యారు. హనుమంతుని కార్య సాధనపై విశ్వాసము గల లక్ష్మణుడు సుగ్రీవునివంక ఆదరంగా చూశాడు. తక్కిన వానరుల ప్రోద్బలంతో హనుమంతుడు దక్షిణ దిక్కుకు తిరిగి సీతమ్మకు ప్రణమిల్లి, ఆమె ఇచ్చిన చూడామణిని రామునికి సమర్పించి, తన సాగర లంఘనా వృత్తాంతమును రామలక్ష్మణసుగ్రీవులకు వివరించాడు.

ఓ రామా! సీతామాత ఏకవేణియై, రాక్షస స్త్రీల నిర్బంధములో దీనురాలై నిరంతరము నిన్నే స్మరించుచున్నది. అందరిని కుశలమడిగినది. నీవు అనతి కాలములోనే వచ్చి ఆమెను విముక్తురాలను చేసి స్వీకరింతువనే ఆశ మాత్రముననే జీవించియున్నది. ఒక మాసము లోపల అట్లు కాకున్నచో తాను ప్రాణములతో ఉండజాలనన్నది. రామా! సింహ పరాక్రముడైన రాముని, ధనుష్పాణియైన లక్ష్మణుని త్వరలో లంకా ద్వారమున చూడగలవని చెప్పి ఆమెను అనునయించితిని. శుభకరమైన వచనములతో ఆమెను ఓదార్చి ఇటు వచ్చితిని. - అని హనుమంతుడు శ్రీరామునకు విన్నవించాడు.

(యుద్ధకాండము - మొదటి సర్గము నుండి) - హనుమంతుని మాటలు విని శ్రీరాముడు ప్రసన్నుడై ఇట్లు పలికెను. "హనుమంతుడొనర్చిన ఘన కార్యములు లోకములోనే అత్యద్భుతములైనవి. ఊహకు అందనివి. అనితర సాధ్యములు. హనుమంతునితో సమానుడైన తేజోబల సంపన్నుడు ఎవ్వడును లేడు. దుష్కరమైన ప్రభుకార్యములను సాధించుటయే గాక, దానికి భంగము కలుగకుండ, తదనురూపములైన ఇతర కార్యములను కూడ సాధించు సేవకుడు అత్యుత్తముడు. ఈ కార్య సాధన ద్వారా హనుమంతుడు మాయందరి ప్రాణములను కాపాడినాడు. నాకిట్టి మహోపకారమొనర్చిన హనుమంతునకు తగిన ప్రత్యుపకారము చేయలేని దీనుడనై యున్నాను. గాఢాలింగన సౌఖ్యమును మాత్రమే ఈయగలను. ప్రస్తుతము నేనీయగలిగిన నా సర్వస్వమిదియే", అని శ్రీరాముడు పులకిత గాత్రుడై తాను అప్పగించిన కార్యమును సాఫల్యమొనర్చి, పవిత్రాత్ముడై వచ్చిన హనుమంతుని తన హృదయమునకు హత్తుకొనెను.

ఆధ్యాత్మ రామాయణము: **శ్రీరాముని పాదపద్మములను తులసీ దళాదులతో పూజించినవారు సాటిలేని పరమపదమును పొందెదరు. అట్టి శ్రీరామ చంద్రుడే పుణ్యముల రాశియైన హనుమంతుని అనుగ్రహించి, స్వయముగా ఆయనకు తన ఆలింగన సౌఖ్యమును ప్రసాదించెను. ఆ మారుతి భాగ్యమును ఎంతని కొనియాడగలము** ("గీతా ప్రెస్, గోరఖ్‌పూర్ ప్రచురణలోని అనువాదము")

వైకుంఠః పురుషః ప్రాణః ప్రాణదః ప్రణవః పృథుః |
హిరణ్యగర్భః శత్రుఘ్నో వ్యాప్తో వాయురధోక్షజః || (44)

406. వైకుంఠః

- ఐక్యమునకు ప్రతిబంధకములైనవాటిని (మోక్షమునకు అడ్డంకులను) తొలగించువాడు.

- పంచభూతములను అదుపులో నుంచినవాడు.

ఓం వైకుంఠాయ నమః

కుఠీ – గతి ప్రతిఘాతే – దారికి అడ్డముగానున్నది – అన్న ధాతువునుండి శ్రీ భట్టులు 'వైకుంఠ' నామము అర్థమును వివరించారు.

సంశ్లేష ప్రతిఘాతశ్చ కుంఠి ధాత్వర్థ ఉచ్యతే
విగతస్స యేషా తే వికుంఠా స్స్యురుదీరితాః
తేషామేవైష ఇతి హి వైకుంఠ పరికీర్తితః

'కుంఠా' అనగా ఐక్యమునకు అడ్డముగానున్నది. 'వైకుంఠ' అనగా అటువంటి అడ్డము లేనిది. భగవంతుని చేరుటకు పాపములు అడ్డంకులు. అట్టి పాపములను తొలగించువాడు భగవంతుడు గనుక ఆయనే వైకుంఠుడు.

(శ్రీ శంకరుల భాష్యమునననుసరించి) శ్రీ రాధాకృష్ణశాస్త్రి వివరణ – **విగతా కుంఠా తస్యాః కర్తా** – నియంత్రణ లేనియెడల ఏవైతే అదుపులేక చెలరేగునో అట్టివాటిని నిరోధము (ప్రతిఘాతము) చేయువాడు వైకుంఠుడు. సృష్టి మొదలున పంచభూతములు ఒకదానితోనొకటి సంబంధము లేకుండా, అదుపు లేకుండా, చెలరేగే

పరిస్థితిలో, వాటిని అదుపు చేసి, వానిమధ్య సంబంధము (ఐక్యము) కలుగజేసెను గనుక భగవానుడు వైకుంఠుడు.

భిన్నమైనవాటి మధ్య సంబంధము కలుగజేయువాడు భగవంతుడు – అనే వివరణకు శ్రీ శంకరులు, శ్రీ భట్టులు కూడ మహాభారతము శాంతిపర్వములోని శ్లోకము (343.50)ను ఉదాహరించారు.

మయా సంశ్లేషితా భూమిః అద్భిర్వ్యోమ చ వాయునా
వాయుశ్చ తేజసా సార్థః వైకుంఠత్వమ్ తతో మమ

భూమికి జలముతో, ఆకాశానికి వాయువుతో, వాయువుకు తేజస్సుతో – ఈ విధంగా సంబంధము (సమ్మేళనము) కలుపబడినది. అందువల నేను వైకుంఠుడను.

శ్రీ పి.బి. అణ్ణాంగారాచార్య – భగవంతుని పొందుటకు భక్తునికి గల అడ్డంకులను తొలగించి, తనలో భక్తుని కలుపుకొనువాడు గనుక ఆయన వైకుంఠుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – ఎవనికైతే ఏ విధమైన అడ్డంకులు లేవో, ఎవరైతే అన్ని అడ్డంకులను తొలగించునో ఆయనే వైకుంఠుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి మరొక వివరణ – ఐదవ మన్వంతరమున భగవంతుడు శుభ్ర, వైకుంఠులకు బిడ్డగా జన్మించెను. ఆయన రమను పరిణయమాడి, ఆమె ఆనందము కొరకు వైకుంఠమును సృష్టించెను. ఆ వైకుంఠము భగవంతుని స్వరూపము, నివాసము కూడ. (విష్ణుపురాణము 3.2.41, భాగవతము 8.5.4-5)

ధర్మచక్రము రచయిత – ఎందరో వ్యక్తుల జ్ఞానమునకు, మోక్షమునకు అడ్డముగానున్నవానిని తొలగించి, వారిని తనలో ఐక్యము చేసికొన్నవాడు వైకుంఠుడు అని వివరిస్తూ ధర్మచక్రము రచయిత ప్రహ్లాదుడు, పరశురాముడు, కర్ణుడు, హరిశ్చంద్రుడు, వాలి వంటివారి కథలను ఉదాహరించారు.

407. పురుషః

పావనము చేయువాడు.

ఓం పురుషాయ నమః

2వ శ్లోకము. 14వ నామము. పురుషః – **అవ్యయః పురుషః సాక్షీ క్షేత్రజ్ఞోఽక్షర ఏవ చ**

44వ శ్లోకము. 407వ నామము. పురుషః – **వైకుంఠః పురుషః ప్రాణః ప్రాణదః ప్రణవః పృథుః**

ఇంతకుముందు 'పురుషః' నామము 14వ నామముగా స్తుతించబడినది. అప్పుడు ఈ నామమునకు ఇచ్చిన అర్థములు –

(1) **పురు సనోతి ఇతి పురుషః** – పుష్కలముగా ప్రసాదించువాడు పురుషుడు.

(2) **పురా ఆసీత్ ఇతి పురుషః** – అన్నింటికంటె పూర్వమే ఉండినవాడు పురుషుడు.

(3) **పూరయతి ఇతి పురుషః** – అంతటికిని పరిపూర్ణత నొసగువాడు పురుషుడు.

(4) **పురి సేతే ఇతి పురుషః** – శరీరమను పురమున వసించినవాడు పురుషుడు.

4వ భావమునకు ఇంతకుముందు శ్రీ శంకరులు చెప్పన ప్రమాణోదాహరణ –

నవద్వారమ్ పుణ్యమ్ ఏతైర్భావైః సమన్వితమ్

వ్యాప్య సేతే మహాత్మా యస్తస్మాత్ పురుష ఉచ్యతే (మహాభారతము 12.203.35)

నవద్వారములు కలిగిన శరీరమున వ్యాపించిన మహాత్ముడు పురషుడు.

శ్రీ శంకరులు చెప్పిన మరొక ప్రమాణము –

స వా అయమ్ పురుషః సర్వాసు పూర్షు పురి శయః (బృహదారణ్యకోపనిషత్తు 2.5.18) – అన్ని శరీరములందు వసించువాడు పురుషుడు. ఇదే భావమునకు శ్రీ వి.వి. రామానుజన్ దివ్యప్రబంధములనుండి ఉదాహరించారు (తిరువైమొళి 3.9.5, 2.7.11)

పైన చెప్పిన 4 అర్థమలు కాకుండా మరికొన్ని అర్థములు ఇక్కడ చెబుతున్నాము –

(5) **ఉష దాహే పురూః సర్వాన్ ఓషతి దహతి ఇతి వా పురుషః** – అన్నింటికంటె అధికముగా ప్రకాశించువాడు పురుషుడు.

(6) **పాప్మనా ఓషః తస్మాత్ పురుషః** – అన్ని పాపములను దహించివేయువాడు పురుషుడు.

(7) **పిపర్తి పృణతి పాలయతి పూరయతి ఇతి వా పురుషః** – అన్నింటిని పరిపాలించువాడు పురుషుడు (పృ – పాలన – పూరణయోః)

(8) పురా – కుషన్ – పురుషః (పురా – అగ్ర గమనే) – **పురా అగ్రగామీ భవతి ఇతి వా పురుషః** – ముందుగానుండి నడిపించువాడు పురుషుడు.

(9) **పూర్వః అస్మాత్ విశ్వాత్ తత్ ఆదికారణత్వాత్ ఇతి పురుషః** – విశ్వమునకు ఆదికారణమైనవాడు పురుషుడు.

(10) **పురాణి భువనాని సంహార సమయే స్యతి అంతమ్ నయతీతి పురుషః** – సంహార (ప్రళయ) కాలమున భువనములను తుదివరకు తీసికొనిపోవువాడు పురుషుడు.

వీటిలో 6, 7 అర్థములను శ్రీ భట్టులు ప్రస్తుత (407వ) నామ వివరణ సందర్భముగా చెప్పారు.

స యత్పూర్వ ఇతి శృత్యా పురుషః పావనత్వతః

ప్రూ ధాతోః పాలనార్థార్థి అర్వ ప్రత్యయ యోగతః

సర్వ పాలకతా లబ్ధ్వా పురుషః ప్రోచ్యతే బుధైః

'స యత్పూర్వో' అనే శ్రుతిననుసరించి, పరమపావనుడగుటవల్ల పురుషుడగుచున్నాడు. లేక 'ప్రూ' అనే ధాతువునకు 'పాలన' అని అర్థము. కాబట్టి పాలించువాడు, పరమపావనుడు పురుషుడు. (శ్రీకైవల్యసారథినుండి)

స యత్పూర్వః అస్మాత్ సర్వస్మాత్ పాప్మనా ఓషః తస్మాత్ పురుషః – పాపములను దహించు గుణము కలవాడు పురుషుడు అని శ్రీ భట్టులు చెప్పిన అర్థము శ్రీ శంకరులు చెప్పిన ప్రమాణమునకు (బృహదారణ్యక 1.4.1) దగ్గరగా ఉన్నది – **స యత్పూర్వోऽస్మాత్ సర్వస్మాత్ పాప్మనా ఔషత తస్మాత్ పురుషః.**

(7)వ భావము 'ప్రూ' అనే ధాతువు ఆధారముగా చెప్పబడినది. ప్రూ – రక్షించుట, పోషించుట. ఉణాది సూత్రము – **పురః కుషాన్**; పాణిని సూత్రము – **పుర అగ్రగమనే**. అగ్రగామియై ఉండువాడు పురుషుడు అనే భావమును శ్రీ పి.బి.అణ్ణాంగారాచార్య తమ సంక్షిప్తవ్యాఖ్యలో తీసికొన్నారు. శ్రీ వి.వి. రామానుజన్ ఈ నామమునకు క్లుప్తంగా 'రక్షకుడు, పోషకుడు' అని అర్థం చెప్పారు.

తవాऽహం చక్షుసా సౌమ్యపూతా సౌమ్యేవ మానద – రామా! నీ చల్లని చూపుతో నేను పరిశుద్ధనైనాను – అని శబరి రామునితో అన్నది. **పావనః సర్వలోకానాం త్వమేవ రఘునందన.**

శ్రీమన్నారాయణుడు పావనుడు. పాపహారి. ఫలప్రదాత. రక్షకుడు. పోషకుడు. సర్వాత్మకుడు. సనాతనుడు. పాలకుడు. పురుషుడు. శ్రీమన్నారాయణుడు. శ్రీరాముడు. సీతారాముడు. లక్ష్మణ సమేతుడు. హనుమత్సేవితుడు.

డా. క్రోవి పార్థసారథి రచన శ్రీ కైవల్యసారథి నుండి – విష్ణుధర్మోత్తరపురాణంలో పురుష స్వరూప వర్ణన. మార్కండేయునిచే వజ్రునకు చెప్పబడినది.

అజేయం వైష్ణవం తేజస్తశ్చ నిత్యం చ జంతుషు

నాశమాయాన్తి తే సర్వేహీనా వైష్ణవ తేజసా

అవినాశి జగత్యస్మిన్ న కించిదథ విద్యతే

ఋతేతు మహత్ తస్మాత్తేజసో నృప! వైష్ణవాత్

...........సర్వతః పాణి పాదాంతం సర్వతోऽక్షి శిరోముఖమ్ ....

అవినాశి తదేవైకం యస్యోదర గతం జగత్

సదాశివేతి తం కేచిదాహుర్దేవం జగత్పతిమ్

వాసుదేవేతి చాప్యన్యే కాలమిత్యేవ చా పరే
కర్మేతి చాపరే ప్రాహుః పురుషేతి తథాపరే
ప్రణవాఖ్యం తథా తం చ విదుర్వేదవిదో జనాః

విష్ణుతేజస్సు అజేయమైనది. శాశ్వతమైనది. అది లేనివారు నశిస్తారు. జగత్తంతా నిండిఉన్నది, నాశనము లేనిది ఒక్కటే. దానికి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు ఉండవు. అది సర్వేశ్వర మయము. నిర్గుణము. గుణాతీతము. అన్ని ఇంద్రియాలను, గుణాలను ప్రకాశింపజేసేది. దానికి మాత్రము ఇంద్రియాలు లేవు. దానికి అన్నివైపులకు కళ్ళు, ముక్కు, చెవులు, నోరు ఉంటాయి. అదే ప్రకాశరూపము. కేవలము జ్ఞానము. సర్వవ్యాపకము. పరమేశ్వరము. నాశన రహితము. దాని ఉదరమందే జగత్తంతా ఉన్నది. అటువంటి దానిని కొందరు సదాశివుడు అంటారు. కొందరు జగదీశ్వరుడు అంటారు. కొందరు వాసుదేవుడు అంటారు. కొందరు కాలము అంటారు. కొందరు దైవము అంటారు. కొందరు స్వభావము అని, కొందరు కర్మ అని అంటారు. వేదవేత్తలు దానిని ప్రణవము అంటారు. అది అజము-పుట్టనిది, అవ్యక్తము-కనిపించనిది, నాశనము లేనిది, అదే పురుష స్వరూపము.

408. ప్రాణః

జీవమును నిలుపు వాయువు.

ఓం ప్రాణాయ నమః

ఇదే నామము 67వ, 322వ నామములుగా కూడ స్తుతించబడినది.

8వ శ్లోకము. 67వ నామము – ప్రాణః – **ఈశానః ప్రాణదః ప్రాణో జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః**

35వ శ్లోకము. 322వ నామము – ప్రాణః – **అచ్యుతః ప్రథితః ప్రాణః ప్రాణదో వాసవానుజః**

44వ శ్లోకము. 408వ నామము – ప్రాణః – **వైకుంఠః పురుషః ప్రాణః ప్రాణదః ప్రణవః పృథుః**

67వ నామమునకు చెప్పిన భావము – **ప్రాణితి ఇతి ప్రాణః** – అన్ని జీవులకు మూలచేతనత్వమై, అంతర్యామియై, భరించి పోషించువాడు.

322వ నామమునకు – నారాయణుని శరణుజొచ్చిన భక్తులకు ఆయనే ప్రాణము – అని శ్రీ భట్టులు చెప్పారు. అన్ని ప్రాణములందు స్థితుడైన మూలప్రాణము – అని శ్రీ శంకరులు చెప్పారు.

408వ నామమునకు – అందరు భక్తులకు, దేవతలకు కూడ ప్రాణరూపమున శరీరమందుండి చేష్టలు కలిగించువాడు.

409. ప్రాణదః

ప్రాణములనిచ్చువాడు.

ఓం ప్రాణదాయ నమః

ఈ శుభనామము 66వ, 323వ, 409వ, 956వ నామములుగా – అనగా నాలుగుమార్లు స్తుతించబడినది.

8వ శ్లోకము. 66వ నామము - ప్రాణదః – **ఈశానః ప్రాణదః ప్రాణో జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః**

35వ శ్లోకము. 323వ నామము – ప్రాణదః – **అచ్యుతః ప్రథితః ప్రాణః ప్రాణదో వాసవానుజః**

44వ శ్లోకము. 409వ నామము – ప్రాణదః – **వైకుంఠః పురుషః ప్రాణః ప్రాణదః ప్రణవః పృథుః**

102వ శ్లోకము. 956వ నామము – ప్రాణదః – **ఊర్ధ్వగః సత్పథాచారః ప్రాణదః ప్రణవః పణః**

ఈ నామమునకు భాష్యకారులు వివిధములుగా అర్థములు చెప్పారు.

(1) శ్రీ శంకరులు, శ్రీ భట్టులు కూడా చెప్పినది – **ప్రాణాన్ దదాతి ఇతి ప్రాణః** – ప్రాణములను ఇచ్చువాడు.

(2) శ్రీ శంకరులు – **ప్రాణన్ ద్యాతి ఇతి ప్రాణః** – ఆయువు తీరిన పిదప ప్రాణములను హరించువాడు.

(3) శ్రీ శంకరులు – **ప్రాణాన్ దీపయతి** – ప్రాణములను ప్రకాశింపజేయువాడు.

భగవంతుని ప్రాణప్రసాద గుణమును మరొక విధముగా కూడ వివరించారు. నిత్యసూరులైనవారు శ్రీమన్నారాయణానుభవమును నిర్విరామముగా ఆనందించి తమ ప్రాణములను నిలుపుకొందురు. ఇది భగవానుని ప్రసాదమే.

ధర్మచక్రము రచయిత వివరణ – సూర్యకాంతి రూపములో భగవానుడొసగు ప్రాణము జీవులను చైతన్యవంతులుగా చేయును. తాము భగవంతునికి చెందినవారమని తలచినవారు ప్రకాశమానులగుదురు. మంత్రస్వరూపుడై భగవంతుడు గాయత్రీ జపమును చేయువారిని ఉద్దీపించి జ్ఞానోన్ముఖులను చేయును. ఇలా భగవంతుడు అనేకానేక విధములుగా ప్రాణదుడు. ప్రాణములిచ్చు ప్రభువు.

410. ప్రణమః / ప్రణవః

- అందరిచే ప్రణామములందుకొనువాడు.

- వేదములందు ప్రణామములు గ్రహించువాడు.

- అన్ని విధముల పూజ్యుడు. ఆయనకు దాస్యము చేయుట ఉత్తమ ధర్మము.

ఓం ప్రణమాయ నమః

ఓం ప్రణవాయ నమః

44వ శ్లోకము. 410వ నామము. ప్రణవః / ప్రణమః – **వైకుంఠః పురుషః ప్రాణః ప్రాణదః ప్రణవః పృథుః**

102వ శ్లోకము. 957వ నామము. ప్రణవః – **ఊర్ధ్వగః సత్పథాచారః ప్రాణదః ప్రణవః పణః**

ప్రణామయతి ఇతి ప్రణమః – భగవంతుని పరమేశ్వరత్వము కారణముగా అందరును ఆయనకు దండము పెట్టవలసినదే. శ్రీ వి.వి. రామానుజన్ దివ్యప్రబంధము (నాన్మ్ముగన్ తిరువంతాది. 8) నుండి ఉదాహరించారు. రాముడొక్కడే పూజ్యుడు.... .... వేరెవ్వరును కాదు.

'ప్రణవ' నామమును కూడ కొందరు గ్రహించారు. అపరిమితముగా కీర్తింపబడువాడు – అనే అర్థమునకు శ్రీ శంకరులు సనత్కుమారుని మాటలను ఉదాహరించారు. **ప్రణమతీహ వై వేదా స్తస్మాత్ ప్రణవ ఉచ్యతే** – వేదములలో ఈయనకు ప్రణామములు చెప్పబడునవి. కనుక 'ప్రణవః'.

'ప్రణవ మంత్రము' అన్న భావములో మంత్రస్వరూపుడైన భగవానుడు ప్రణవము.

శ్రీ కైవల్యసారథిలో ఇచ్చిన మరికొన్ని ఉదాహరణలు.

గణైశ్చరాచరం నిత్యం నామనాత్ప్రణమ స్మృతః – తన కళ్యాణగుణములచేత జగత్తులోని జీవులన్నింటిని సర్వదా తనకు అణగి ఉండేటట్లు చేయువాడు. ప్రణమః.

ప్రణమంతాహ వై వేదాస్తస్మాత్ప్రణవ ఉచ్యతే – తన గుణములచే చరాచర జగత్తును తనకు లొంగజేసుకొన్నవాడు. దేవతలచేత కూడ ఆరాధింపబడువాడు. ప్రణవః.

ప్రణమయతీతి ప్రణమః – అతనికి వేదములుకూడ ప్రణమిల్లుతాయి. ప్రణమః

గుణైర్దాస్య ముపాగతః – ఆయన కళ్యాణగుణములకు ప్రపంచమంతా దాసోహము అంటున్నది. అని రామాయణములో చెప్పడినది.

411. పృథుః

- వ్యాపించిన కీర్తిగలవాడు.
- విశ్వమంతట విస్తరించినవాడు.
- పృథుమహారాజుగా అవతరించినవాడు.

ఓం పృథవే నమః

ప్రథ – ప్రఖ్యానే – ఖ్యాతి పొందుట – అన్న ధాతువునుండి ఈ నామమును వివరిస్తూ శ్రీ భట్టులు రామాయణము బాలకాండము (1.8)నుండి ఉదాహరించారు. **పృథుశ్రీః పార్థివాత్మజః** – దశరథుని కుమారుడు లోకమంతట కీర్తినొందినవాడు.

బాలకాండము 77.28 – **తేషామ్ అతియశో లోకో రామః** – వారిలో రాముడు అందరికంటె యశము నొందినవాడు.

తిరువైమొళి 6.10.10 – **నిగర్ ఇల్ పుగళాయ్**

యశో విశాలవత్వాచ్చ పృథురిత్యుచ్యతే బుధైః

శ్రీ శంకరులు చెప్పిన అర్థము – తానే స్వయముగా విశ్వమై విస్తరిల్లినవాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – ప్రథ్ - విస్తారే - వ్యాపించుట – శ్రీ మహావిష్ణువు విశ్వరూపము ఈ రెండు అర్థములను చక్కగా సమన్వయపరచుచున్నది. ఆయన విరాట్ స్వరూపము అందరిచే కీర్తింపబడుచు యశోవిరాజితమై యున్నది. ఆయన విరాట్ స్వరూపములో విశ్వమంతా వ్యాపించియున్నది.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – పృథుమహారాజు విష్ణుమూర్తి అవతారమని భాగవతము (1.3.4)లో చెప్పబడినది. **ఋషిభిర్యాచితో భేజే నవమం పార్థివం వపుః** – ఋషుల ప్రార్థనలు మన్నించి ఆయన పృథువు రూపములో వచ్చెను. ఆ సమయంలో కరువు నెలకొన్నది. అప్పుడు భూదేవి గోమాతగా ప్రత్యక్షమైనది. స్వాయంభువ మనువు దూడగా, పృథుమహారాజు తన అరచేతిని పాత్రగా చేసి, ఆవు రూపంలోనున్న భూదేవి పాలు పితికాడు. దేశం సస్యశ్యామలమయ్యింది.

412. హిరణ్యగర్భః

- అందరికిని సంతుష్టిని, ఆనందమును కలిగించేవాడు.
- తనను ధ్యానించే భక్తుల హృదయములందు బంగారు నిధి.
- బ్రహ్మకు జన్మనిచ్చిన హిరణ్మయాండమును గర్భమున కలిగినవాడు.
- అతి రమణీయమగు పరమపదమున (వైకుంఠమున) నివసించువాడు.

ఓం హిరణ్యగర్భాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

8వ శ్లోకము. 71వనామము – హిరణ్యగర్భః - **హిరణ్యగర్భో భూగర్భో మాధవో మధుసూదనః**

44వ శ్లోకము. 412వనామము – హిరణ్యగర్భః – **హిరణ్యగర్భః శత్రుఘ్నో వ్యాప్తో వాయురధోక్షజః**

ఇంతకుముందు ఈ నామము 71వ నామముగా చెప్పబడినది. అప్పుడు శ్రీవైకుంఠమున నుండువాడు గనుక హిరణ్యగర్భుడు అని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. "'హిరణ్యము' అనగా బంగారము. పరిశుద్ధము, ఆకర్షణీయము, అందరు కోరుకొనేది. అలాగే పరమపదము కూడా శుద్ధసత్త్వమయము. ముముక్షువుల గమ్యము. కనుక హిరణ్యముతో పోల్చారు. అన్నివిధాల మంచిదానిని ప్రసాదించువాడు హిరణ్యగర్భుడు. '**నిరతిశయ తేజోరూపమాన పరమపదము**'న నుండువాడు హిరణ్యగర్భుడు.

హితస్య రమణీయస్య ధ్యాతౄణాం హృదయస్య హి
హిరణ్యగర్భస్తత్రస్థః స శుభాశ్రయణ స్మృతః
యద్వా హిరణ్యగర్భోఽసౌ హిరణ్యనిధి సామ్యతః
తనను ధ్యానించే భక్తుల హృదయములందు ఉండేవాడు. బంగారునిధి వంటివాడు. వారికి శుభములు కూర్చువాడు.
ధ్యేయః స ఏవ విశ్వాత్మా – విశ్వరూపుడు, విశ్వాత్ముడు అయిన పరమేశ్వరుని హృదయమునందు ధ్యానించాలి.

నారాయణుడు మొదట జలమును సృష్టించెను. ఆ జలమునందు తన వీర్యమును వదిలాడు. అది బంగారు గ్రుడ్డయి నీటియందు తేలింది. ఆ అండమునుండి బ్రహ్మ జనించాడు. ఈ రకంగా హిరణ్యమును గర్భమునందు గలవాడు గనుక నారాయణుడు హిరణ్యగర్భుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి 'వైకుంఠః' నామమునుండి ఈ 'హిరణ్యగర్భః' నామమువరకు అన్ని నామములను సృష్టికార్యపరంగా సమన్వయపరుస్తూ చక్కగా వ్యాఖ్యానించారు.

వైకుంఠః – భగవంతుడు వైకుంఠములోనుండే పరమపురుషుడు. అపరిమిత శక్తి సంపన్నుడు.

పురుషః – ఆ పరమపురుషుడు దిగివచ్చి, జీవుల శరీరములలో పురుషునివలె నివశించుచున్నాడు. హృదయస్థానమే ఆయనకు వైకుంఠమయ్యెను. ఈ ఆకాశమునకంటె ముందుగా ప్రణవనాదముండెను.

ప్రాణః, ప్రాణదః – ఆపై భగవంతుడు ప్రకృతిని నిలిపే ప్రాణశక్తిని జీవులను చైతన్యవంతులుగా చేసేలా మార్చాడు. అలా ఆయన ప్రాణదుడయ్యెను.

ప్రణవః – ఇలా సృష్టి ఆరంభము కాగా, పంచభూతములలో మొదటిగా ఆకాశము ఉద్భవించెను (**తస్మాద్ వా ఏతస్మాదాత్మనా ఆకాశ సంభూతః**).

పృథుః – **ఆకాశాత్ వాయుః, వాయోరగ్నిః, అగ్నేరాపః, అబ్భ్యః పృథ్వీ**. అలా పంచభూతముల క్రమములో పృథ్వి జనించెను. ఇలా భగవంతుడు పృథువై విశ్వమును విస్తరింపజేసెను.

హిరణ్యగర్భః – స్థూలరూపమునుండి సూక్ష్మరూపుడై విస్తరించుచు దేవదేవుడు ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశములు తన సృష్టికొసగి హిరణ్యగర్భుడయ్యెను.

413. శత్రుఘ్నః

శత్రువులను నాశనము చేయువాడు.

ఓం శత్రుఘ్నాయ నమః

శత్రుమ్ హన్తి ఇతి శత్రుఘ్నః –తన భక్తుల శత్రువులను నాశనము చేయువాడు శత్రుఘ్నుడు.

శత్రూనింద్రియ వర్గాన్యే హంరితి శత్రుఘ్న ఉచ్యతే – తన భక్తుల ఇంద్రియములు అటునిటు పోకుండా అణచి ఉంచేవాడు శత్రుఘ్నుడు.

భగవంతుని ధ్యానించిన యెడల అట్టి భక్తుల బాహ్య శత్రువులను, అంతఃశత్రువులను కూడ భగవంతుడు నాశనము చేయును.

414. వ్యాప్తః

- అందరిపట్ల ప్రీతి, వాత్సల్యము, కరుణ పొంగియున్నవాడు.
- అంతటను వ్యాపించినవాడు.

ఓం వ్యాప్తాయ నమః

నిరుక్తిలో ఇలా చెప్పారు – **నీచపూర్వోఽవిశేషణ వ్యాపనాద్వ్యాప్త ఉచ్యతే** – గొప్ప, సామాన్య, తక్కువ భేదములు లేకుండా తనను కొలుచువారందరిపట్ల వాత్సల్యము వర్షించువాడు. శ్రీభట్టులు రామాయణము అరణ్యకాండము (2.37.38)నుండి చెప్పిన ఉదాహరణ –

పౌరాన్ స్వజనవత్ నిత్యమ్ కుశలమ్ పరిపృచ్ఛతి

పుత్రేష్వంగిషు దారేషు ప్రేష్య శిష్యగణేషు చ

నిఖిలేన అనుపూర్వ్యాచ్చ పితా పుత్రానివ ఔరసాన్

ఇంకా శ్రీరాముడు - **రిపుణామపి వత్సలః** – శత్రువులపట్ల కూడ వత్సలుడు (యుద్ధకాండము 50.56)

శ్రీ శంకరులు, శ్రీ చిన్మయానంద, శ్రీరాధాకృష్ణశాస్త్రి – అంతటను వ్యాపించియున్నందున శ్రీనివాసుడు వ్యాప్తుడు.

415. వాయుః

- చలించువాడు. భక్తుల కడకు తానై పోవువాడు.

- అంతటను వ్యాపించుయున్నవాడు.

- పుణ్యగంధమూర్తి. ప్రాణము నిలుపువాడు.

ఓం వాయవే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య –

తత్ర తత్ర స్థితాన్ సర్వాన్ భరద్వాజ గుహాదికాన్

గచ్ఛతి స్వయమేవైతాన్ స వాయురితి శబ్ద్యతే

భగవానుడు తానై భక్తుల కడకు పోయి వారిని అనుగ్రహించును. అలా రాముడు గుహుని వద్దకు, భరద్వాజుని వద్దకు, శబరివద్దకు వెళ్ళి వారిని ధన్యులను చేసెను.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **వాతి సర్వత్ర గతో భవతి ఇతి వాయుః** – ఆయన లేని స్థలము లేదు. చొరరాని చోటు లేదు. సర్వవ్యాపకత భగవంతుని లక్షణము. కనుక ఆయన వాయువు.

ధర్మచక్రము రచయిత – ఈ నామము భగవంతుని సర్వవ్యాప్తి గుణమును స్తుతించును. మిగిలినవి ఎన్ని యున్నను వాయువు లేక జీవించుట అసాధ్యము. అలాగే భగవంతుడు ప్రాణప్రదాత. ఆయన కృప యున్నంతవరకే ప్రాణము నిలిచియుండును. ఇంకా వాయువు తనంతట తానే జీవులకడకు వచ్చి వారి జీవమును నిలుపును. అలాగే భగవంతుడు స్వయముగా తానేతెంచి భక్తులను బ్రోచును. వాయువు తరతమ భేదములు లేకుండ అందరి ప్రాణములను పోషించును. అదేవిధముగా భగవంతుడు అందరికిని సమముగా ప్రాణము ప్రసాదించును. భగవంతుని 'వాయువు' అని స్తుతించునపుడు ఇన్ని వాత్సల్యగుణములను స్మరింపనగును.

శ్రీ చిన్మయానంద – భగవంతుడు వాయువు మాత్రమే కాదు. వాయువుకున్న ప్రాణప్రదానశక్తి భగవంతుడే.

పుణ్యోగంధః పృథివ్యాంచ తేజశ్చాస్మి విభావసౌ

జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు – గీత 7.9

పృథివియందున్న గంధాన్ని, అగ్నిలోని తేజస్సును, సమస్త ప్రాణులయందు చైతన్యాన్ని, తాపసులలోని తపస్సును నేనే.

శ్రీ శంకరులు – గంధము కలిగించునది వాయువు – అనే భావములో వ్యాఖ్యానించారు. **వాతి గంధం కరోతి ఇతి వాయుః.**

పుణ్యగంధము కలిగించునది వాయువు అనుటకు శ్రీ రాధాకృష్ణశాస్త్రి ఉపనిషత్తులనుండి ఉదాహరించారు –

వాయురస్మై పుణ్యం గంధం ఆవహతి – ఐతరేయ 1.7.

యో వాయౌ తిష్ఠాన్ వాయోరంతరో

యమ్ వాయుర్న వేద యస్య వాయుః శరీరమ్

యో వాయుమంతరో యమయతి

ఏష తే ఆత్మాంతర్యామ్యమృతః – బృహదారణ్యకము 3.7.7

భగవానుడు వాయువునకు అంతర్యామియై వాయవు తన ధర్మములను (కార్యములను) నిర్వర్తించునట్లు చేయును.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి పెక్కు ఉదాహరణలద్వారా దేవతలలో వాయువునకున్న ప్రాముఖ్యతను వివరించారు –

వాయుర్వావ సంవర్గో యదా వా అగ్నిరుద్వాయతి, వాయుమేవాప్యేతి, యదా సూర్యోऽస్తమేతి వాయుమేవాప్యేతి, యదా చంద్రోऽస్తమేతి వాయుమేవాప్యేతి, యదాపయుచ్ఛుష్యంతి వాయుమేవాపియంతి వాయుహ్యేవైతాన్, సర్వాన్ సంవృక్తే – ఛాందోగ్యోపనిషత్తు 4.3

సూర్యుడు, చంద్రుడు, అగ్ని, నీరు – అన్నీ తుదకు వాయువునందు ఐక్యమగును.

మ్లోచ్చంతి హ్యన్య దేవతాః, న వాయుః

శేషాऽనస్తమితా దేవతా వాయుః – బృహదారణ్యకోపనిషత్తు 1.5.22

సూర్యుడు, చంద్రుడు వంటి తక్కిన ఇంద్రియ దేవతలు సుషుప్తి స్థితిలోనున్నపుడు వాయువు మాత్రము ప్రాణమై చైతన్యముతోనుండును,

కిం తద్విష్ణోః బలమాహుః వాతాద్విష్ణోః బలమాహుః – తైత్తరీయ 1.8.3 - భగవంతుడైన విష్ణువు తన వాయువిభూతి ద్వారా భూమిని ధరించును (భరించును).

వాయుర్వై గౌతమ్ తత్ సూత్రమ్

వాయునావై గౌతమ్ సూత్రేణాయమ్ చ

లోకః పరశ్చలోకః సర్వాణి చ భూతాని సంద్బృబ్ధాని భవన్తి – బృహదారణ్యక 3.5.2

మణులలో దారమువలె ప్రపంచములనన్నింటినీ కలిపియుంచేది వాయువు. అది లేకుంటే లోకములు చెల్లాచెదురైపోవును. అలా కలిపి ఉంచే శక్తి భగవంతుడే.

విశ్వము ఉనికికి ఇంత ముఖ్యమైనందున భగవంతుడే వాయువు.

417. అధోక్షజః

- తరగనివాడు.

- భూమ్యాకాశముల మధ్య విస్తరించిన విరాట్ స్వరూపుడు.

- ఇంద్రియములచే తెలియరానివాడు.

ఓం అధోక్షజాయ నమః

సదోపభుజ్యమానోऽపి సర్వై రమృత సింధువత్
అధో న క్షీయతే జాతు యస్మాత్తస్మా దధోక్షజః

అందరిచేత అన్ని వేళలయందు అనుభవింపబడువాడైనప్పటికీ, సముద్రమువలె ఉన్నతుడు. కొంచెము కూడా తరగనివాడు. అమృతమువంటివాడు. ఈ నామవివరణకు చక్కగా సరిపోయేపాశురాన్ని శ్రీ నమ్మాళ్వార్ తిరువైమొళి (4.3.10)నుండి శ్రీ వి.వి.రామానుజన్ ఉదాహరించారు.

అధో న క్షీయతే జాతు యస్మాత్తస్మాదధోక్షజః – మహాభారతము ఉద్యోగపర్వము 4.69.10 – ఎన్నడును తన దివ్యత్వమునుండి జారినవాడు కాడు గనుక అధోక్షజుడు (అధః-క్రిందికి, క్షీయతే-క్షీణించువాడు, న-కాడు)

శ్రీ శంకరులు రెండు విధములుగా వ్యాఖ్యానము చెప్పారు –

అక్షగణములు (ఇంద్రియములు) అధోముఖములు (అంతర్ముఖములు) అయినపుడు తెలియవచ్చువాడు. అనగా నిగ్రహముతో అంతఃదృష్టి గలవారికి మాత్రమే అవగతమగువాడు.

అధోభూతేహ్యక్షగణే ప్రత్యగ్రూప ప్రవాహితే
జాయతే తస్య వై జ్ఞానమ్ తేన అధోక్షజ ఉచ్యతే

అన్ని చోట్లా ఉన్నాగాని చక్షురాది ఇంద్రియములకు కానరానివాడు అని శ్రీరాధాకృష్ణశాస్త్రి వివరించారు.

శ్రీ శంకరులు చెప్పిన మరొక అర్థము –

అక్షమ్ అధః తయోర్మధ్యే వైరాజ రూపేణ అజాయత ఇతి అధోక్షజః – అక్షభాగము (ఆకాశము)నకు, అధోభాగము (భూమి)కి మధ్య విరాట్ స్వరూపుడై విలసిల్లినవాడు అధోక్షజుడు.

అక్షయం మధుహంతారమ్ జానామిత్యాం సురోత్తమమ్ – పరమేశ్వరుడు మధుసూదనుడని, అక్షయుడని, సురోత్తముడని చెప్పబడుచున్నాడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.
(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

ఋతుః సుదర్శనః కాలః పరమేష్ఠీ పరిగ్రహః |
ఉగ్రః సంవత్సరో దక్షో విశ్రామో విశ్వదక్షిణః || (45)

417. ఋతుః

- కాలములో చక్రరూపమున సంభవించే ఋతువుల స్వరూపుడు.
- అందరికీ ఆనందాన్నిచ్చే కళ్యాణగుణసంపన్నుడు.

ఓం ఋతవే నమః

ఋచ్ఛతి ఇతి ఋతుః ప్రోక్తః సర్వోల్లాసకరైర్గుణైః – ప్రతి సంవత్సరము ఆరు ఋతువులు ఒకదాని వెనుక ఒకటి సంభవించును. ఒక్కొక్క ఋతువు సమయానికి తోసుకొనివచ్చి తనతో వాతావరణములో మార్పులను, వివిధ పుష్పఫలసంపదను తీసికొనివచ్చి సకలభూతములకు సుఖశాంతులు కలిగించును. ఇలా కాలస్వరూపుడైన శ్రీనివాసుడు ఋతువు.

ఇంకా భక్తుల గుండెలలో మరల మరల ఆనందమును అలలు అలలుగా ప్రసాదించి కరుణించును గనుక శ్రీనివాసుడే ఋతువు.

భగవంతుడు ఋతురూపమున సర్వత్ర ఉన్నాడు గనుక ఋతువు.

418. సుదర్శనః

- కనులకింపైన, రమణీయమైన, శుభప్రదమగు దర్శనమిచ్చువాడు.
- ఆయన దర్శనము మోక్షప్రదము.
- పద్మపత్రములవంటి కన్నులు గలవాడు.

- తన భక్తులకు సులభముగా దర్శనమిచ్చువాడు.

ఓం సుదర్శనాయ నమః

శుభం చ దర్శనం యస్య మందానాం స సుదర్శనః – శోభనం దర్శనం యస్య స సుదర్శనః – ఆయన దర్శనము సు-దర్శనము. రాముని చూచిన దినమే సుదినము. సురరక్షకుని చూచు చూడ్కులు చూడ్కులు. శ్రీ వేంకటరమణుని దర్శనము సకల పాపహరము. శుభకరము. మోక్షప్రదము. శ్రీ సీతారాముల కళ్యాణము చూచినవారికి కన్నుల పండుగ. భగవంతుని దర్శనము అందరికిని, ఆయన గుణ వైభవ హాత్మ్యములు తెలియని మందులకు కూడా, మహదానందకరము. సకలశుభప్రదము. సమస్త సన్మంగళ ప్రసాదము. అని శ్రీ భట్టులు వివరించారు. శ్రీ వి.వి. రామానుజన్ **'దృష్టి చిత్తాపహారి'** అని భగవద్గుణములను స్తుతించారు.

శ్రీ శంకరులు మూడు విధాలైన అర్థాలను చెప్పారు.
సు-దర్శనమ్ అస్య ఇతి సుదర్శనః – ఇక్కడ సు-శోభనమ్, నిర్వాణ ఫలమ్, దర్శనమ్-జ్ఞానమ్ – అనగా మోక్షప్రదమైన జ్ఞానస్వరూపుడు గనుక జగన్నాధుడు సుదర్శనుడు.

శుభే దర్శనే-ఈక్షణే పద్మపత్రాయతే అస్య ఇతి సుదర్శనః – తామరపూవు రేకులవంటి కన్నులు గలవాడు సుదర్శనుడు.
రామః కమలపత్రాక్షః సర్వసత్త్వ మనోహరః
రూప దాక్షిణ్య సంపన్నః ప్రసూతో జనకాత్మజే – సుందరకాండము 35.8

సుఖేన దృశ్యతే భక్తైః ఇతి సుదర్శనః – తన భక్తులకు సులభముగా దర్శనమిచ్చువాడు సుదర్శనుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి ఈ 'సుదర్శనః' నామమును ఇందకు ముందు నామమైన 'ఋతుః'తో అనుసంధిస్తూ – సుదర్శన చక్రమునకు దేవత సుదర్శనుడు. ఆరు ఋతువువులతో కాలము నిరంతరము తిరుగుచున్నట్లే ఆరు మొనలుగల సుదర్శనచక్రము మహాశక్తియుతమై పరిభ్రమించుచున్నది – అని వివరిస్తూ నృసింహపూర్వ (7.2) నుండి చెప్పిన ఆధారము –
షడారమ్ వా ఏతత్ సుదర్శనమ్ మహాచక్రమ్ తస్మాత్ షడారమ్ భవతి
షడ్పత్రమ్ చక్రమ్ భవతి
షడ్వా ఋతవః ఋతుభిః సమ్మితమ్ భవతి మధ్యేనావిర్భవతి........

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – భగవంతునకు సూర్యుడే నేత్రము. ఇంకా ఆయన అన్నింటా అంతర్యామి. కనుక విశ్వమలో అంతటినీ స్పష్టముగా చూడగల (దర్శించగల) భగవంతుని గుణవైభవము సుదర్శన నామమున తెలియవచ్చుచున్నది.

సుదర్శన షట్కమ్

సహస్రాదిత్య సంకాశం – సహస్ర వదనం పరం
సహస్ర దోస్సహస్రారం – ప్రపద్యేऽహం సుదర్శనమ్

హసంతం హార కేయూరం – మకుటాంగద భూషణైః
శోభనైర్భూషిత తనుం - ప్రపద్యేऽహం సుదర్శనమ్

స్రాకార సహితం మంత్రం – వదనం శత్రునిగ్రహం
సర్వరోగ ప్రశమనం - ప్రపద్యేऽహం సుదర్శనమ్

రణత్కింకిణి జాలేన – రాక్షసఘ్నం మహాద్భుతం
వ్యుప్తకేశం విరూపాక్షం - ప్రపద్యేऽహం సుదర్శనమ్

హుంకార భైరవం భీమం – ప్రణతార్తిహరం ప్రభుం
సర్వపాప ప్రశమనం - ప్రపద్యేऽహం సుదర్శనమ్

ఫట్ కారాన్త మనిర్దేశ్య – దివ్యమంత్రేణ సంయుతం
శివం ప్రసన్న వదనం - ప్రపద్యేऽహం సుదర్శనమ్

ఏతైష్షడ్భిః స్తుతో దేవః – ప్రసన్నః శ్రీ సుదర్శనః
రక్షాం కరోతి సర్వాత్మా – సర్వత్ర విజయీ భవేత్

ఇతి సుదర్శన షట్కమ్

షట్కోణాంతర మధ్యవర్తి నిలయం – స్వచ్ఛేందు దంష్ట్రాననం
చక్రాద్యాయుధ చారుషోడశ భుజం – ప్రజ్వాల కేశోజ్వలం
వస్త్రాలేపన మాల్య విగ్రహ గుణై – స్థం బాల మిత్రారుణైః
ప్రత్యాలీఢ పదాంబుజం త్రినయనం – చక్రాధిరాజం భజే

---

419. కాలః

- అందరిని తనవైపుకు లాగుకొనేవాడు.

- ప్రతిదానిని గణించి, హద్దులేర్పరచువాడు.

- తన శత్రువులకు మృత్యురూపుడు.

- అందరి కర్మలను లెక్కించి తదనుగుణముగ ఫలములిచ్చువాడు.

ఓం కాలాయ నమః

కలనము చేయుట, అనగా లెక్కబెట్టుట – అనే అర్థములో ఈ నామమునకు వ్యాఖ్యానము చెప్పారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **చరాచర సంకలనాత్ కాలః** – చలించువానిని, నిశ్చలమైనవానిని కూడ సంకలనము చేయువాడు, అనగా ప్రోగుచేయువాడు. అన్నింటిని తనయందు నిలుపుకొను ఆనందమయుడు.

శ్రీ శంకరుల భాష్యము – **కలయతి సర్వమ్ ఇతి కాలః** – అన్నింటిని లెక్కించువాడు. పరిమితులు విధించువాడు. అని శ్రీ శంకరులు గీత (10.30)నుండి ఉదాహరించారు – **కాలః కలయతామహమ్** – గణకులలో నేను కాలమును.

గీతలో ఈ భాగమునకు శ్రీ రామానుజుల భాష్యము – **అనర్థ ప్రేప్సుతయా గణయతామ్ మధ్యే కాలః మృత్యుః అహమ్** – అనర్థములు ప్రేరేపించువారికి నేను మృత్యువును. ఈ విషయానికి తిరుక్కళ్ళమ్ శ్రీ నృసింహ రాఘవాచార్యస్వామి 'అందరి కాలమును, అంతమును లెక్కించువాడు' అని వివరించారు. అనగా 'శత్రువులకు మృత్యువు' అని శ్రీ చిన్మయానంద వివరణ. శ్రీ సత్యదేవో వాసిష్ఠ కూడా 'కాల స్వరూపుడు, కర్మఫలప్రదాత' అనే వివరించారు. **సర్వేశ్వరో విష్ణురేవ కాలో, యతో హి స కలయతి గణయతి, సమస్త ప్రాణి కర్మాణి, తదనుకూల ఫల ప్రదాయ.**

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – లెక్కించే వానిలో కాలము అన్నింటికంటె నిర్దిష్టమైనది. వ్యత్యాసమునకు ఆస్కారము లేనిది. అన్నింటిని వాని అంతమునకు కొనిపోవును. ఇది భగవత్స్వరూపము.

కాలో హి నామ భగవాన్ స్వయంభూ అనాది మధ్య నిధనః స సూక్ష్మామపి కలామ్ న లీయతే ఇతి కాలః సంకలయతి కాలయతి వా భూతాని ఇతి కాలః – శుశ్రుత సూత్ర 6.3.

420. పరమేష్ఠీ

- పరమపదమునందు, అనగా వైకుంఠమునందు, ఉండువాడు.
- హృదయము అను గుహయందు ప్రకాశించువాడు.

ఓం పరమేష్ఠినే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **పరమే స్థానే తిష్ఠతి ఇతి పరమేష్ఠీ** – శ్రీదేవుడు పరమపదమైన వైకుంఠమునందు వసించును. రాక్షస సంహారము అను లీల అనంతరము భగవంతుడు మరల పరమపదమును చేరును. శ్రీ వి.వి. రామానుజన్ తిరువైమొళి (6.4.10)నుండి ఉదాహరించారు.

శంకరభాష్యము ననుసరిస్తూ శ్రీ చిన్మయానంద వ్రాసినది – హృదయమనే అద్భుతమైన, శ్రేష్ఠమైన గుహను కల్పించి, అందుండి ప్రకాశించువాడు. భక్తుల అనుభవమునకు ఆ విధముగా అందెడువాడు పరమేష్ఠి. ఇందుకు ప్రమాణముగా ఉదాహరించిన ఉపనిషద్వాక్యము – **పరమే వ్యోమ్ని ప్రతిష్ఠితః** (కఠోపనిషత్తు)..

420. పరిగ్రహః

- అంతటినీ తనతో తీసికొని వెళ్ళువాడు.
- శరణాగతులు భగవంతుని అన్నియెడలా పట్టుకొనియుందురు.
- భక్తితో అర్పించినది ఏదయినా గ్రహించువాడు.
- విశ్వములో అంతటిని తన అదుపులో నుంచినవాడు.

ఓం పరిగ్రహాయ నమః

శ్రీ భట్టుల భాష్యము – **అత్ర తత్ర చ పరితో గ్రహః అస్య ఇతి పరిగ్రహః** – ఇక్కడా, అక్కడా, అన్నిచోట్లా అన్నింటినీ అంగీకరించువాడు. గుహుని ఆతిథ్యము, శబరి ఆతిథ్యము స్వీరించినవాడు. శ్రీరామావతారము పరముగా శ్రీ భట్టులు వ్యాఖ్యానించిన నామములలో 'పరిగ్రహః'చివరిది. అవతార సమాప్తి కాలమున శ్రీరాముడు వైకుంఠమునకు పోవునపుడు సకల అయోధ్యావాసులను వృక్షములతో సహా తనతో తీసికొనివెళ్ళెను. శ్రీ నమ్మాళ్వారు తిరువైమొళి(7.5.1)లో ఈ విషయమును చక్కగా వర్ణించారు.

శబరి ఆతిథ్యం స్వీకరిస్తున్న రామలక్ష్మణులు - తూర్పు యడవల్లి ఆలయంలో శిల్పం (చిత్రంలో ఉన్న వ్యక్తి అపర్ణ)

శ్రీరామావతారానుభవ విశేష వర్ణనలను ముగిస్తూ శ్రీ భట్టులు చెప్పిన విషయము – శ్రీరామావతారమున స్పష్టముగా కానవచ్చు భగవంతుని గుణము సౌశీల్యము. సామాన్యమానవునివలె దేవదేవుడు భూమిపై జన్మించి, వినయముతో విద్యనభ్యసించి, సీతామహాలక్ష్మిని చేబట్టి, వనవాస దీక్షను పూని, పత్నీ

వియోగమున పరితపించి, హనుమంతుని సేవలను, వానరసైన్యము సహాయమును పరిగ్రహించి, రాక్షస సేనలతో యుద్ధము చేసి, రావణుని సంహరించి, లోకాపవాదమునకు వెరచి, సీతమ్మకు అగ్ని పరీక్ష పెట్టి, పిదప వైభవముగా పట్టాభిషిక్తుడై జనరంజకముగా పాలించినవాడు. అందరితోను వారిలోనొకడై కలిసిపోయినవాడు.

ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదామ్
లోకాభిరామం శ్రీరామం భూయో భయో నమామ్యహమ్.

శ్రీ శంకరులు చెప్పిన వివిధ అర్థములు –

పరితో గృహ్యతే – శరణు కోరినవారిచే అన్నిప్రక్కల పట్టుకొనబడినవాడు (చుట్టుముట్టబడినవాడు).

పరి గృహ్ణాతి ఇతి పరిగ్రహః – పత్రము, పుష్పము, ఫలము, జలము వంటి స్వల్ప నివేదనలను భక్తులనుండి ప్రేమగా గ్రహించువాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **పరితః సర్వతః గ్రహణమ్** – తన శక్తితో జగత్తునంతటిని అదుపులోనుంచినవాడు.

శ్రీ రఘురాజ పదాబ్జ నికేతన! పంకజ లోచన! మంగళరాశే!
చండ మహాభుజదండ సురారి విఖండన పండిత! పాహి దయాళో!
పాతకినం చ సముద్ధర మాం మహతాం హి సతామపి మానముదారం
త్వాం భజతో మమదేహి! దయాఘన! హే హనుమన్! స్వపదాంబుజదాస్యమ్!

---

412 నుండి 451 వరకు నామములు కల్క్యవతారము పరముగా వ్యాఖ్యానింపబడినవి.

422. ఉగ్రః

ఉగ్రుడు. భయముగొలుపువాడు. దుష్టులకు భయంకరుడు.

ఓం ఉగ్రాయ నమః

ఇక్కడినుండి కొన్ని నామములు శ్రీభట్టుల వ్యాఖ్యలో కల్క్యవతార వర్ణనాపరముగా సాగును.

ఉచ్ – సమవాయే – ప్రోగుచేయుట. **ఉచ్యతీతి ఉగ్రః**

నష్టే ధర్మే కల్కిరూపోహ్యవతార్య మహీభృతః
మ్లేచ్ఛాదీన్హ తవాన్యోసా ఉగ్ర ఇత్యుచ్యతే బుధైః

కలియుగాంతమున ధర్మము నశించి, పాపము విజృంభించినపుడు కల్కిరూపములో అవతరించి మ్లేచ్ఛులవంటి వారినందరినీ సంహరించే ఉగ్రమూర్తి. ఓం ఉగ్రాయ నమః.

కల్కేన విష్ణుర్భగవాన్ నష్టధర్మాऽవతారకృత్

ఉర్వ్యాం మ్లేచ్ఛగణం హత్వాऽవస్థితోయః కలౌయుగే

భగవానునిపట్ల భయమువలనే సూర్యుడు, చంద్రుడు, అగ్ని, వాయువు, ఇంద్రవరుణాదులు – అందరును తమతమ కర్తవ్యములను శ్రద్ధగా, సక్రమముగా, నిరంతరాయముగా నిర్వహిస్తున్నారు. అని కఠోపనిషత్తులో (తైత్తరీయోపనిషత్తు?) చెప్పబడినది.

423. సంవత్సరః

- పాతాళమున అనంతపద్మనాభుడై శయనించియున్నవాడు.
- సకల భూతములకు నెలవు.
- కాలస్వరూపుడు.

ఓం సంవత్సరాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

10వ శ్లోకము. 92వ నామము. సంవత్సరః – **అహః సంవత్సరో వ్యాళః ప్రత్యయః సర్వదర్శనః**

45వ శ్లోకము. 423వ నామము. సంవత్సరః – **ఉగ్రః సంవత్సరో దక్షో విశ్రామో విశ్వదక్షిణః**

శ్రీ భట్టుల వ్యాఖ్య – 'సం-వసతి' అనే మూలములనుండి శ్రీ భట్టులు ఈ నామమును వివరించారు.

సంహారస్యోపకరణైః సాకం కాలం ప్రతీక్షయన్

సంవత్సర స్యాత్పాతాళే హ్యన్యంతే వసతీతియః

కలియుగాంతమున సంహారకార్యమునకు కావలసిన పరికరాలతో, తగుసమయంకోసం ఎదురుచూస్తూ పాతాళమున అనంతునిపై శయనించినమూర్తి. సమయము వచ్చినపుడు కల్కిగా అవతరించును.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సంవసతి భూతాని అస్మిన్ ఇతి సంవత్సరః** – సకలభూతములు భగవానునియందు చక్కగా వసించును.

శ్రీ చిన్మయానంద – 'సంవత్సరము' అనగా (35 రోజుల) కాలప్రమాణము. భగవంతుడు కాలస్వరూపుడు. సకల అనుభవములు, అనుభూతులు జీవులకు కాలపరిధియందే సంభవించును.

92వ నామముగా చెప్పినపుడు వ్రాసిన వివరణ – భక్తులనుద్ధరించుటకై వెలసియున్నవాడు. కాలస్వరూపుడు.

424. దక్షః

- శీఘ్రముగా, వేగముగా ఉండేవాడు.

- ప్రవృద్ధి, శక్తి, శీఘ్రకారి – అనే మూడు గుణములు గలవాడు.

- సమర్థుడు.

ఓం దక్షాయ నమః

45వ శ్లోకము. 424వ నామము. దక్షః – **ఉగ్రః సంవత్సరో దక్షో విశ్రామో విశ్వదక్షిణః**

98వ శ్లోకము. 917వ నామము. దక్షః – **అక్రూరః పేశలో దక్షో దక్షిణః క్షమిణాంవరః**

'దక్ష' అనగా త్వరగా పెరుగుట – అనే ధాతువునుండి ఈ నామమును వివరించారు. ('దక్షిణ' అనే పదము కూడా ఇదే ధాతువునుండి వచ్చినది. యజమాని క్షేమమును పెంపొందించునది దక్షిణ.) దస్యులను, అనగా దుష్టును, కనురెప్పపాటులో సంహరించు కల్కిభగవానుడు దక్షుడు.

శీఘ్రార్థత్వాత్ దక్షధాతోః నిమేషాద్దస్యవో హతాః
యేనసస్యాచ్ఛీఘ్రకారీ దక్ష ఇత్యుచ్యతే బుధైః
శ్రీ వి.వి.రామానుజన్ నమ్మాళ్వార్ రచన(4.8.1)ను ఉదాహరించారు.

ఇదే నామము మరల 917వ నామముగా – **అక్రూరః పేశలో దక్షో దక్షిణః క్షమిణాంవరః** – అని స్తుతింపబడినది. అప్పుడు ఈ నామమును శ్రీ భట్టులు గజేంద్రమోక్షము పరముగా వ్యాఖ్యానించారు. గజేంద్రుని బ్రోచుటకై సిరికింజెప్పక, శంఖచక్రయుగమ్ముం జేదోయి సంధింపక, ఏ పరివారంబును జీరక, అభ్రకబతిం బన్నింపక, ఆకర్ణికాంత ధమ్మిల్లమ్ముం జక్కనొత్తక, వివాదప్రోత్థిత శ్రీకుచోపరి చేలాంచలమైన వీడక, గజప్రాణావనోత్సాహియై రొయ్యన వెడలిన గజరాజవరదుడే దక్షుడు.

శ్రీ చిన్మయానంద – దక్షత, సామర్ధ్యము, ప్రజ్ఞ, ప్రతిభ, ప్రాభవములతో సృష్టి స్థితి లయాది సకల కార్యములను నిర్వహించువాడు దక్షుడు.

శ్రీ శంకరులు – 'దక్షః శబ్దము ద్వారా భగవంతుని మూడు గుణములు కొనియాడబడినవి – **ప్రవృద్ధః శక్తః శీఘ్రకారీ చ దక్షః** – పరమాత్మునకు ఇవి సహజలక్షణములు. ఆయన దక్షుడు.

425. విశ్రామః

- అందరికిని విశ్రమించే స్థానము.

- అందరికిని విశ్రాంతి ఇచ్చేవాడు.

ఓం విశ్రామాయ నమః

శ్రమ అనంతరము లభించే శాంతియే విశ్రామము. **విశ్రామ్యతి యస్మిన్ సర్వమ్ ఇతి విశ్రామః** – సకల జీవులకును అంతమున (జీవితానంతరము, లేదా ప్రళయకాలమున) విశ్రాంతిస్థానము. షడూర్మ్యులతోను (అనగా ఆకలిదప్పులు, శోకమోహములు, జననమరణములతో), తాపత్రయములతోను, అరిషడ్వర్గములతోను బాధలు పొందువారికి శరణాగతియైన భగవంతుడే విశ్రాంతిస్థానము.

విశ్రామయతి సర్వమ్ ఇతి విశ్రామః – అందరికిని విశ్రాంతి కలుగజేయువాడు. పగలు అలసినవారికి రాత్రి, కర్మపీడితులైనవారికి మరణము, ఎండలో మాడువారికి నీడ – ఇలా అన్ని శ్రమలకు విశ్రామమార్గములు కల్పించిన భగవంతుడు విశ్రామః.

భగవంతుని తలచినంతనే కష్టములనుండి తరణోపాయము, దుఃఖమునుండి ఊరట, అలసటనుండి ఆరామము లభించును.

426. విశ్వదక్షిణః

- అందరిపట్ల సమముగా కరుణగలవాడు.
- అశ్వమేధయాగమున విశ్వమును దక్షిణగానొసగువాడు.
- అన్ని విషయములందు నేర్పరి.
- అందరికంటె నేర్పరి.

ఓం విశ్వదక్షిణాయ నమః

పై వివరణలలో మొదటి రెండు అర్థములను శ్రీ భట్టులు, తరువాతి రెండు అర్థములను శ్రీ శంకరులు చెప్పారు.

విశ్వస్మిన్ ఇష్ట అనిష్ట కారిణియా విశేషేన దక్షతే ఇతి విశ్వదక్షిణః – అందరిపట్ల సమముగా దయజూపువాడు. త్రివిక్రముడై తన పాదముతో బలిని మాత్రమే కాక అందరిని పావనము చేసెను. (దాక్షిణ్యము అనగా క్షమాగుణము).

విశ్వమ్ దక్షిణా అస్య ఇతి విశ్వదక్షిణః

యదాశ్వమేధే పృథివీం దక్షిణాత్వేన దత్తవాన్
మహాసురేభ్యః కృత్స్నాం యః స స్మృతో విశ్వదక్షిణః
అశ్వమేధయాగము చేసి సమస్తమును బ్రాహ్మణులకు దక్షిణగానొసగినవాడు.

తతశ్చోరక్షయ కృత్వా ద్విజేభ్యః పృథ్వీమిమాం
వాజిమేఘ మహాయజ్ఞే విధివత్ కల్పయిష్యతి – మహాభారతము. వనపర్వము. 191.1

విశ్వేషు కర్మసు దాక్షిణ్యాత్ విశ్వదక్షిణః – అన్ని పనులందు దక్షిణ (నైపుణ్యము) కలవాడు. సర్వసమర్థుడు. సర్వశక్తి భాండాగారము.

విశ్వస్మాత్ దక్షిణః శక్తః – అందరికంటె ఎక్కువ దక్షిణ (శక్తి, సామర్థ్యములు) గలవాడు. విశ్వములోని సమస్త జీవుల శక్తి, సామర్ధ్యము, నైపుణ్యము, జ్ఞానము – అన్నియును భగవంతుని దక్షిణకు ప్రతిబింబములే. ఎందుకంటే అన్ని విధములైన శక్తిసామర్థ్యములు భగవంతునినుండియే కలుగుచున్నవి. కనుక భగవానుడు విశ్వదక్షిణుడు అని శ్రీ చిన్మయానంద వివరించారు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

విస్తారః స్థావరస్థాణుః ప్రమాణం బీజమవ్యయం |
అర్థోఽనర్థో మహాకోశో మహాభోగో మహాధనః || (46)

427. విస్తారః

- (వేదములను) విస్తరింపజేయువాడు.
- అన్నింటియందు విస్తరించియున్నవాడు.
- అన్నింటిని తనయందు ఉంచుకొనుటకు (ప్రళయకాలమున) విస్తరించువాడు.

ఓం విస్తారాయ నమః

ప్రబలం యః కలి హత్వా ప్రవర్త్య చ కృతం యుగం
విస్తార్య వేద మర్యాదాం స్థితో విస్తార ఉచ్యతే
కలిపురుషుని హతముచేసి, మరల కృతయుగమును ప్రర్తింపజేసి, వేదసమ్మతమగు మర్యాదలను అన్నింటినీ విస్తరింపజేయు కల్కిభగవానుడు విస్తారుడు – అని ఈ నామమును వ్యాఖ్యానిస్తూ శ్రీభట్టులు చెప్పిన ప్రమాణము –

తతోఽధర్మ వినాశోవై ధర్మవృద్ధిశ్చ భారత
భవిష్యతి కృతే ప్రాప్తే క్రియావాంశ్చ జానస్తథా – మహాభారతము. వనపర్వము 191.7
కృతయుగము రాగానే అధర్మము పూర్తిగా నాశనమై ధర్మము అభివృద్ధి జరుగుతుంది. మానవులు సత్కార్యములాచరించెదరు.

శ్రీ వి.వి. రామానుజన్ నమ్మాళ్వారు రచన (తిరువైమోళి 5.2.1.2)నుండి ఉదాహరించారు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – భగవంతుడు నానావిధ జీవవస్తురూపమున విశ్వమంతటా వ్యాపించియున్నాడు. ప్రళయకాలమున ఆయన విస్తరించి అన్నింటినీ తనలో లయము చేసుకొనును. కనుక 'విస్తారః' నామము

రెండు విధములుగా వర్ణించును (1) అన్నింటిలోపల వ్యాపించియున్నవాడు (2) అన్నింటిని తనలో ఇముడ్చుకొనుటకు వ్యాపించినవాడు. ఒక విత్తనములో చెట్టు ఇమిడియుండును. చెట్టులో విత్తనముండును. యజుర్వేదములో ఈ భావము ఇలా రెండుచోట్ల చెప్పబడినది. (1) **తదన్తరస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యతః** (2) **ఈశావాస్యమిదం సర్వం యత్కించ జగత్యామ్ జగత్.**

ధర్మచక్రము రచయిత – శ్రీకృష్ణుడు అర్జునునకు అనుగ్రహించిన విశ్వరూపము 'విస్తారః'. అది ఆదిమధ్యాంత రహితము. అనంత నేత్ర ముఖ బాహు సంయుతము. శశిసూర్య నయన ప్రకాశవంతము. విస్తరించుటయే జీవితము అని స్వామి వివేకానంద అన్నారు. మనము భగవంతునిపై భక్తిని, ప్రేమను పెంచుకొన్నయెడల ఆయనకు దగ్గర కాగలము.

428. స్థావరస్థాణుః

- కృతయుగ ధర్మమును పునఃస్థాపించి, విశ్రమించువాడు.
- స్థావరములైన (చలనము లేని) భూమివంటివి ఆయనయందు ఉండును.
- చలనము లేనివాడు. ఆయనయందు భూమివంటివి ఉండును.

ఓం స్థావరస్థాణవే నమః

ఇంతకుముందు చెప్పిన కొన్ని నామముల అర్థములను గుర్తు చేసుకొందాము.

28వ నామము. **స్థాణుః** – (4వ శ్లోకము) **సర్వః శర్వః శివః స్థాణుః భూతాదిః నిధిరవ్యయః** – స్థిరమైనవాడు. నిశ్చయముగ ఇష్టకామ్యములను సిద్ధింపజేయువాడు. వృద్ధి, క్షయ గుణములకు లోబడనివాడు.

121వ నామము. **శాశ్వతస్థాణుః** – (13వ శ్లోకము) **అమృతః శాశ్వతస్థాణుః వరారోహో మహాతపాః** – కాలముతో నిమిత్తము లేకుండ, నిశ్చలముగా, నిత్యమై, సత్యమై, నిరంతరమైనవాడు. ఆదిమధ్యాంత రహిత పరబ్రహ్మము.

ఇప్పటి 428వ నామము. **స్థావరస్థాణుః** – (46వ శ్లోకము) **విస్తారః స్థావరస్థాణుః ప్రమాణం బీజమవ్యయమ్**

శ్రీ భట్టుల వ్యాఖ్య – కలియుగాంతమున దుష్టులను నాశనము చేసి, కృతయుగ ధర్మమును పునరుద్ధరించి, ఆపై శమించి, కదలకుండా ఉండువాడు స్థావరస్థాణువు.

స్థావరీకృత్య ధర్మాన్యః శమే స్థాస్యతి నిత్యశః
యేనకేనాప్యచాల్యస్థః స్థావరస్థాణురుచ్యతే

శ్రీ శంకరుల వ్యాఖ్య – **స్థితి శీలః స్థావరః, స్థితిశీలాని పృథివ్యాదీని తిష్ఠంతి అస్మిన్ ఇతి స్థాణుః, స్థావరశ్చ అసౌ స్థాణుశ్చ స్థావరస్థాణుః** – కదలకుండే ఉండే లక్షణమున్నది స్థావరము. అటువంటివి ఎవరియందు ఉండునో ఆయన స్థాణువు. స్థావరము కూడాను, స్థాణువుకూడాను అయినందున స్థావరస్థాణువు. శ్రీ శంకరులు చెప్పిన ఈ వ్యాఖ్యకు రెండు విధాలైన వివరణలు లభిస్తున్నాయి (1) కదలిక లేని భూమివంటివి భగవంతుని యందు స్థిరముగా ఉన్నాయి (2) కదలిక లేనట్లు అనిపించే భూమివంటివి భగవంతునియందు ఉన్నాయి. కదలిక లేనివాడు, మిగిలినవానికి ఆధారమైనవాడు కూడా ఆయనే.

శ్రీ చిన్మయానంద వివరణ – భగవంతుడు స్థిరమైనవాడు (స్థావరః). భగవంతుడు నిశ్చలుడు (స్థావరః) అంతటా ఉన్నవాడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – ప్రళయకాలమువరకు ఉండే పంచభూతములు స్థావరములు. తన స్థితియందు మార్పు లేనిది స్థాణువు. మారని స్థితి గలవాడు, స్థావరములైన పంచభూతములకు నిలయమైనవాడు స్థావరస్థాణువు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – ప్రజలు మార్గములో నడచి గమ్యము చేరుకొందురు. కాని మార్గము మాత్రము స్థిరముగానుండును. గర్భిణీ స్త్రీ నడచినపుడు గర్భములోని బిడ్డ నడవడంలేదు. భగవంతుడు అంతటినీ సృష్టించాడు గాని ఆయనమాత్రము స్థావరుడు.

429. ప్రమాణమ్

సకల ధర్మమునకు, జ్ఞానమునకు, శాస్త్రమునకు మౌలికమైన ఋజువు.

ఓం ప్రమాణాయ నమః

ఈ నామము మరల 959వ నామముగా వచ్చును.

46వ శ్లోకము. 429వ నామము. ప్రమాణమ్ – **విస్తారః స్థావరస్థాణుః ప్రమాణం బీజమవ్యయం**

103వ శ్లోకము. 959వ నామము. ప్రమాణమ్ – **ప్రమాణం ప్రాణనిలయః ప్రాణభృత్ ప్రాణజీవనః**

'మానము' అనగా కొలుచునది. ప్రమాణము అనగా అన్ని లెక్కలకు మూలము. అన్ని విషయములకు మౌలికాధారము. అధికారిక జ్ఞానము. ఎందువలనంటే సకల ధర్మములకు, శాస్త్రములకు, జ్ఞాన విజ్ఞానములకు నారాయణుడే సృష్టికర్త, ప్రమాణము.

యోగో జ్ఞానం తథా సాంఖ్యం విద్యాః శిల్పాది కర్మ చ

వేదాః శాస్త్రాణి విజ్ఞానమేతత్ సర్వమ్ జనార్ధనాత్ – అని ఈ స్తోత్రము ఉత్తర పీఠికలో చెప్పబడినది.

హితాహిత స్థాపకత్వాత్ ప్రమాణమ్ స్యాత్కృతాదిషు – కృతయుగంలో ఉన్న జీవులకు మంచిచెడులు తెలియజేసి స్థిరమైన ఏర్పాట్లు చేసినవాడు. స్థిరమైన ప్రమాణాలు ఏర్పరచినవాడు.

ప్రమీయతే అనేనేతి ప్రమాణమ్ – హితము చెప్పి ప్రమాణమునేర్పరచువాడు.

తచ్ఛీల మనువర్తంతే మనుష్యాః లోకవాసినః – లోకంలో నివసించేవారంతా ఆ పరమేశ్వరుని శీలాన్నే ఉత్తమమైనదిగా అనుసరిస్తారు.

430. బీజమవ్యయమ్

- నశించని బీజము.
- తాను మారకుండానే అన్నింటికి జన్మనిచ్చువాడు.
- మరల మరల (యగాంతములందు) ధర్మస్థాపన చేయువాడు.

ఓం అవ్యయాయ బీజాయ నమః

ఓం బీజాయ అవ్యయాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – ప్రతి యుగాంతమున ధర్మము మరల మరల ప్రవర్ధిల్లుటకు కారణమైనవాడు గనుక ఆయన అవ్యయ బీజము.

యో వై కలియుగస్యాంతే ముహుర్ధర్మ ప్రరోహణమ్
కరోతి భక్త రక్షార్థాం నోచ్యతే బీజమవ్యయమ్

శ్రీ శంకరుల వ్యాఖ్య – తాను మారకుండానే అన్నింటికీ కారణమైనవాడు. అనగా ఒక చెట్టు మొలకెత్తినపుడు ఆ బీజము అంతటితో వ్యయమగును (ఖర్చై పోవును). కాని పరమాత్ముడు తాను అవ్యయుడై మరల మరల సృష్టి కావించును. **అన్యథా భావవ్యతిః ఏకేన కారణమ్**

ధర్మచక్రము రచయిత ఇదే వ్యాఖ్యను కొంచెం వైవిధ్యంగా వివరించారు. కొన్ని బీజాలు అసలు మొలకెత్తకుండా బీజాలుగానే ఉండి నశించిపోతాయి. కాని భగవంతుడు అలా వ్యయముకాని బీజము.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి గీత (9.18)నుండి ఉదాహరించారు –

గతిర్భర్తా ప్రభుః సాక్షీ నివాస శరణం సుహృత్
ప్రభవః ప్రలయః స్థానం నిధానం బీజమవ్యయమ్

పరమగతియైన పరంధామమును, జగత్తును భరించి పోషించువాడను నేనే. అందరికిని స్వామిని, అందరి శుభాశుభములను చూచువాడను నేనే. అందరికిని నివాస స్థానమును, శరణు పొందదగినవాడను నేనే.

ప్రత్యుపకారమును ఆశింపక హితమొనర్చువాడను, అందరి ఉత్పత్తి, ప్రళయములకు హేతువును, వారి స్థితికి ఆధారమును, నిధానమును, శాశ్వత కారణమును నేనే.

ఈ గీతా శ్లోకమునకు భగవద్రామానుజుల భాష్యము – **తత్ర తత్ర వ్యయరహితమ్ యత్కారణమ్ తదహమ్ ఏవ** – నేను మాత్రమే అంతటా శాశ్వత మూలకారణములకు తరుగులేని బీజమును.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **అజాయమానో బహుదా విజాయతే** – అనే వేదోక్తి ఇదే భావమును తెలుపుచున్నది.
ఇంకా వ్యాకరణసూక్తి ‘అవ్యయ’ పదమునకు ఇలా చెప్పుచున్నది –
సదృశమ్ త్రిషు లింగేషు సర్వాసు చ విభక్తిషు
వచనేషు చ సర్వేషు యన్నవ్యేతి తద్ అవ్యయమ్
అనగా, మూడు లింగపదాలలోను, ఏక బహు వచన పదాలలోనూ, విభక్తి రూపాలలోనూ కూడా సమానమైన భావము, రూపము కలిగినది. వేరుగా చూడలేనిది. అది అవ్యయము.

431. అర్థః

- కోరబడువానిలో ఉత్తమమైనవాడు (అర్థింపబడువాడు).
- సచ్చిదానంద స్వరూపుడైనందున అందరు ఆయనను కోరుకొందురు.

ఓం అర్థాయ నమః

అర్థమనగా అర్థింపబడునది.
పరమై కాంతిభిర్నిత్యం ఈషణత్రయ వర్జితైః
స్వయం ప్రయోజనతయా యాద్యమానోఽర్థ ఉచ్యతే.
ఈషణత్రయమును (ధనేషణ, దారేషణ, పుత్రేషణ) వదలి, తననే ఆరాధించు భక్తులచే, తానే పురుషార్థముగా భావించబడువాడు. శ్రీ భట్టులు భగవద్గీత (7.19)నుండి ఉదాహరించారు.
బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే
వాసుదేవస్సర్వమితి స మహాత్మా సుదుర్లభః
అనేక జన్మల తరువాత జ్ఞానియైనవాడు సర్వము పరమేశ్వరమయము అని భావించి నన్ను శరణు పొందుతాడు.

శ్రీ శంకరుల భాష్యము – **సుఖరూపత్వాత్ సర్వైః అర్థ్యత ఇతి అర్థః** – భగవంతుడు ఆనందమూర్తి. కనుక అందరు ఆయనను కోరుకొంటారు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – ప్రపంచములో ప్రజలు కోరుకొనే ఎన్నో విషయములు తుదకు దుఃఖమును కలిగించును. కాని భగవంతుడే పరిపూర్ణ ఆనందస్వరూపుడనీ, ఆయననే కోరుకొనదగుననీ జ్ఞానులెరుగుదురు.

432. అనర్థః

- అల్పభాగ్యులు (శాశ్వతమైన ఆనందము కోరనివారు) ఎవరిని అర్థించరో అతడు.
- అన్ని కోరికలు నెరవేరినవాడు. పొందవలసిన కోరికలు లేనివాడు. పూర్ణుడు, పూర్ణకాముడు, పరిపూర్ణుడు.

ఓం అనర్థాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – తగినంత వివేకము లేనివారు అశాశ్వతమైన అర్థకామములవెంట వెంపర్లాడుతారు. కనుక వారు పరంధాముని (సరిగా) అర్థించరు. భోగకాములకు భగవంతుడు అనర్థుడు.

అర్థార్థినాऽల్పభాగ్యేన నిర్వ్యాజం నార్థ్యతేయతః
తస్మాదనర్థనా మాసౌ వేదవిద్భిః ప్రకీర్తితః

శ్రీ శంకరుల వ్యాఖ్య – భగవానుడు పొందవలసినవేవీ లేవు. ఆయన పూర్ణకాముడు. ఆయనే అందరికి కొండలంత వరములు గూపెడు కోనేటిరాయడు. సిరిగలవాడు. అనర్థుడు.

ధర్మచక్రము రచయిత వివరణ – సదుపాయములు పెరిగినకొలదీ ఆధునికుల జీవితములు సంక్లిష్టములై దుఃఖములకు దారి తీయుచున్నవి. జనుల కోరికలునానాటికి అధికములై శాంతి దూరమగుచున్నది. కోరికలను అదుపులో పెట్టుకొని సాగించే జీవనవిధానమే శ్రీదేవుని ధ్యానించు అకాశమును కలిగించి శాశ్వతమైన సౌఖ్యమునకు సోపానమగును.

433. మహాకోశః

- గొప్ప నిధి (ధనాగారము) కలవాడు. ఎన్నటికీ తరగని శంఖపద్మ నిధులు గలవాడు.
- గొప్ప నిధి. తరగని పెన్నిధి.
- ఐదు కోశములు ఆవరణములుగా గలవాడు.

ఓం మహాకోశాయ నమః

మహాంత కోశా యస్య సః మహాకోశః. కోశము అనగా నిధి. మహాకోశము అనగా తరుగులేని పెద్ద నిధి. ఎవరికెంత భాగ్యమునిచ్చినా ఆయన సంపద తరగదు. చిత్ర విచిత్రములైన గ్రహనక్షత్ర జీవ చరాచర జాలమును, బ్రహ్మాండములను సృష్టించినా ఆయన తరిగిపోడు. కనుక ఆయన మహాకోశము.

శంఖపద్మాది నిధయః మహాంతో రోహణో గిరిః
కోశభాండ గృహా యస్య మహాకోశస్స ఉచ్యతే

శ్రీ శంకరులు కోశము అనగా 'ఆవరణ' (చుట్టూ ఉండే వలయము, లేదా కవచము) అనే అర్థంలో వ్యాఖ్యానించారు. శరీరంలో ఉండే కోశములు ఐదు.

(1) అన్నమయ కోశము – ఇంద్రియములను నియంత్రించి యోగులు దీనిని దాటవచ్చును.

(2) ప్రాణమయ కోశము – శ్వాసను నియంత్రించి దీనిని దాటవచ్చును.

(3) మనోమయ కోశము – మనస్సును నియంత్రించి దీనిని దాటవచ్చును.

(4) విజ్ఞానమయ కోశము – జ్ఞానమును నియంత్రించి దీనిని దాటవచ్చును.

(5) ఆనందమయ కోశము – ఆత్మను నియంత్రించి దీనిని దాటవచ్చును.

ఇలా సాధన ద్వారా యోగులు వివిధ కోశములను అధిగమించవచ్చును. ఈ పంచకోశములు ఆవరణగా ఉన్నవాడు నారాయణుడు.

పరబ్రహ్మోపాసన క్రమంగా జరగాలి. అన్నాన్ని ఎన్నడూ నిందించరాదు. ప్రాణము, మనస్సు అన్నీ అన్నంపైనే ఆధారపడి ఉన్నాయి. అన్నాన్ని నిర్లక్ష్యం చేయకుండా, జీవించడానికి సరిపడా నియమం ప్రకారం తినాలి. అన్నాన్ని పూజిస్తే తరువాతివన్నీ లభిస్తాయి. అందుకని ఆహారాన్ని వదలకుండా, ప్రాణాన్ని నిలుపుకుంటూ, మనస్సును వికసింపజేసుకొని, విజ్ఞానానుభవంనుండి బ్రహ్మానందం పొందాలి. (తైత్తరీయోపనిషత్తులో వరుణమహర్షి తన కుమారుడు భృగుమహర్షికి ఉపదేశించాడు.)

434. మహాభోగః

- సుఖమునొసగు మహాభోగములు గలవాడు.
- తన్నాశ్రయించిన భక్తులందరికిని సుఖ భోగ ఆనంద శాంతులను సమకూర్చువాడు.

ఓం మహాభోగాయ నమః

మహాన్ భోగః యస్మాత్ స మహాభోగః – ధనముతో సాధింపదగిన మహత్తరమైన కామభోగములు ఆ శ్రీనివాసునివల్లనే లభించును గనుక ఆయన మహాభోగుడు అని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

అర్థసాధ్యః కామభోగో యస్మాదేషాం మహానిత్తి
మహాభోగ స్స విజ్ఞేయా హ్యష్టార్థః చింతితార్థదః

ధనముతో సాధింపదగిన మహత్తరమైన కామభోగాలు తనవల్లనే లభిస్తున్నట్లుగా ఉండేవాడు. ఈ నామాన్ని 'ఓం మహాభోగాయ నమః' అనే అష్టాక్షరీ మంత్రంగా జపం చేస్తే కోరిన ధనం లభిస్తుంది.

స తయా శ్రద్ధయా యుక్తః తస్యారాధనమోహతే
లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్హితాన్ – గీత 7.22

అటువంటి కోరికలుగల భక్తుడు భక్తిశ్రద్ధలతో ఆ దేవతనే ఆరాధిస్తాడు. తత్ఫలితముగా నా అనుగ్రహము వల్లనే ఆ దేవత ద్వారా తాను కోరిన భోగములు పొందుతాడు.

మహాన్ భోగాన్ నందరూపః అస్య ఇతి – ఆనందరూపమయిన గొప్ప భోగము ఇతడికి ఉన్నది. సచ్చిదానంద స్వరూపుడు గనుక పరమేశ్వరుడు 'మహాభోగః' అనబడుచున్నాడు. తనను ఆశ్రయించినవారికి అన్నిరకాల భోగాలను ఇచ్చేవాడు. అందుచేత శ్రీమన్నారాయణుడు మహాభోగి.

శ్రీ వి.వి. రామానుజన్ శ్రీ నమ్మాళ్వార్ రచన (310.3)నుండి ప్రస్తావించారు. భగవంతుడు అంతు, హద్దు లేని భోగములు కలిగియున్నాడు (**ముత్తు ఇల్ పాల్ భోగత్తొరు తనినాయకన్**).

ధర్మచక్రము రచయిత – కొన్ని ఆనందములు కోరుకొనదగిన ఫలితములనిచ్చును. కొన్ని దుఃఖహేతువులగును. ఆకలి తీర్చుకొనునంత తిన్నవానికి అనారోగ్యములేదు. రుచికొరకు తినేవాడికి ఇబ్బందులు కలుగును. జూదము, మద్యపానము, ధనాపహరణ వంటివి దుఃఖములకు దారితీయును. భగవంతుడు ఆత్మజ్ఞానమునకు, శాశ్వత సచ్చిదానందమునకు, అత్యుత్తమములైన సౌఖ్యములకు ఆలవాలము. కనుక ఆయన మహాభోగి.

435. మహాధనః

అపారమగు సిరిగలవాడు. తన భక్తులకు ధన కనక వస్తు వాహన విశేషములన్నియును వర్షింపజేయును.

ఓం మహాధనాయ నమః

అనిరూప్యాతి కృపణ ప్రదేయం ధనమక్షయం
యస్యైవాస్తీతి సతతం స మహాధన ఈరితః

అమితమైన ధనముగలవాడు మహాధనుడు. **మహత్ ధనం యస్య సః మహాధనః** – అతి పిసినారికి గాని, పరమ దరిద్రునకు గాని ఎంత ఇచ్చినా తరగని ధనముగలవాడు మహాధనుడు. శ్రీ భట్టులు తమ వ్యాఖ్యలో విష్ణుపురాణము (1.8.23) నుండి ప్రమాణము చెప్పారు –

మరీచి మిశ్రైః దక్షేణ తథైవ అన్యాయైః అనంతతః
ధర్మః ప్రాప్తః తథాచ అన్యైః అర్థ కామ తథా పరైః

మరీచి, దక్షుడు వంటివారు ఆ పరమేశ్వరునినుండి ధర్మము అమితంగా పొందారు. అలాగే కొందరు సంపదలను, కొందరు కామములను పొందారు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవంతుడు 'మహాధనము' కలిగియున్నాడు (435వ నామము). అది 'మహాకోశము'లో నున్నది (433వ నామము). అది 'మహాభోగము'ను ప్రసాదించును (434వ నామము).

ధర్మచక్రము రచయిత – ప్రాపంచిక ధనము, జ్ఞానము, భక్తి అనేవి మూడు ధనములు. వీటిలో ధనము, జ్ఞానము లభించినవారు జనులనుండి ప్రశంసలు పొంది, తద్వారా గర్వాంధులవుతారు. కాని భక్తి అనే సంపద కలిగినవానికి భగవంతుని ప్రశంస మాత్రము లభిస్తుంది. ఆసంపదవల్ల కలిగే సచ్చిదానంద శాశ్వత వైభోగము భగవంతుడే.

పట్టాభిషేక సమయమున శ్రీరాముడు అందరికిని విలువైన కానుకలిచ్చెను. కాని హనుమంతునకు ఏమీ ఇచ్చినట్లు కనిపించలేదు. సీతమ్మ తల్లి అందుకు కారణమడుగగా శ్రీరాముడు తాను హనుమంతునకిచ్చినది వేరెవరికిని తెలియదని, హనుమంతునే అడిగి తెలుసుకొనమని చెప్పెను. సీతమ్మతల్లి ఆ విషయం అడుగగా అంజనీసుతుడు తన హృదయంలో నెలకొనియున్న సీతారాములను చూపెను. ఇదే మహాధనము. తనను నమ్ముకొన్నవారికి శ్రీ మహావిష్ణువు స్వయముగా తననే ప్రసాదించును. కనుక ఆయనే మహాధనము.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – అందరూ కోరుకొనే తరగని, నశించని, కొలువరాని పరమానందమనే మహాధనము గనుక ఆయన మహాధనుడు.

(శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి) **అర్థార్థీ చార్థమాప్నుయాత్ కామానవాప్నుయాత్ కామీ** – ధనము కోరువారికి ధనమును, కోరికలు గలవానికి కోరినవియును వర్షించునని ఈ స్తవరాజము ఉత్తరపీఠికలో తెలుపబడియున్నది. అర్థః, అనర్థః, మహాకోశః, మహాభోగః, మహాధనః అను నామములు భగవానుని ధనసమృద్ధిని సూచించుచున్నవి. కనుక భక్తులు చాలమంది ఈ నామములను జపించుచు సకల దారిద్ర్యములనుండియు విముక్తిని పొందుచున్నారు.

జై శ్రీ హనుమాన్ (1910 కాలంనాటి రవివర్మ ప్రెస్ చిత్రం -వికీపీడియా నుండి)

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

అనిర్విణ్ణః స్థవిష్ఠోభూర్ధర్మయూపో మహామఖః |
నక్షత్రనేమిర్నక్షత్రీ క్షమః క్షామః సమీహనః || (47)

436. అనిర్విణ్ణః

- విరామము, నిరాశ, నిర్వేదము లేకుండా సృష్టికార్యము సాధించువాడు.
- కోరికలు లేనివాడు, పరిపూర్ణుడు కనుక నిరాశ చెందనివాడు.

ఓం అనిర్విణ్ణాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

47వ శ్లోకము. 436వ నామము. అనిర్విణ్ణః – **అనిర్విణ్ణః స్థవిష్ఠోభూర్ధర్మయూపో మహామఖః**

95వ శ్లోకము. 893వ నామము. అనిర్విణ్ణః – **అనిర్విణ్ణః సదామర్షీ లోకాధిష్ఠానమద్భుతః**

శ్రీ భట్టుల వ్యాఖ్య – జనులు సంసారబద్ధులై, లౌకికవాంఛాప్రీతిపరులై, పరమేశ్వరుని అలక్ష్యం చేసినాగాని విసుగు చెందక మరల మరల సృష్టికార్యం కొనసాగించువాడు అనిర్విణ్ణుడు. **అనిర్విణ్ణో జాగరూకో జగద్వ్యాపార సంతతౌ.**

శ్రీ వి.వి.రామానుజన్ నమ్మాళ్వారు పెరియతిరువంతాది (18)నుండి ఉదాహరించారు. **నోంబాదు ఇప్పల్లురువాయ్ ఎల్లామ్ పడర్ విత్తవిత్తా.**

శ్రీ శంకరుల వ్యాఖ్య – భగవంతుడు పరిపూర్ణుడు. పూర్ణకాముడు. ఆయనకు కావలసినదేదీ లేదు. కనుక ఆయన నిర్విణ్ణ భావము చెందనివాడు.

ధర్మచక్రము రచయిత వివరణ – సత్వభావముతో కర్మలు చేసేవారికి నిరాశ, నిస్పృహ భావములు కలుగవు. రజస్తమోభావములతో ఆచరించే కర్మలు నిరాశకు, నిస్పృహకు దారి తీస్తాయి.

437. స్థవిష్ఠః

- విరాట్ రూపముతో సర్వమయుడై యున్నవాడు. బ్రహ్మాండమును తనలో ఇముడ్చుకొన్న బృహద్రూపి.
- నక్షత్రమండలమున శింశుమార రూపియై ప్రకాశించువాడు.

ఓం స్థవిష్ఠాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

6వ శ్లోకము. 53వ నామము. స్థవిష్ఠః – **విశ్వకర్మా మనుస్త్వష్టా స్థవిష్ఠః స్థవిరో ధ్రువః**

47వ శ్లోకము. 437వ నామము.స్థవిష్ఠః – **అనిర్విణ్ణః స్థవిష్ఠో భూర్ధర్మయూపో మహామఖః**

'స్థూల' అనగా పెద్ద – అనే పదము ఆధారంగా 'స్థవిష్ఠః' నామమును వివరించారు. **స్థౌల్యాత్ స్థవిష్ఠః.**

విష్ణుపురాణము (2.9.1)లోని శింశుమార చక్రము వర్ణన ఆధారంగా శ్రీ భట్టులు ఈ నామమును వివరించారు.

శింశుమారాకృతితయా తారారూపేణ సర్వదా

స్థౌల్యాత్ స్థవిష్ఠ సంప్రోక్తః సప్తార్ణః పాపనాశనః

నక్షత్రమండలమునందు శింశుమార చక్రము రూపముననున్నవాడు. స్థూలమైనందున స్థవిష్ఠుడనబడును. ఈ నామము సప్తాక్షరీ మంత్రము. సర్వపాపహరము. ఓం స్థవిష్ఠాయ నమః. (శ్రీకైవల్య సారధి).

శ్రీ శంకరాచార్యులు ముండకోపనిషత్తు (2.1.4)నుండి ప్రమాణము చెప్పారు. **అగ్నిర్మూర్ధా చక్షుషీ చంద్రసూర్యౌ** – ఈ పరబ్రహ్మకు అగ్ని శిరస్సు. సూర్యచంద్రులు నేత్రాలు. దిక్కులే చెవులు. వేదాలు వాక్కు. వాయువు ప్రాణం. జగత్తే అతని హృదయం. అతని పాదాలనుండి భూమి పుట్టింది. అతడే సమస్త భూతాలలోను ఉండే అంతరాత్మ.

అతిశయేన స్థూలః – మిక్కిలి లావైనవాడు. విరాడ్రూపంతో స్థూలప్రపంచాభిమానిగా (వైశ్వానరుడై) ఉన్నాడు.

అనేకబాహూదర వక్త్రనేత్రం పశ్యామి త్వాం సర్వతోఽనంతరూపమ్

నాంతం న మధ్యం న పునస్తవాదిం పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప – భగవద్గీత 11.16

ఓ విశ్వేశ్వరా! విశ్వరూపా! నీ బాహువులు, ఉదరములు, నేత్రములు అసంఖ్యాకములు. అనంతమైన నీ రూపము సర్వతోముఖముగా వర్ధిల్లుతున్నది. నీవు ఆద్యంతరహితుడవు. నీ దివ్యరూపానికి ఆది, మధ్య, అంతము లేదు.

శ్రీ మద్భాగవతంలో 2.1.24 నుండి 2.1.38 శ్లోకములలో భగవంతుని విరాడ్రూపము వర్ణన ఉన్నది.

తైత్తరీయారణ్యకము (2.19)లో భగవంతుని శింశుమార స్వరూపమును వర్ణించారు.

తస్మై సమస్తచ్ఛిరో ధర్మో మూర్ధానమ్ బ్రహ్మోత్తరా విష్ణు హృదయమ్ .....

స వా ఏష దివ్యః సాక్వరః శింశుమారః

<u>విష్ణుపురాణంలో శింశుమారరూప వర్ణన –</u>

తారామయం భగవతశ్శింశుమారకృతి ప్రభో
దివిరూపం హరేర్యత్తు తస్య పుచ్ఛేస్థితో ధ్రువః
నైషభ్రమన్ భ్రామయతి చంద్రాదిత్యాదికాన్ గ్రహాన్
భ్రమస్తమతు తం యాన్తి నక్షత్రాణి చ చక్రవత్
సూర్యచంద్రమసౌ తారా నక్షత్రాణి గ్రహైస్సహ
వాతానీకమయై బంధైర్ధ్రువే వే బద్ధాని తానివె
శింశుమారాకృతి ప్రోక్తం యద్రూపం జ్యోతిషాన్దివి
నారాయణోఽయనం ధామ్నాం తస్యాధార స్స్వయం హృది ......
తదాధారం జగచ్చేదం స దేవాసుర మానుషమ్ ....
ఆకాశ గంగా సలిలం తథాఽఽదాయ గభస్తిమాన్
అన భ్ర గతమే వోర్వ్యాం సద్యః క్షిపతి రశ్మిభిః ......
ఉభయం పుణ్యమత్యర్థనం నృణాం పాపహరం ద్విజ
ఆకాశగంగా సలిలం దివ్యం స్నానం మహామునే ....
ఆధారభూత స్సవితు ధ్రువ్ వో మునివరోత్తమ
ధ్రువస్య శింశుమారోసౌ నోపి నారాయణాశ్రయః
హృది నారాయణస్తస్య శింశుమారస్య సంస్థితః
తద్భృతాన్ సవన్ భూతానామాది భూతస్సనాతనః

భగవానుడైన విష్ణువు నక్షత్రమయమై 'శింశుమార' స్వరూపమున వెలుగుచున్నాడు. దాని తోకయందు ధ్రువుడున్నాడు. ఆ శింశుమారాకృతియే చంద్రసూర్యాది గ్రహములను గిఱ్ఱున త్రిప్పుచున్నది. అట్లు తిరుగుచున్న దానివెంట నక్షత్రములు చక్రములవలె తిరుగుచున్నవి. సూర్యచంద్రులు, తారా నక్షత్రములు, గ్రహములతో కూడ వాయుమయమైన గట్టిత్రాళ్ళతో (సప్తవాయువులచే) ధ్రువునియందు కట్టబడియున్నది.

జ్యోతిస్స్వరూపమైన యీ శింశుమారాకారముయొక్క హృదయమునందు తారాస్వరూపమున నారాయణుడే స్వయముగా దానికాధారమైయున్నాడు. తారామయమైన శింశుమారముయొక్క తోకయందు, జగత్పతియైన ఆ నారాయణు నారాధించుచు ఉత్థానపాదుని కుమారుడగు ధ్రువుడున్నాడు.

సర్వాధ్యక్షుడైన జనార్దనుడు శింశుమారమునకు, శింశుమారము ధ్రువునకు, ధ్రువుడు సూర్యునకు ఆధారముగానున్నారు. ఆ సూర్యుడు దేవాసుర మనుష్యులతోకూడి ఈ జగత్తునకాధారముగా నున్నాడు.

ఆకాశగంగయందలి నీటిని సూర్యుడు గ్రహించి, దానిని తన కిరణములచేతనే భూమిపై వర్షించుచున్నాడు. దాని స్పర్శచే మానవుడు పాపముల బాసి పుణ్యలోకములకు పోవును. దానికే దివ్యస్నానమని పేరు. సూర్యుడు కనపడుచుండగనే మేఘముల మూలమున కాక సూర్యుని కిరణముల చేత ఆకాశగంగాజలము కృత్తికానక్షత్రము మొదలుకొనియున్నవానిలో బేసి నక్షత్రములయందు ఆకాశమునుండి వర్షింపబడు ఆ జలము దిగ్గజములచే వర్షింపబడు గంగోదకమని పేరు గాంచినది. సరి నక్షత్రములయందు, అనగా రోహిణి, ఆర్ద్ర మొదలగు వానియందున్న సూర్యుని కిరణములచే ఆకర్షింపబడి వర్షింపబడు ఆకాశగంగాజలము కూడ చాలా పుణ్యమైనది. పాపహరము. పుణ్యస్నానము వాడుక దీనికే. మేఘములచే వర్షింపబడు నీరు ఓషధులను పెంచును. అది జీవనాధారముగను అమృతమని పేరొందినది.

యజ్ఞములు, వేదములు, వర్ణములు, సర్వదేవతలు, పశువులు, భూతములు మొదలగునవియెల్ల వర్షముచే నిలుచుచున్నవి. అన్నము వృష్టి (వర్షము)చే నేర్పడుచున్నవి. ఆ వృష్టికాధారము సూర్యుడు సూర్యుడు. అతనికాధారము ధ్రువుడు. ధ్రువునికాధారము నారాయణుడు. దానిహృదయమందే ఆ నారాయణమూర్తి యున్నాడు. సర్వభూతములకు అతడే మొదలయి, సనాతనుడయి ఉన్నాడు. ఈ విధముగా నక్షత్రమండలంలో ప్రకాశిస్తున్న శ్రీమన్నారాయణుడు 'స్థవిష్ఠః' అనబడుతున్నాడు.
(ఈ నామ వివరణలో అధికభాగం డా. క్రోవి పార్థసారథి రచన 'శ్రీకైవల్యసారథి'నుండి తీసుకొనబడినది)

438. భూః

అభూః

- మరే ఆధారము లేకుండా ఉండేవాడు గనుక నిజమైన ఉనికిగలవాడు భగవంతుడు మాత్రమే.
- శింశుమార చక్రమునకు ఆధారమైన ధ్రువుడు.
- జన్మము లేనివాడు.

ఓం భువే నమః

ఓం అభువే నమః

ఈ నామమును శ్రీ భట్టులు 'భూః' అని చెప్పారు. శ్రీ శంకరులు 'అభూః' అని పరిగణించారుగాని, 'భూః' అనే నామాంతరాన్నికూడా పేర్కొన్నారు.

భూః – 'భూవ్'నుండి – ఉనికి కలిగియుండుట. మిగిలినవన్నీ మరొక ఆధారముపై నియమితకాలంలో ఉంటాయి. కాని శ్రీనాధుడు వేరే ఆధారములేని నిజమైన ఉనికిగలవాడు.

శింశుమార చక్రమునకు తోక స్థానములో ధ్రువుడు ఆధారము. శ్రీవాసుదేవ సేవాపరాయణుడైన ధ్రువుడు భగవంతుని అంశయే. అలా భగవంతుడు శింశుమార చక్రమునకు ఆధారము – అని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

ఔత్తానపాది సంబంధాత్ సర్వాధారతయా తథా
భవతీతి చ భూః ప్రోక్తః భక్తానాం భూతిదో మనుః
ఈ నామజపము భక్తులకు ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తుంది. ఓం భువే నమః. (శ్రీకైవల్య సారధి).

శ్రీ రామానుజన్ తిరువైమొళి (5.6.5), తిరుచ్చందారువిత్తమ్ (6)నుండి ఉదాహరిస్తూ, భూమిని భరించే ఆదిశేషునికి ఆధారమైనవాడు 'భూః' అని వివరించారు.
నమ్మాళ్వార్ – **తిఅంబామల్ మణి కాక్కిన్ ఱేన్ యానే** ....
తిరుమళిసాయి ఆళ్వార్ – **నాగమేందు మణ్ణినాయ్** ... ... **కాత్తు** (తిరుచ్చందారువిత్తం).

శ్రీ శంకరులు **'అభూః'** అనగా జన్మించనివాడు – అని చెప్పారు. **న భవతి న జాయతే**.
'భూః' అనే నామాన్ని కూడా శ్రీ శంకరులు గుర్తించారు.

439. ధర్మయూపః

- ధర్మమునకు ఆధారము, నిలయము అయినవాడు.
- ధర్మమే శిరస్సుగాగల ధర్మస్వరూపుడు.
- ప్రాణములను నిలుపు పంచభూతములను కలిపియుంచువాడు.

ఓం ధర్మయూపాయ నమః

యజ్ఞములందు యజ్ఞపశువును బంధించు స్తంభమునకు 'యూపము' అని పేరు. విష్ణువురూపంలో అన్ని ధర్మాలు కట్టివేయబడి ఉంటాయి. ఆత్మసాక్షాత్కారానికి సాధనాలయిన ధర్మాలన్నీ అతనియందే బంధింపబడియుంటాయి. శ్రీ భట్టుల వ్యాఖ్యానం – **ధర్మతత్వం శిరః అవయవతాయ యౌతి ఇతి ధర్మయూపః.**

తస్మై నమస్ తచ్ఛిరో ధర్మః – తైత్తరీయారణ్యకము.

ఉత్తమాంగతయా ధర్మతత్వం యౌతీతి సర్వదా
ధర్మయూప స్సమాఖ్యాతో హ్యష్టార్ణోధర్మదాయకః
సర్వదా ధర్మమే శిరస్సుగాగలవాడు ధర్మయూపుడు. ఈ నామము అష్టాక్షరి. ధర్మదాయకము.
ఓం ధర్మయూపాయ నమః. (శ్రీకైవల్య సారధి).

శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఈ నామమునకు మరొక అనుభవం మనకు ప్రసాదించారు. **ధారయతి ఇతి ధర్మః** – ధరించునది ధర్మము. యూపమనగా బంధించు గుంజ. ఈ జగత్తులో జీవులను బంధించునవి (నిలబెట్టునవి) పంచభూతములు. అలా ధరించే పంచభూతాలను కలిపికట్టివేసేవాడు గనుక భగవానుడు 'ధర్మయూపః'

ధర్మచక్రము రచయిత – ధర్మము, భగవానుడు వేరువేరు కాదు. ధర్మమార్గమున వర్తించువారికి భగవంతుని కావలి తథ్యము. అదేమాట భీష్ముడు దుర్యోధనునికి చెప్పాడు.

440. మహామఖః

- గొప్ప యజ్ఞము. యజ్ఞస్వరూపుడు. పూజ్యమైన యజ్ఞము అవయవముగా గలవాడు.
- ఆయనకు అర్పింపబడు యజ్ఞాలు మోక్షఫలాన్నిస్తాయి.

ఓం మహామఖాయ నమః.

'మఖము' అనగా యజ్ఞము. సక్రమముగా యజ్ఞమును చేసినవారికి కోరుకున్న ఫలము సిద్ధిస్తుంది. భక్తుల కోరికలన్నీ నెరవేర్చేవాడు గనుక శ్రీదేవుడు మహామఖుడు.

ధర్మదేహతయా పూజ్యో యజ్ఞోఽస్యావయవో యతః
అతో మహామఖః ప్రోక్తో హ్యష్టార్ణః కర్మకారకః
పరమేశ్వరుడు ధర్మమే శరీరముగా గలవాడు. అందుచేత పూజ్యమైన యజ్ఞము అవయవముగా గలవాడై, 'మహామఖః' అనబడును. ఈ నామము అష్టాక్షరీమంత్రము. పుణ్యకర్మలను చేయిస్తుంది. ఓం మహామఖాయ నమః. (శ్రీకైవల్య సారధి).

మహాన్తః భవంతి మఖాః యజ్ఞాః నిర్వాణ లక్షణం
ఫలం ప్రయచ్ఛంతః సంతః యస్మిన్ సమర్పితా
ఎవనియందు సమర్పింపబడే యజ్ఞాలు గొప్పవిగా అయి మోక్షఫలాన్ని ఇస్తున్నాయో, అట్టి మహానుభావుడు – అని శ్రీ శంకరుల భాష్యము. శ్రీనివాసునకు సమర్పింపబడే సత్కర్మలన్నీ జన్మరాహిత్యాన్ని ప్రసాదిస్తాయి.

441. నక్షత్రనేమిః

- నక్షత్రములను నడుపువాడు.
- శింశుమార చక్రమునకు ఇరుసువలె హృదయస్థానమున నున్నవాడు.

ఓం నక్షత్రనేమయే నమః

నక్షత్రములు – **న క్షరతి క్షీయతే వా** – క్షీణించనివి; నేమి – **నయతి ఇతి** – నడిపించువాడు.

యన్నక్షత్రాత్మకం చక్రం జ్యోతిరూపమనామయం

యస్తన్నిత్యం భ్రామయతి భ్రమంత మనుయాతి చ

నక్షత్రనేమిర్విజ్ఞేయో నవార్ణో భ్రమనాశకః

తేజోరూపకమైనది, ఆరోగ్యప్రదమైనది అయిన నక్షత్రరూప చక్రాన్ని నిరంతరము ప్రవర్తింపజేస్తూ, దానిని అనుసరించి చరించేవాడు. ఈ నవార్ణమంత్రము భ్రమనాశకము. ఓం నక్షత్రనేమయే నమః.

జ్యోతిశ్చక్రమ్ నయతి ఇతి నక్షత్రనేమిః – అని శ్రీ భట్టులు తమ వ్యాఖ్యకు విష్ణుపురాణమునుండి ఉదహరించారు.

ఏష భ్రమన్ భ్రామయతి చంద్రాదిత్యకాన్ గ్రహాన్

భ్రమంతమను తం యాంతి నక్షత్రాణి చ చక్రవత్ – విష్ణుపురాణము 2.92

(ధ్రువుడు) అలా తాను తిరుగుతూ సూర్యచంద్రులను, గ్రహాలను త్రిప్పుచున్నాడు. నక్షత్రాలు తనతో చక్రము వలె భ్రమించును.

శింశుమారాకృతి ప్రోక్తమ్ యద్రూపం జ్యోతిషామ్ దివి

నారాయణః పరంధామ్నా తస్యాధారః స్వయం హృదిః – విష్ణుపురాణము 2.94

శింశుమారాకృతి (నీటిలో తిరిగే మొసలి) రూపంలో ఉండే ఈ జ్యోతిశ్చక్రము హృదయస్థానమున ఆధారమై నారాయణుడున్నాడు.

తైత్తరీయ శాఖలోని స్వాధ్యాయ బ్రాహ్మణములో కూడ శింశుమారచక్రము హృదయస్థానమున నారాయణుడున్నట్లు ప్రస్తావింపబడినది. ఈ ఆధారముగ శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు. శింశుమార చక్రమునకు ఇరుసువలె మధ్యనున్నవాడు గనుక నారాయణుడు నక్షత్రనేమి.

ధర్మచక్రము రచయిత – బ్రహ్మాండములో ఒక నక్షత్రము గతి తప్పినా అది ఉత్పాతమే. అన్ని దశలలోను క్రమము అత్యవసరమని, స్వార్థమును విడచి క్రమమార్గమున లోకాభ్యుదయము కొరకు కృషించవలెనని ఈ నామము బోధించుచున్నది.

442. నక్షత్రీ

- నక్షత్రములను (నిలుపువాడు) కలిగినవాడు.

- చుక్కలలో చంద్రుడు. తారలకు రాజు.

ఓం నక్షత్రిణే నమః

శింశుమారాకృతిః ప్రోక్తం యద్రూపం జ్యోతిషాం దివి
తద్వ్యాప్తి స నక్షత్రీ సప్తార్ణో లోకపావనః
మొసలి ఆకారము కలిగిన ఆకాశమునందు వెలుగొందుచున్న నక్షత్రపుంజమును కలిగిన (ధరించియున్న) వాడు. ఈ సప్తాక్షరీమంత్రము లోకపావనము. ఓం నక్షత్రిణే నమః.

నక్షత్రం అస్మిన్నస్తీతి నక్షత్రీ – శింశుమార రూపమయిన నక్షత్రరూపమును ధరించినవాడు – అని శ్రీ భట్టుల వ్యాఖ్య.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – క్షేత్రము గలవాడు క్షేత్రి. శరీరము గలవాడు శరీరి. నక్షత్రము గలవాడు 'నక్షత్రీ'.

శ్రీ శంకరులు గీతాశ్లోకము (10.21) ఆధారముగా 'నక్షత్రీ' అనగా 'చంద్రుడు' అని వివరించారు.
ఆదిత్యానామహం విష్ణుః జ్యోతిషాం రవిరంశుమాన్
మరీచిర్మరుతామస్మి నక్షత్రాణా మహం శశీ – గీత 10.21
ద్వాదశాదిత్యులలో నేను విష్ణువును. జ్యోతిర్మయ స్వరూపులలో కిరణ్మయుడైన సూర్యుడను. మరుత్తులలో తేజమును. నక్షత్రములలో చంద్రుడను.

443. క్షమః

- సమర్థతతో, శక్తితో భువనభారమును వహించేవాడు.
- అన్ని కార్యములందు సమర్థుడు.
- భూమివలె క్షమాగుణము కలవాడు.

ఓం క్షమాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **అనాయాసేన అఖిల భువన భారమ్ క్షమతే -వహతి ఇతి క్షమః** – అవలీలగా అఖిల భువనములను భరించువాడు 'క్షమః'.

అనాయాసేన నిఖిలభారం చ భువనస్య యః
సహతే సః క్షమః ప్రోక్తః షడర్ణః క్షాంతిదాయకః
అనాయాసముగా అఖిల భువనభారమును సహించువాడు. ఈ షడర్ణమంత్రము క్షాంతి దాయకము.
ఓం క్షమాయ నమః.

శింశుమారాత్మనా విష్ణుః భూరాదీ నూర్ధ్వతస్థితాన్
దధ్రే శేష తయాన్ లోకాన్ సప్తలోకాన్ అధస్థితాన్
శ్రీమహావిష్ణువు శింశుమార రూపంలో ఊర్ధ్వలోకాలను, ఆదిశేషుని రూపంలో అధోలోకాలను మోస్తున్నాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సర్వకార్యేషు సమర్థః క్షమః** – అన్ని పనులలో సమర్థుడు క్షమ.

శ్రీ శంకరులు చెప్పిన మరొక అర్థము – సహనము, ఓర్పు కలవాడు. **క్షమయా పృథ్వీ సమః** (బాలకాండము 1.18) భూమికి సమానమైన క్షమాగుణము కలవాడు శ్రీరాముడు.

ఈ అర్థాలను ధర్మచక్రము రచయిత చక్కగా సమన్వయ పరచారు. సమర్థవంతముగా సత్ఫలితాలను సాధించాలంటే ఓర్పుతో కృషి చేయాలి. ఇలా ఓర్పుతో శ్రమించి ఫలితాలు సాధించేవారు భగవంతుని కృపాగుణమును తెలిసికొని పరవశిస్తారు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – జీవులు వైదికమార్గమును విడచి చరించినాగాని భగవంతుడు సహనము కోల్పోడు. అందరికీ తగిన ఫలములు ప్రసాదించును. వారికి మార్గము మార్చుకొను అవకాశమును కలిగించును. సృష్టిలో అంతటా భగవానుని క్షమాగుణము ప్రతిబింబించుచున్నది. శరీరములో ఆత్మ క్షమకలిగి బంధింపబడి యుండును. అన్ని జీవులు వివిధ క్షోభలను భరించుచుండును.

444. క్షామః

- అవాంతర ప్రళయకాలమున క్షీణించినట్లు కనిపించేవాడు.
- ప్రళయకాలమున అన్నీ లయముకాగా తాను మాత్రము నిలిచియుండేవాడు.
- అన్నింటా దాగియున్నవాడు.

ఓం క్షామాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

47వ శ్లోకము. 444వ నామము. క్షామః – **నక్షత్రనేమిః నక్షత్రీ క్షమః క్షామః సమీహనః**

91వ శ్లోకము. 858వ నామము. క్షామః – **ఆశ్రమః శ్రమణః క్షామః సుపర్ణో వాయువాహనః**

క్షయమునొందుట – అనే అర్థములో ఈ నామమునకు వ్యాఖ్యానములు చెప్పారు.

అవాంతర లయే కైశ్చిత్ క్షీణ స్తారాగణై స్మృతః

క్షామో ధ్రువ సమీపస్థః చతుర్నక్షత్ర సంయుతః

అవాంతర ప్రళయంలో శింశుమార చక్రమునకు సంబంధించిన నాలుగు నక్షత్రములు మాత్రమే మిగిలియుండును. మిగిలిన నక్షత్రములన్నీ కొరవడగా ఆ నాలుగు నక్షత్రములతో కలిసి ధ్రువమండలమునకు సమీపంలో ఉంటాడు కనుక భగవంతుడు 'క్షామః' – ఇది శ్రీ భట్టుల వ్యాఖ్యానుసారము.

యావన్మాత్రే ప్రదేశే తు మైత్రేయావస్థితో ధ్రువః
క్షయమాయాతి తావత్ తు భూమేరాభూత సంప్లవే – విష్ణుపురాణము 2.8.92

శ్రీ శంకరుల వ్యాఖ్య – ప్రళయకాలమున అన్నీ నశించినపుడు తానుమాత్రమే ఉండేవాడు 'క్షామః'.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – విశ్వములో అన్నింటిలోను దాగియున్నవాడు గనుక భగవంతుడు 'క్షామః'.

445. సమీహనః

- సృష్ట్యాదియందు ఇంద్రాదులను తగిన పదవులందు నియమించువాడు.
- తన సృష్టియొక్క క్షేమము కొరకు కాంక్షించువాడు.

ఓం సమీహనాయ నమః

'ఈహ' అనగా కోరుట, ప్రయత్నించుట – ఇది రెండు విధములుగా జరుగవచ్చును. (1) స్వయముగా ప్రయత్నించుట (2) ఆ కార్యముకొరకు తగిన వారిన నియమించుట. ఈ రెండు భావములందును వ్యాఖ్యానకర్తలు వివరించిరి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – ప్రళయానంతరము సృష్టి సమయమున సకల దేవతలను నియమించును గనుక సమీహనుడు. **సమీహయతి ఇతి సమీహనః**.

స్వస్వాధికారే సర్వాన్ హి య స్సమీహతి సృష్టిషు
సమీహన స్స విజ్ఞేయ స్స్వష్టార్థః కార్యదాయకః
సృష్టిలో అందరినీ తగిన పదములందు నియమించువాడు. **'ఓం సమీహనాయ నమః'** అనే ఈ అష్టాక్షరిని జపం చేస్తే సకలకార్యసిద్ధి జరుగుతుంది.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **శృత్యాది అర్థమ్ సమ్యగ్ ఈహత ఇతి సమీహనః** – తన సృష్టికి మంచిని ఇచ్చేవాడు సమీహనుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఋగ్వేదం (10.190.3)నుండి చెప్పిన ఆధారము –
సూర్యా చంద్రమసౌ ధాతా యథా పూర్వ అకల్పయత్
దివం చ పృథ్వీం చ అంతరిక్షం అథో స్వః

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

యజ్ఞ ఇజ్యో మహేజ్యశ్చ క్రతుః సత్రం సతాంగతిః |
సర్వదర్శీ విముక్తాత్మా సర్వజ్ఞో జ్ఞానముత్తమమ్ || (48)

446. యజ్ఞః

యజ్ఞస్వరూపుడు.

ఓం యజ్ఞాయ నమః

'యజ్ఞః' నామము మరల 971వ నామముగా స్తుతింపబడినది.

48వ శ్లోకము. 446వ నామము. **యజ్ఞః** – యజ్ఞ ఇజ్యో మహేజ్యశ్చ క్రతుః సత్రం సతాం గతిః

104వ శ్లోకము. 971వ నామము. **యజ్ఞః** – యజ్ఞో యజ్ఞపతిర్యజ్వా యజ్ఞాంగో యజ్ఞవాహనః

యజ్ఞో వై విష్ణుః – అని తైత్తరీయసంహితములో చెప్పారు. యజ్ఞములన్నింటిచేత ఆరాధింపబడేవాడు, యజ్ఞము, యజ్ఞసాధనము కూడ శ్రీమహావిష్ణువే.

యజ్ఞముగురించి ధర్మచక్రము రచయిత చక్కగా వివరించారు – కర్మలు వాని ఫలములతో మనను బంధించును. యజ్ఞము కర్మబంధములనుండి విముక్తులను చేయును. స్వార్థము లేకుండా, అహంకారమును విడచి, లోకహితార్థము సాగించు సత్కార్యములు, త్యాగశీల యత్నములు, భగవదారాధనా విధానములు యజ్ఞములే. ద్రవ్యయజ్ఞములో తాను సంపాదించిన ధనమును లోకకళ్యాణార్థము వెచ్చించుదురు. తపోయజ్ఞములో ధ్యానమును భవగవంతునివైపు లగ్నము చేయుదురు. యోగయజ్ఞములో నియమములు పాటించి ఇంద్రియములను నియంత్రించుదురు. తనను, తనవానిని, తన పనులను, తన ఆలోచనలను సంపూర్ణముగా మాధవసేవకై అర్పించుట అన్నింటికంటె గొప్ప యజ్ఞము.

భగవంతుని సకల కార్యములు, లీలలు లోకమునుద్ధరించుటకే గాని ఆయన అవుసరకోసం కాదు. కనుక గోవిందుడే యజ్ఞస్వరూపుడు.

ఈ నామవివరణను శ్రీశంకరులు మరింత విస్తరించారు. **సర్వేషామ్ దేవానామ్ తుష్టి కారకో యజ్ఞ ఆకారేణ ప్రవర్తత ఇతి** – యజ్ఞస్వరూపుడైన శ్రీమన్నారాయణుడు హవిర్భాగములను అందజేసి సకల దేవతలను సంతుష్టులుగా చేయుచున్నాడు.

పద్మపురాణంలో యజ్ఞరూపియైన ఈశ్వరుని ఇలా వర్ణించారు –

వేదపాదో యూపదంష్ట్రః క్రతుహస్త శ్చితీముఖః

అగ్ని జిహ్వో ధర్మరోమాః బ్రహ్మశీర్షో మహాతపాః

....

నానాచ్ఛందో గతిపథో గుహ్యోపనిషదాసనః

ఛాయాపత్నీ సహాయోవై మేరుశృంగ ఇవోచ్ఛ్రితః

ఆ యజ్ఞపురుషునకు వేదాలు - పాదాలు; యూపస్తంభాలు - కోరలు; క్రతువులు - హస్తాలు; యాగమునకు వాడు చితి - ముఖము; అగ్ని - నాలుక; ధర్మములు - రోమాలు; తపోనిష్ఠులగు బ్రాహ్మణులు - తల; అహోరాత్రాలు - చూపులు; వేదాంత శృతులు - చెవికమ్మలు; స్రవము - తుండము; ఆజ్యము - ముక్కు; సామఘోష - గొప్ప ధ్వని; సత్క్రియలు - క్రమ విక్రమములు; ప్రాయశ్చిత్తములు - నఖములు; పశువు - జానువు; ఔద్గాత్రము - ఆంత్రము (ప్రేగు); హోమము - లింగము; ఫలములు - అవయవాలు; వాయువు - అంతరాత్మ; మంత్రాలు - పెదవులు; సోమరసము - రక్తము; వేదాలు - భుజాలు; వేది - స్కంధము; హవిస్సు - గంధము; హవ్యకవ్యములు - వేదాలు; ప్రాగ్వంశికలు - దేహము; దానము - హృదయము; ఉపకర్మలు - పెదవులు, గడ్డము; ప్రవర్గ్యలు - భూషణములు; నానా ఛందస్సులు - మార్గాలు; గుహ్యోపనిషత్తు - ఆసనము; ఛాయ అతని పత్ని. అతడు ధర్మ సత్యమయుడు. నానాదీక్షలచే అర్చింపబడినవాడు. పర్వతమువలె ఉన్నతుడు.

మానవుడు నిత్యమును పంచమహాయజ్ఞములను – దేవయజ్ఞము, ఋషియజ్ఞము, పితృయజ్ఞము, అతిథి యజ్ఞము, భూతయజ్ఞములను – ఆచరింపవలయును.

447. ఇజ్యః

సకల పూజలను అందుకొనే (ఒకేఒక) దేవుడు.

ఓం ఇజ్యాయ నమః

ఇజ్యమ్ అర్హతి ఇతి ఇజ్యః – పూజింపదగినవాడు. అన్ని మంత్రములు హరి నామములు. అఖిల దేవతలు హరి యవతారములు. అన్ని పూజలును అచ్యుతునకే చెందును.

యేఽప్యన్య దేవతా భక్తా యజంతే శ్రద్ధయాన్వితాః

తేऽపి మామేవ కౌంతేయ యజంత్యవిధిపూర్వకమ్ – గీత 9.23

ఓ అర్జునా! శ్రద్ధాన్వితులైన భక్తులు ఇతర దేవతలను పూజించినప్పటికిని వారు నన్ను పూజించినట్లే! కాని వారి పూజలు అవిధిపూర్వకమైనవి (అనగా అజ్ఞానముతో కూడినవి).

(9.24) ఏలనన సకల యజ్ఞములకు భోక్తను, స్వామిని కూడ నేనే.

శ్రీ భట్టులు మహా భారతము శాంతిపర్వము (355.24)నుండి ఉదాహరించారు –

యే యజంతి పితౄన్ దేవాన్ బ్రాహ్మణాన్ సహుతాశనాన్

సర్వభూతాంతరాత్మానం విష్ణుమేవ యజంతి తే

పితృదేవతలను, దేవతలను, బ్రాహ్మణులను, అగ్నిని అర్చించేవారు సర్వభూతములకు అంతరాత్మయైన శ్రీమహావిష్ణువునే ఆరాధిస్తున్నారు.

శ్రీ శంకరులు హరివంశము (3.40.27) నుండి చెప్పిన ఉదాహరణ –

యే యజంతి మఖైః పుణ్యైర్దేవతాదీన్ పితౄణపి

ఆత్మానమాత్మనా నిత్యం విష్ణుమేవ యజంతి తే

ఎవరైతే నిత్యము పుణ్యయజ్ఞములచే దేవతలను, పితరులను అర్చిస్తారో వారు పరమాత్ముడైన విష్ణువునే అర్చిస్తున్నారు.

448. మహేజ్యః

పూజింపదగినవారిలో ఉత్తముడు.

ఓం మహేజ్యాయ నమః

శ్రీ మహావిష్ణువు మాత్రమే సంసార చక్రమునుండి శాశ్వతముగా విముక్తిని కలుగజేయు మోక్షమును ప్రసాదింపగలడు. ఇతర దేవతలను పూజించుటవలన సామాన్యమగు ఫలములు మాత్రము లభించును. కనుక శ్రీమహావిష్ణువు మహేజ్యుడు. ఆయనను పూజించుట సర్వోత్తమము. **సర్వాసు దేవతాసు మోక్షఫల దాతృత్వాత్ ఇతి మహేజ్యః** – అని శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు.

ఈ నామమును మరింత వివరిస్తూ శ్రీ వి.వి. రామానుజన్ – శ్రీమహావిష్ణువు పరమపురుషుడు. అందరు దేవుళ్ళకు ఆయనే అంతర్యామి. కనుక నేరుగా మహేజ్యుని పూజించుట ఉత్తమము.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – **అగ్ని రవమో దేవతానాం విష్ణుః పరమః** – అని తైత్తరీయ సంహితము (5.5.1)లో చెప్పారు. అందరు దేవతలలో మనకు దగ్గరగానున్న దేవుడు అగ్ని. పరమము (దూరముగానున్నవాడు) విష్ణువు.

449. క్రతుః

- క్రతువులు (పశువును బంధించు స్తంభముగల యజ్ఞములు) ద్వారా ఆరాధింపబడువాడు.

- అందరి క్రియలకు (పనులకు) మూలమైన శక్తి – లేదా – అన్ని పనులు చేసేవాడు.

ఓం క్రతవే నమః

సకల శక్తి సంపదలు వినియోగించి, నిర్దిష్టమైన ఫలితమునాశించి, నియమిత కాలపరిమితిలో సాగించు యజ్ఞము క్రతువు. దృఢమైన సంకల్పము, దీక్షాబద్ధమైన ప్రయత్నము, అచంచలమైన విశ్వాసము క్రతువునకు ఆవశ్యకములు. వీటన్నింటిద్వారా అర్చింపబడే దేవుడు గనుక వాసుదేవుడే క్రతువు.

అగ్నిష్టోమాదయాస్సప్త సంస్థాః క్రతవ ఈరితః

ఆరాధ్యః క్రియతే తైస్తైః ఇతి క్రతురీరితః

అగ్నిష్టోమాది ఏడు యాగములు క్రతువులు. వానిద్వారా ఆరాధింపబడువాడు గనుక దేవుడు క్రతువు. 446వ నామము '**యజ్ఞః**'. 449వ నామము '**క్రతుః**'. గీతలోని 9.16 శ్లోకము ద్వారా ఇవి వేరువేరని గ్రహింపనగును.

అహం క్రతు రహం యజ్ఞః స్వధాహ మహ మౌషధమ్

మంత్రోऽహ మహమేవాజ్య మహమగ్ని రహం హుతమ్

నేనే క్రతువును. నేనే యజ్ఞమును. స్వధయును నేనే. ఓషధులు నేనే. నేనే మంత్రమును. నేనే ఘృతమును. నేనే అగ్నిని. హోమరూప క్రియను నేనే.

యజ్ఞము – దీక్షతో ఆచరించు ధర్మకార్యములు – ఇవి 3 విధాలు.

పాక యజ్ఞాలు మరల 7 విధములు – (1) ఔపాసన (2) స్థాలీపాకము (3) వైశ్వదేవము (4) అష్టక్రము (5) మాసశ్రాద్ధము (6) సర్పబలి (7) ఈశాన బలి.

హవిర్యాగాలు మరల 7 విధములు – (1) అగ్నిహోత్రాలు (2) దర్శపూర్ణిమాసలు (3) అగ్రయణం (4) చాతుర్మాస్యాలు (5) పిండపితృయజ్ఞాలు (6) నిరూఢ పశుబంధము (7) సౌత్రామణి.

సోమ సంస్థలు లేదా **క్రతువులు** అనగా జ్యోతిష్టోమాది యాగములు. వీటిలో యూపస్తంభము ఉండును. ఇవి మరల 7 విధములు – (1) అగ్నిష్టోమము (2) అత్యగ్నిష్టోమము (3) ఉక్థము (4) అతిరాత్రము (5) ఆప్తోర్యామము (6) వాజపేయము (7) పౌండరీకము.

పంచ మహాయజ్ఞాలు

(1) బ్రహ్మ యజ్ఞము – వేదముల పారాయణ, బోధన

(2) పితృయజ్ఞము – పితృదేవతలకు తర్పణమొసగుట

(3) దేవయజ్ఞము – అగ్నిద్వారా దేవతలకు హవిస్సు సమర్పించుట

(4) భూత యజ్ఞము – సకల ప్రాణులకు నిత్యాన్నములో భాగము అర్పించుట

(5) మనుష్య యజ్ఞము – అతిథులను, సకల జనులను ఆదరించుట.

శ్రీ భట్టుల వ్యాఖ్య ప్రకారము – 446వ నామము. **యజ్ఞః** – పంచ మహాయజ్ఞములు, ఏడు పాకయజ్ఞములు కూడ శ్రీమహావిష్ణువు స్వరూపములే. 449వ నామము. **క్రతుః** – 7 సోమసంస్థలు శ్రీమహావిష్ణుస్వరూపములే.

'క్రతుః' నామమును శ్రీ సత్యదేవో వాసిష్ఠ 'క్రియ' అనే అర్థములో వివరించారు. **క్రియత ఇతి క్రతుః** – అన్నింటిని చేసేవాడు గోవిందుడే.

450. సత్రమ్

- సత్రయాగము ద్వారా ఆరాధింపబడువాడు.
- సత్పురుషులను కాచువాడు.
- అంతటిని నడుపువాడు.

ఓం సత్రాయ నమః

బహుకాలానేక యజమానకే విధిచోదితే
సత్రే సదారాధ్య యా సత్రం స్సాత్సీదతీతి చ

శాస్త్రంలో చెప్పబడి, అనేకమంది చేత అనేకసార్లు చేయబడే సత్రయాగముచే ఆరాధించబడువాడు. సత్రయాగము అంటే 18 మొదలు 100 రోజులవరకు చేసే ఒక యజ్ఞము. లోకకళ్యాణము కొరకు పెక్కుమంది చేసేది. శ్రీ భట్టులు తమ వ్యాఖ్యలో – **దీర్ఘకాల బహుయజమానక మాస చోదనా లక్షణమ్ సత్రమ్** – అని వివరించారు. (పెక్కుమందికి ఆహార విరామాది సదుపాయాలు కలిగించే గృహాలను 'సత్రములు' అంటారు) . అన్ని విధాల యాగాలు విష్ణురూపాలు గనుక భగవంతుని నామము 'సత్రము'.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సతః త్రాణయతి ఇతి సత్రమ్** – సజ్జనులను కాపాడువాడు గనుక సత్రము.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **సీదతి గచ్ఛతి సర్వత్ర** – సద్ - సీదతి - కదులునది, కదిలించునది. అన్ని చోట్లకు వెళ్ళేవాడు 'సత్రమ్'. మరొక వివరణ – ప్రపంచమును కదిలించువాడు – **సత్రయతే విస్తారయతి విశ్వమ్ ఇతి సత్రమ్** – భగవంతుని సృష్టి యందంతట ఈ భగవద్గుణము కానవచ్చును. గుండెకాయ కదులుతుంది గాని ఒకేచోట ఉంటుంది.

451. సతాంగతిః

సత్పురుషులకు గమ్యము.

ఓం సతాంగతయే నమః

ఇదే నామము 20వ శ్లోకములో 186వ నామముగా వచ్చినది.

20వ శ్లోకము. 186వ నామము. సతాంగతిః – **మహేష్వాసో మహీభర్తా శ్రీనివాసః సతాంగతిః**

48వ శ్లోకము. 451వ నామము. సతాంగతిః – **యజ్ఞ ఇజ్యో మహేజ్యశ్చ క్రతుః సత్రం సతాంగతిః**

శ్రీ శంకరుల భాష్యము – **సతామ్ - ముముక్షూణామ్ న అన్య గతిః ఇతి సతాంగతిః** – మోక్షము కోరువారికి వేరొక గతి యొల్లదు. అంబుజోదర దివ్య పాదారవిందములందే వారి మనసు లగ్నమై యుండును. **వినా వేంకటేశం న నాథో న నాథః.**

శ్రీ భట్టుల వ్యాఖ్య – ఇంతకుముందు నామమునందు 'ప్రవృత్తి ధర్మము' (ఐహిక భోగభాగ్యములు కోరుట) ననుసరించువారి లక్ష్యము భగవానుడు అని చెప్పడమైనది. ఈ నామమునందు 'నివృత్తి ధర్మము' (ఐహిక భోగభాగ్యములనుండి విరక్తి) కోరువారికి కూడ భగవానుడే పరమగమ్యమమని ఈ నామమునందు తెలియవచ్చుచున్నది.

ప్రవృత్తి ధర్మనిష్ఠానాం గతిర్యస్య సతాంగతిః
నివృత్తి ధర్మ నిష్ఠానాం గతిర్యస్య సతాంగతిః

ఇందుకు విష్ణుపురాణము (2.8.94)నుండి శ్రీ భట్టులు చెప్పిన ప్రమాణము –

నిర్ధూత దోష పంకానాం యతీనాం సంయుతాత్మనాం
స్థానం తత్పరమం విప్ర పుణ్యపాప పరిక్షయే

ఓ బ్రాహ్మణోత్తమా! దోషములనే బురదను కడిగివేసుకొన్నవారు, పుణ్యపాపముల ప్రభావము నశింపజేసుకొన్నవారు, సంయుతాత్ములు అయిన యతులకు ఇది పరమపదము.

శ్రీ చిన్మయానంద – 'గతి' అనగా మార్గము, గమ్యము అని రెండర్థములున్నాయి. సాధువులకు శ్రీమన్నారాయణుడే మార్గము, గమ్యము, సతాంగతి.

చెలిపై చుట్టమవై మనస్థితుడవై చిన్మూర్తివై ఆత్మవై
వలనై కోర్కెల పంటవై విభుడవై వర్తిల్లు నిన్నొల్లకే
పలువెంటన్ బడి లోక మక్కటా వృధాబద్ధాశయమై పోయెడున్....

452. సర్వదర్శీ

అంతటిని చూస్తుండేవాడు.

ఓం సర్వదర్శినే నమః

ధర్మాధర్మాచ తౌ సర్వౌ అధ్యక్షయితుమాదరాత్
సర్వదా శీలమస్యేతి సర్వదర్శీ తతస్మృతః

భగవానుడు అందరికిని అంతర్యామి గనుక అందరి కార్యములను, మంచివి గాని చెడువి గాని – చూచుచునే యుండును. సూర్యుడు లోకమునకు చక్షువని, అంతటికీ వెలుగని అన్నారు. చేయవలసిన పనులు చేసినా, చేయకూడనివి చేసినా, చేయవలసినవి చేయకున్నా – అన్నింటికీ శ్రీమన్నారాయణుడే సాక్షి. అందరికీ అంతర్యామి. కనుక భగవంతునికి ప్రీతి కలిగించే పనులు మాత్రమే చేయాలి. (**అనుకూల్య సంకల్పమ్, ప్రతికూల్య వర్జనమ్**) అని ధర్మచక్రము రచయిత వివరించారు.

జ్ఞాన చక్షుర్భగవాన్ విష్ణుః – అని ఈ నామమును వివరిస్తూ శ్రీ సత్యదేవో వాసిష్ఠ ప్రసిద్ధ శృతినుండి ఉదాహరించారు –

సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్
విశ్వతశ్చక్షురుతః విశ్వతోముఖో విశ్వతో బాహురుత విశ్వతస్పాత్
హిరణ్యయేన సవితా రథేన దేవో యాతి భువనాని పశ్యన్

ఇదే భావము గీత (13.13) శ్లోకములోకూడ ఉన్నది –

సర్వతః పాణిపాదం తత్ సర్వతోऽక్షి శిరోముఖమ్
సర్వతః శృతిమాన్ లోకే సర్వమావృత్య తిష్ఠతి.

10వ శ్లోకములోని '**సర్వదర్శనః**', 22వ శ్లోకములోని '**సర్వదృక్**' నామములు ఈ నామమునకు దగ్గర భావములు కలిగియున్నవి.

453. విముక్తాత్మా

నివృత్తాత్మా

ఈ శ్లోకములో నామము శ్రీ శంకరుల పాఠము ప్రకారము '**విముక్తాత్మా**'. మరియు శ్రీ భట్టుల పాఠము ప్రకారము '**నివృత్తాత్మా**'.

నివృత్తాత్మా

- విషయములనుండి విముఖమైన మనస్సు గలవాడు.
- నివృత్తి ధర్మము పాటించువారికి ఆత్మ (ఆత్మీయుడు).

విముక్తాత్మా

- సహజముగా, స్వభావసిద్ధముగా ముక్తుడైన ఆత్మ
- బంధములు లేనివాడు.

ఓం విముక్తాత్మనే నమః

ఓం నివృత్తాత్మనే నమః.

'నివృత్తాత్మా' నామము నాలుగుమార్లు స్తుతింపబడినది.

25వ శ్లోకము. 231వ నామము. నివృత్తాత్మా – **ఆవర్తనో నివృత్తాత్మా సంవృతః సంప్రమర్దనః**

48వ శ్లోకము. 453వ నామము (శ్రీ భట్టుల పాఠము ప్రకారము). నివృత్తాత్మా – **సర్వదర్శీ నివృత్తాత్మా సర్వజ్ఞో జ్ఞానముత్తమమ్**

64వ శ్లోకము. 604వ నామము. నివృత్తాత్మా – **అనివర్తీ నివృత్తాత్మా సంక్షేప్తా క్షేమకృచ్ఛివః**

83వ శ్లోకము. 780వ నామము. నివృత్తాత్మా – **సమావర్తో నివృత్తాత్మా దుర్జయో దురతిక్రమః**

శ్రీ శంకరుల వ్యాఖ్య ప్రకారము 48వ శ్లోకములో **'విముక్తాత్మా'** అనియు, 83వ శ్లోకములో **'అనివృత్తాత్మా'** అనియు చెప్పబడెను.

శ్రీ భట్టుల వ్యాఖ్య –

నివృత్తి ధర్మాచార్యత్వాత్ విషయేభ్యో నివృత్తిమత్
మనో యస్య నివృత్తాత్మా నరనారాయణాత్మకః

భగవానుడు నరనారాయణులుగా అవతరించి నివృత్తి ధర్మము బోధించెను. నారాయణుడు బోధించిన నివృత్తి ధర్మమును నిర్మమ తపముద్వారా నరుడు పాటించెను. పరమవైరాగ్యము నవలంబించెను. ఏదయినా నారాయణుని కొరకే చేయాలని, అలా చేయించేదికూడా నారాయణుడేనని తెలిపే ఈ పుణ్యనామములో అష్టాక్షరీ మంత్రము, నరనారాయణావతారము సమ్మిళితములైయున్నవి. ఓం నివృత్తాత్మనే నమః.

604వ నామమునకు శ్రీ భట్టుల వ్యాఖ్య – నివృత్తిధర్మము పాటించువారికి ఆత్మ. అట్టి జ్ఞానులను భగవానుడు తన స్వరూపముగా అనుగ్రహించునని శ్రీ వి.వి. రామానుజన్ వివరించారు.

780వ నామ వివరణలో శ్రీ భట్టులు 'నివృత్తి'కి మరొక భావమును గ్రహించారు. తానే సృష్టి చేసినా భగవంతుడు ఐహిక విషయములకు సంపూర్ణముగా అతీతుడు. **స్వతస్తు తత్ అసమ్మత మనః** – ఆయన కరుణామూర్తియై లోకములను సృజించెనుగాని లోకములో జరిగేవి శ్రీమన్నారాయణుని ప్రభావితము చేయవు.

231వ నామమునకు శ్రీ భట్టుల వివరణ – అన్నింటికంటె మహోన్నతమగు పరమపద తత్వమూర్తి. పరమ పురుషుడు. పరమాత్ముడు. పరమాప్తుడు. పరంధాముడు. పరమేశ్వరుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – స్వభావసిద్ధంగానే ముక్తిని పొందియున్న ఆత్మ. కర్మబంధములకతీతుడు, లోక కళ్యాణమునకే సర్వకార్యములు చేయువాడు గనుక శ్రీమహావిష్ణువు '**విముక్తాత్మా**'.
శ్రీ సత్యదేవో వాసిష్ఠ వివరణ – జగత్తులో అన్నింటికి, అందరికిని వాసుదేవుడే అంతర్యామియైనాగాని ఆ పరమాత్ముడు దేనియందును బంధింపబడలేదు గనుక శ్రీహరియే విముక్తాత్ముడు, నివృత్తాత్ముడు.

454. సర్వజ్ఞః

- సకల జీవులకును తానే అంతర్యామియని స్వయముగా తనను తానెరిగినవాడు. కనుక సర్వమును తెలసినవాడు.
- సర్వము తానెయైనవాడు. సర్వము తెలిసినవాడు.

ఓం సర్వజ్ఞాయ నమః

ఈ సప్తాక్షరీ మంత్రము జ్ఞానప్రదము. మరల 821వ నామముగా వచ్చును.

48వ శ్లోకము. 454వ నామము. సర్వజ్ఞః – **సర్వదర్శీ విముక్తాత్మా సర్వజ్ఞోజ్ఞానముత్తమమ్**

87వ శ్లోకము. 821వ నామము. సర్వజ్ఞః – **అమృతాశోఽమృతవపుః సర్వజ్ఞః సర్వతోముఖః**

శ్రీ భట్టుల వ్యాఖ్య – జగత్తులోని సమస్తమునకు అంతర్యామియని భగవానుడు తనను తానే తెలిసినవాడు. తానే ఉత్తమధర్మము, తానే ఉత్తమ గమ్యము, తానే ఉత్తమ సాధనము అని యెరిగినవాడు. ఓం సర్వజ్ఞాయ నమః.

స్వాత్మనా స్వమాత్మానం యశ్చ జానాతి కేవలమ్
సర్వజ్ఞస్సతు విజ్ఞేయః సప్తార్ణో జ్ఞానదో మనుః
పెరియతిరుమొళి 4.9.6 – **ఉళగత్తు ఎల్లామ్ అఱివీర్**

శ్రీ శంకరుల భాష్యము – **సర్వశ్చ అసౌ జ్ఞశ్చ ఇతి** – అంతయు తానైనవాడు. అంతయు తెలిసినవాడు.
ఇందుకు శ్రీ రాధాకృష్ణశాస్త్రి శృతులనుండి పలు ఉదాహరణలనిచ్చారు –
ముండకోపనిషత్తు 1.1.9 – **యః సర్వజ్ఞః సర్వవిత్**
ప్రశ్నోపనిషత్తు 4.10 – **స సర్వజ్ఞః సర్వతో భవతి**
శ్వేతాశ్వరోపనిషత్తు 2.6.2,16 – **స విశ్వకృత్ విశ్వవిద్ ఆత్మయోనిః జ్ఞః కాలకాలో గుణీ సర్వవిద్యః**

455. జ్ఞానముత్తమమ్

- అన్నింటికంటె ఉత్తమమైన శ్రీవైష్ణవ ధర్మమును, పాంచరాత్రాగమమును ప్రసాదించినవాడు.
- అన్నింటికంటె ఉత్తమమైన, నిత్యమైన, సత్యమైన, అనాదియైన, అవిచ్ఛిన్నమైన, అనంతమైన, శాశ్వతమైనవాడు.

ఓం ఉత్తమాయ జ్ఞానాయ నమః

ఓం జ్ఞానాయ ఉత్తమాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య –

పరశ్చ వైష్ణవోధర్మః సర్వోఽస్మిన్ జ్ఞాయతే యతః

సర్వేషాం శ్రేయసాం మూలం స జ్ఞేయం జ్ఞానముత్తమమ్

అన్ని ధర్మములకంటె ఉత్తమమైన శ్రీవైష్ణవధర్మమును తెలియజేసినవాడు. **సర్వః పరో వైష్ణవో ధర్మః జ్ఞాయతే అస్మిన్ ఇతి జ్ఞానముత్తమమ్.** ఇంకా భగవంతుడు పాంచరాత్రమును ఉపదేశించెను. ఇది ఉత్తమ జ్ఞానము. **పఠంతమ్ అనిశమ్ శాస్త్రమ్ పాంచరాత్ర పురస్సరమ్.**

శ్రీ వి.వి. రామానుజన్ నమ్మాళ్వారు రచనను ప్రస్తావించారు. **మిక్క జ్ఞానమూర్తియాగియ వేదవిళక్కు** (తిరువైమోళి 4.7.10).

శ్రీ శంకరుల భాష్యము – **ప్రకృష్టమ్ అజన్యమ్ అనవచ్ఛిన్నమ్ సర్వస్య సాధకమ్ ఇతి జ్ఞానముత్తమమ్.** పరబ్రహ్మము అనంతము. దేశకాలములచే పరిచ్ఛిన్నము కానిది. ఆద్యంత రహితము. సర్వోత్తమము. ఏదయినా సాధించుటకు అత్యున్నత మార్గము. **సత్యమ్ జ్ఞానమ్ అనంతమ్ బ్రహ్మ** (తైత్తరీయోపనిషత్తు). కనుక పరబ్రహ్మమే ఉత్తమజ్ఞానము.

సామాన్యజ్ఞానమునకు, ఉత్తమ జ్ఞానమునకు శ్రీ రాధాకృష్ణశాస్త్రి చెప్పిన అంతరము – ఒక వ్యక్తి ఏమైనా వస్తువును చూచినపుడు, ఆ జ్ఞానమునకు కొన్ని పరిమితులుండును. చూచేవాని దృష్టి, శక్తి, ఆ వస్తువుపై పడే కాంతి, ఇరువురకు ఉన్న దూరము, ఆ వస్తువు పరిమాణము – ఇవన్నీ పరిమితులు. కాని ఆత్మజ్ఞానమునకు ఇంద్రియాల పరిమితులు వర్తించవు. అది ఉత్తమ జ్ఞానము.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఉదాహరించిన శ్రుతివాక్యములు –

సూత్రమ్ సూత్రస్య యో వేద

స వేద బ్రహ్మణమ్ మహత్

మహత్ బ్రహ్మమును గురించి తెలిసినవాడు తెలియవలసినవాటిలో ఉత్తమమైనదానిని తెలిసినవాడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

సువ్రతః సుముఖః సూక్ష్మః సుఘోషః సుఖదః సుహృత్ |
మనోహరో జితక్రోధో వీరబాహుర్విదారణః || (49)

456. సువ్రతః

- శరణాగతులకు అభయమును ప్రసాదించుట – అను చక్కని వ్రతము గలవాడు.
- నరనారాయణావతారమున గొప్ప వ్రతము (తపము) ఆచరించినవాడు.
- తాను పరిగ్రహించు నైవేద్యము విషయమై మంచి నియమము గలవాడు (కుచేలునివంటి భక్తులు అర్పించినదానిని స్వీకరించువాడు).
- లోకులకు మార్గదర్శకముగానుండుటకై నిత్యకర్మాది వ్రతములను ఆచరించువాడు.

ఓం సువ్రతాయ నమః

మరల ఈ నామము 88వ శ్లోకములో 824వ నామముగా స్తుతింపబడినది.

49వ శ్లోకము. 456వ నామము. సువ్రతః – **సువ్రతః సుముఖః సూక్ష్మః సుఘోషః సుఖదః సుహృత్**

88వ శ్లోకము. 824వ నామము. సువ్రతః – **సులభః సువ్రతః సిద్ధః శత్రుజిత్ శత్రుతాపనః**

శ్రీ భట్టులు 824వ నామమునకు, శ్రీ శంకరులు ఈ 456వ నామమునకు శ్రీరామచంద్రుని శరణాగతత్రాణ పరాయణత పరముగా వివరణ ఇచ్చారు. అందుకు వారు యుద్ధకాండలోని ప్రసిద్ధ శ్లోకము (18.34)ను ఉదహరించారు.

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి యాచతే
అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్ వ్రతం మమ.

'నేను నీవాడను. రక్షింపుము' అని ఒక్కమారైనను నన్ను యాచించినవానికి సర్వభూతములనుండి అభయమును ప్రసాదింతును. ఇది నా వ్రతము.

ఇదే వివరణకు శ్రీ వి.వి. రామానుజన్ నమ్మాళ్వార్ శ్రీసూక్తినుండి ఉదాహరించారు – **శరణమాగుమ్ తనతాళ్ అడైందార్గతకెల్లామ్** (తిరువాయిమొళి 9.10.5)

88వ శ్లోకములోని 'సువ్రతః' నామమునకు శ్రీ శంకరులు చెప్పిన వివరణ. వ్రతయతి – ఆనందించువాడు; సువ్రతః – కుచేలునివంటి భక్తులు సమర్పించినదానిని గైకొని సంతసించువాడు.

('గీతాతత్వవివేచనీ వ్యాఖ్య'నుండి ఈ సుదాముని కథ భాగము సంగ్రహించినది) సుదాముడు (కుచేలుడు) శ్రీకృష్ణునకు బాల్యమిత్రుడు. సహపాఠి. వేదవేత్త. విషయ విరక్తుడు. శాంతచిత్తుడు. తదుపరి కాలమున దుర్భర దారిద్ర్యమునకు లోనయ్యెను. అతని భార్యాబిడ్డలు ఆకలితో అలమటించిరి. భార్య అభ్యర్థన మేరకు సుదాముడు తన బాల్యమిత్రుడైన శ్రీకృష్ణభగవానుని దర్శింపతలచెను. ఎట్లో భార్య యేర్పరచిన నాలుగు పిడికెళ్ళ అటుకులు తన జీర్ణవస్త్రములో మూటగట్టుకొని దేవదేవుని దర్శించుటకు ద్వారకకు చేరెను. సుదాముడు తనకొఱకై వేచియున్నాడని ద్వారపాలకునిద్వారా విన్న కృష్ణుడు ఒక్క ఉదుటున లేచి పరుగిడి

కరమర్థి నెదురుగా జని
పరిరంభణమాచరించి, బంధుస్నేహ
స్ఫురణన్ దోడ్తెచ్చి, సమా
దరమున గూర్చుండబెట్టె దన తల్పమునన్

సుదాముడు శ్రీకృష్ణుని సందర్శించుట – 17వ శతాబ్దపు చిత్రం. వికీపీడియానుండి

సుదాముని దీనదశను జూచి అచ్యుతుని గుండె నీరయ్యెను. చెలికాని గుండెలకు హత్తుకొని, సాదరముగా అంతఃపురములోనికి గొనిపోయి, తన తల్పముపై కూర్చుండబెట్టెను. పూజాసామగ్రిని స్వయముగా తెచ్చి, తన చేతులతోనే ఆయన పాదములు కడిగి, దేవదేవుడా పాదజలమును తన శిరముపై జల్లుకొనెను. పిదప సుగంధ ద్రవ్యములతో సత్కరించి, భోజనమునిడి, తాంబూలము సమర్పించెను. శ్రీరుక్మిణీదేవి తన చెలులతో సహా వింజామరలు వీచుచుండగా చిన్ననాటి ముచ్చట్లు చెప్పసాగెను. ఆ దృశ్యమును చూచిన అంతఃపురకాంతలు కుచేలుని సౌభాగ్యమును ఇట్లు ప్రశంసించిరి –

ఏమి తపంబు సేసెనొకొ యీ ధరణీదివిజోత్తముండు, తొల్
బాముున యోగివిస్ఫురదుపాస్యకుడై, తనరారు నీ జగ
త్స్వామి రమాధినాధు నిజతల్పమునన్ వసియించియున్నవా
డీ మహనీయ మూర్తికెనయే మునిపుంగవులెంతవారలున్?

కొంత తడవునకు శ్రీనివాసుడు తన ప్రియమిత్రునితో – మిత్రమా! నాకేమైన కానుక తెచ్చితివా? భక్తులు ప్రేమతో ఇచ్చిన స్వల్పవస్తువును కూడ నేను గొప్పగా భావింతును. ఏలనన నేను ప్రేమ ఆకలితోనున్నవాడను. భక్తిరహితులు ఎన్నెన్ని కానుకలు సమర్పించినను అవి నాకు సంతృప్తికరములు గావు – అని స్మితముతో పలికెను.

పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి
తదహం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః – (వ్యాసుని రచన)

దళమైనను బుష్పమైనను
ఫలమైనను సలిలమైన బాయని భక్తిన్
గొలిచిన జనులర్పించిన
నెలమిన్ రుచిరాన్నముగనె యేను భుజింతున్ – (పోతన తెలుగు సేత)

తన మిత్రుడు నిష్కామభక్తుడు. పతివ్రతయైన భార్య ప్రార్థనపై బాల్యమిత్రుని కడకు వచ్చెను అని సర్వాంతర్యామి హరి గ్రహించినాడు. దేవతలకును దుర్లభములైన సంపదలను (భోగ మోక్షములను) అతనికి ప్రసాదింప నిశ్చయించినాడు. సంకోచించుచున్న సుదాముని జీర్ణవస్త్రపు మూటను భగవానుడు చొరవగా లాగుకొనగా ఆ మూట చినిగి అటుకులు చెదురైనవి. అపుడా శ్రీవత్సాంకితుడు ఆ అటుకులను ఏరుకొని తినుచు ఇట్లనెను.

నన్వేత దుపనీతం మే, పరమ ప్రీణనం సఖే!
తర్పయంత్యంగ మాం విశ్వమేతే పృథుక తండులాః

మిత్రమా! నీవు తెచ్చిన ఈ అటుకుల కానుకయే నన్ను మిక్కిలి ప్రసన్నునిగా జేసినది. **ఈ అటుకులు నన్ను, నాతోబాటు సమస్త విశ్వమును సంతృప్తి పఱచినవి.** అనుచు ఒక పిడికెడు అటుకులు ఆరగించి శ్రీదేవదేవుడు మరియొక పిడికెడు తీసికొనబోవుచుండగా ఆయనను రుక్మిణీదేవి వారించినది.

మురహరుడు పిడికెడటుకులు
కరమొప్పగ నారగించి, కౌతూహలియై
మఱియును, బిడికెడు గొన ద
త్కర మప్పుడు పట్టి, కమల కరములన్

సొంపారగ నితనికి బహు
సంపదలందింప నివియ చాలును నిక భ
క్షింప వలవదు, త్రిజగ
త్సంపత్కర! దేవదేవ! సర్వాత్మ హరీ!

కొలది దినముల పిదప సుదాముడు తన ఇంటికరిగెను. భగవంతుని అనుగ్రహముతో అతనికి అపార సంపదలు కూడెను. సుదాముడు జీవితమంతయు అనాసక్త భావముతో గడిపెను. ఎల్లవేళల భగవంతుని భజించుచునే యుండెను.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి సూచన – నరనారాయణావతారమున భగవానుడు సకల నియమములతో తపమాచరించెను. వ్రతము అనగా నియమము, నియంత్రణ. కనుక భగవానుడు సువ్రతుడు.

శ్రీ చిన్మయానంద వివరణ – నరనారాయణావతారమున దేవుడు బదరికాశ్రమమున తీవ్రమైన వ్రతము (తపము) ఆచరించెను. కనుక ఆయన సువ్రతుడు.

ఈ 456వ నామమునకు శ్రీ భట్టుల వివరణ – సు-వ్రతుడు అనగా సత్కర్మలను చక్కగా ఆచరించువాడు. భగవంతుడు అన్ని కర్మఫలములకును, కులధర్మములకును అతీతుడైనను, సకల అనుష్ఠానములను అవతార సమయమున శ్రద్ధగా ఆచరించును గనుక ఆయన సువ్రతుడు.

గీత 3.21, 22, 23

యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః
స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే
న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన
నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి
యదిహ్యాయం న వర్తేయం జాతు కర్మణ్యతంద్రితః
మమవర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః

శ్రేష్ఠుడైన పురుషుని ఆచరణమునే ఇతరులు అనుసరింతురు. అతడు నిలిపిన ప్రమాణములను పాటించెదరు. అర్జునా! ముల్లోకములలో నాకు కర్తవ్యముగాని, పొందవలసియున్నదిగాని లేదు. ఐనను నేను కర్మలయందు ప్రవర్తిల్లుచున్నాను. ఏలనన ఎప్పుడైనను నేను కర్మాచరణమునందు వర్తించకున్న ఇతరులు కూడ నా మార్గమును అనుసరించుచు కర్మలను విస్మరింతురు.

భీష్ముని బ్రహ్మచర్యవ్రతము, హరిశ్చంద్రుని సత్యవ్రతము వారిని మహాత్ములను చేసెను. సువ్రతత్వమునకు ఇవి ఉదాహరణలని ధర్మచక్రము రచయిత వివరించారు.

457నుండి 463వరకు నామములను శ్రీ భట్టులు నరనారాయణావతార పరముగాను, మోహినీ అవతార పరముగాను కూడ వ్యాఖ్యానించారు.

457. సుముఖః

- సుందరమైన ముఖము గలవాడు.

- సుఖదుఃఖములను ద్వంద్వములయందును ప్రసన్నముఖుడై యుండువాడు.
- బ్రహ్మను సృజించి ఆయనకు వేదములు బోధించినవాడు.
- అమృతమును ధరించిన చంద్రునివంటి ముఖముగల మోహిని.

ఓం సుముఖాయ నమః

ధ్యాతౄణాం విషయే యస్య సుప్రసన్నం మనోహరం ముఖ మస్తీతి సుముఖః – తనను ధ్యానించేవారు, ఉపాసించేవారు అయిన భక్తుల విషయంలో ప్రసన్నమైన ముఖము గలవాడు సుముఖుడు.

శోభనం ముఖం యస్య స సుముఖః – అందమైన ముఖము గలవాడు సుముఖుడు.

ప్రసన్నవదనం చారుపద్మాయతేక్షణమ్ – ప్రసన్న వదనుడు, కమలముల రేకులవంటి కనులు గలవాడు.

ఆనందామృత సంపూర్ణ వదనేందు కాంతినా కలాకృతి రూపేణ కరస్థేన విరాజితమ్
ఆనందామృతము నిండిఉన్న చంద్రునిలాగా ప్రకాశించే వదనంతో అమృతకలశము ధరించినట్లుగా అందమైన ముఖం గలవాడు. ప్రసన్నమైన వదనము గలవాడు. ఇది మోహిని అవతారపరమైన సూచన.

శోభనమ్ ముఖమ్ అస్య ఇతి సుముఖః – నరనారాయణావతారమున తపము చేయు సమయమున ధ్యానమగ్నుడైయున్న సుందరవదనుడు.

శ్రీ భట్టులు **'కృష్ణాయ కమలదళామలనేత్రాయ'** అనే కృష్ణమంత్రమును ఉదాహరించారు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి వివరణ – తీవ్రమైన సాధన సమయంలోనూ, సమస్యలనెదుర్కొన్న సమయంలోనూ ఎవరి ముఖంలోనైనా అలసట, బాధ కనిపించవచ్చును. కాని భగవానుని ముఖం సదా ప్రసన్నంగా ఉంటుంది. అయోధ్యకాండము 19.30-33, కంబరామాయణము – రాజ్యాభిషేకము బదులు వనవాసదీక్ష చేకొనిన రాముని వదనము ప్రశాంతసుందర పద్మమువలెనున్నది.

శ్రీ శంకరులు విష్ణుపురాణమునుండి, మరియు శ్రీమద్రామాయణమునుండి ఉదాహరించారు.
ప్రసన్న వదనమ్ చారుపద్మ పత్రాయతేక్షణమ్ –విష్ణుపురాణము 6.7.79 – ఆయన ముఖము ప్రసన్నముగానున్నది. ఆయన కనులు చక్కని తామరరేకులవలెనున్నవి.

ఇమాని తు మహారణ్యే విహృత్య నవపంచ చ
వర్షాణి పరమప్రీతః స్థాస్యామి వచనం తవ – అయోధ్యకాండము 24.17

న వనం గంతు కామస్య త్యజతశ్చ వసుంధరామ్

సర్వలోకాతి గస్యేవ మనో రామస్య వివృతే – అయోధ్యకాండము 19.33

స పితుర్వచనమ్ శ్రీమానభిషేకాత్పరం ప్రియమ్
మనసా పూర్వమాసాద్య వాచా ప్రతిగృహీతవాన్ – సుందరకాండము 33.24
సకల సద్గుణరాశియైన ఆ శ్రీరాముడు తండ్రి ఆజ్ఞను పట్టాభిషేకముకంటెను గొప్పదిగా భావించి, మనస్ఫూర్తిగా సంతోషముతో దానికంగీకరించి, అందులకు తన ఆమోద(వచన)మును తెల్పెను.

శ్రీ శంకరులు చెప్పిన మరొక అర్థము – **యో బ్రహ్మాణమ్ విదధాతి పూర్వమ్** – బ్రహ్మకు విజ్ఞానము నుపదేశించి, ప్రసన్నుడైనవాడు.

458. సూక్ష్మః

- బుద్ధికి అందనంత సూక్ష్మరూపియై, అంతటా ఉన్నవాడు. అన్నియెడల తన ఉనికికి సంబంధించిన గుణములు ప్రదర్శించువాడు.
- తన ఆలోచనలు అసురులకు తెలియకుండా ఉన్న మోహిని.

ఓం సూక్ష్మాయ నమః

భగవంతుడు ఇంద్రియములకు కానరాడు. బుద్ధికి అందడు. అయినా అత్యంత ప్రభావశాలియై అన్నియెడల వ్యాపించియుండును. నిశ్చలమైన దీక్ష, నిర్మలమైన భక్తి చేతనే తెలియవచ్చును. **సర్వగతం సూక్ష్మం** (ముండకోపనిషత్తు 1.1.16) – అనే శృతివాక్యమును శ్రీ శంకరులు ఉదాహరించారు.

సూక్ష్మ సూక్ష్మ స్వరూపతః
అసురేషు నిగూడాభిప్రాయత్వాత్ సూక్ష్మ ఉచ్యతే
అన్ని జీవులలోను ప్రవేశించిన సూక్ష్మరూపి. రాక్షసులను శిక్షించే విషయంలో ఎవరికీ కనిపించని భావాలు గలవాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ వివరణ – 'సూచ్' అనగా సూచించుట అన్న ధాతువునుండి – భగవంతుడు నేరుగా కన్పించకపోయినా, ప్రతివస్తువునందు ఆయన ప్రభావము గోచరమగుచుండును. ఆకాశములోని శబ్దము, వాయువునందలి స్పర్శ, అగ్నిలోని వేడి – ఇవన్నీ సూక్ష్మరూపుని సూచికలు.

మోహిని అవతారపరంగా – తన ఆలోచనలు అసురులకు తెలియకుండా ఉన్న మోహిని. కనుక సూక్ష్మ.

459. సుఘోషః

- వేదములే తన ధ్వని (ఘోష, నాదము) అయినవాడు.

- వేదములందు, ఉపనిషత్తులందు చక్కని నాదముతో కీర్తింపబడినవాడు.
- మధుర గంభీర స్వరము గలవాడు.
- ప్రకృతిలోని చక్కని శబ్దములద్వారా తెలియజేయబడువాడు.

ఓం సుఘోషాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – వేదముల వాణియైన ఉపనిషత్తులచే ఘోషింపబడిన (తెలియచెప్పబడిన) వాడు. వేదస్వరూపుడు. **స్వాధ్యాయ ఘోషో యస్యాస్తి సుఘోష స్స తు కీర్తితః**. ఇందుకు శ్రీ వి.వి. రామానుజన్ చెప్పిన తిరుసాహిత్య ప్రమాణములు –

తిరుపైమోళి 2.7.2 – **నారణాన్, మూడు ఏడులగుక్కుమ్ నాధన్, వేదమయన్**.

పెరియ తిరుమొళి 5.5.9 – **సందోగన్, పౌడియన్, ఐన్ తడల్ ఓంబు తైత్తిరియన్, సామవేదీ** (తిరుమంగైయాళ్వారు).

శ్రీ శంకరుల భాష్యము – **సుశోభనో ఘోషో వేదాత్మకో అస్య ఇతి సుఘోషః** – వేదములే శ్రీమన్నారాయణుని మంగళఘోష.

ఇదే గాక, మేఘ గంభీరమైన, మనోహరమైన కంఠధ్వని గలవాడు – అని మరొక స్పష్టమైన ప్రత్యక్ష అర్థమును కూడ శ్రీ శంకరులు చెప్పారు.

ధర్మచక్రము రచయిత – నియమబద్ధముగా వేదములను ఉచ్చరించిన యెడల మనస్సు పావనమగును. ప్రకృతిలోని మధుర స్వనములు ప్రశాంతత గూర్చును. అవే సంగీతమునకు మూలము. భగవంతుని గూర్చిన గానము, స్మరణము, మంత్రము – అన్నీ సుఘోషణలే.

నీ కథాగానమే నాకు నిరత స్మరణ, మంత్రము, జపము, తపము అని అన్నమయ్య కీర్తించినాడు. హరినామము జపియించెడి నోరు నోరని ప్రహ్లాదుడు నుతించినాడు. ఎంతో రుచిరా, ఓ రామ, నీ నామమెంతో రుచిరా – అని రామదాసు గానము చేసినాడు. అన్నింటికంటె రామునిధ్యానమే ఉత్తమమని త్యాగయ్య పరవశించినాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఈ నామమును మరొక విధముగా విశ్లేషించిరి – 'హుఘుర్' - విశబ్దనే – అన్న ధాతువునుండి – 'ఘోషణ' అనగా ప్రకటించుట, చాటిచెప్పుట. 'సు-ఘోష' అనగా మరల మరల ఎలుగెత్తి చాటుట. అలా ఒక్కని గురించే వేదములు వేదములు చెప్పినవి. ఆ పరబ్రహ్మమే 'సుఘోష'. వర్షంలోనూ, జలప్రవాహంలోనూ, ప్రకృతి పలవరింపులోనూ వినవచ్చేది ఆ సుఘోషయే.

సుందరకాండము 35.16 – శ్రీరాముని హనుమంతుడు వర్ణించిన విధము –

దుందుభి స్వన నిర్ఘోషః స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్

సమస్సమ విభక్తాంగో వర్ణం శ్యామం సమాశ్రితః

ఓ సీతాదేవీ! శ్రీరాముడు దుందుభివలె గంభీరమైన కంఠస్వరము గలవాడు. నిగనిగలాడు శరీరచ్ఛాయ గలవాడు. ప్రతాపశాలి. ఎక్కువ తక్కువలు లేకుండా పరిపుష్టములైన చక్కని అవయవములు గలవాడు. మేఘశ్యామవర్ణ శోభితుడు.

మోహిని అవతారపరంగా – దేవతలచేత, దానవులచేత కూడ పెద్దగా కొనియాడబడుతూ పాలకడలిని చిలికిన దేవుడు.

460 సుఖదః

- సుఖ సంతోషములను, శాశ్వత సుఖమైన మోక్షమును ఇచ్చువాడు.
- దుష్టుల సౌఖ్యమును నాశనము చేయువాడు.
- మోక్షమునకు ప్రతిబంధకములైన భోగములను నివారించువాడు.
- రోగములు లేకుండ జీవించు శరీరమునిచ్చువాడు.

ఓం సుఖదాయ నమః

మరల 890వ నామముగా 'సుఖదః' వచ్చును.

49వ శ్లోకము. 460వ నామము. సుఖదః – **సువ్రతః సుముఖః సూక్ష్మః సుఘోషః సుఖదః సుహృత్**

95వ శ్లోకము. 890వ నామము. సుఖదః – **అనంతో హుతభుగ్భోక్తా సుఖదో నైకదోऽగ్రజః**

సదాచార సంపన్నులకు, సమాధిసాధకులకు సుఖమునిచ్చును గనుక భగవంతుడు 'సుఖదః' అని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

సదాచార సమాధి అనుష్ఠాపనేన తన్నిష్ఠేభ్యః ఫలమ్

పరమ సుఖమ్ దదాతి ఇతి సుఖదః

సమాధ్యనుష్ఠానేన తదనుష్ఠాన శీలినామ్

సుఖం బహు దదాతి ఇతి సుఖదః పరికీర్తితః

ధ్యాన నిష్ఠను ప్రచారం చేసి, అలా నిష్ఠతో ధ్యానించిన భక్తులకు అపరిమిత సుఖమునొసగువాడు.

భగవంతుడు సదాచార సంపన్నులను అనుగ్రహించుటయే కాదు. తాను స్వయంగా సత్కర్మలను ఆచరించుచు మనకు దారి చూపును. ఆ మార్గమును అనుసరించినవారికి పరమ సౌఖ్యము అందివచ్చును.

'ద' అనగా ఇచ్చుట, నాశనము చేయుట (దదాతి, ద్యాతి) అను రెండర్థములున్నవి. కనుక 'సుఖదః' అనగా దుష్టుల సుఖమును హరించువాడు అన్న అర్థమును కూడ శ్రీ శంకరులు సమర్థించారు. **ఆపద్వృత్తానామ్ సుఖమ్ ద్యాతి ఖండయతి ఇతి సుఖదః.**

శ్రీ సత్యదేవో వాసిష్ఠ మరొకవిధంగా విశ్లేషించారు – సు-ఖ-దః

సు – మంచి, ఆరోగ్యకరమైన

ఖ – ఖను-అవధారణే – త్రవ్వుట, తరచుట

సుఖ – నవరంధ్రములతో కూడిన శరీరము, మంచి జీవితమునిచ్చును.

సుఖద – ఆరోగ్యకరమైన జీవితమునిచ్చు శరీరమును ప్రసాదించువాడు.

సుఖమ్ ఖాతమ్ తద్దః సుఖదః విష్ణుః

మోహిని అవతారపరంగా – అమృతమును పంచి ఆనందమును విరజల్లిన దేవుడు.

461. సుహృత్

- మంచి మనసుగల నిజమైన మిత్రుడు. అపకారికి కూడా ఉపకారము చేయనెంచువాడు. కరుణాసాగరుడు.
- కామక్రోధాది భావములతో కాకుండా, వేదధర్మము కోసమే అసురసంహారాది కార్యములు నిర్వహించువాడు.
- కామక్రోధాది వికారములకు అతీతుడు.
- దేవతలకు అమృతమును పంచియిచ్చిన మిత్రుడు.

ఓం సుహృదే నమః

కిమస్మిన్ కరవాణీతి హ్యపకారిణి శోభనమ్

యస్యాప్తి హృదయం చాసౌ సుహృత్యభిధీయతే

అపకారము చేసినవాడికి కూడా, ఇతడికి నేనే విధమైన మేలు చేయగలను అని ఆలోచించే మనసుగలవాడు. **అనుపకారిణి అపి- కిం అస్య భవిష్యతి- కిం కరవాణి- ఇతి శుభాశంసి శోభన హృదయత్వమ్ సుహృత్వమ్** – అని శ్రీ భట్టులు వివరించారు. **రిపుణామపి వత్సలః** – అని రామాయణమునుండి శ్రీ వి.వి. రామానుజన్ ఉదాహరించారు.

ధర్మచక్రము రచయిత – తనకు కష్టాలు కలిగినపుడు క్రుంగి, కలసివచ్చినపుడు పొంగిపోయే మనసు 'సుహృత్' కాదు. పరులకు దుఃఖము కలిగినపుడు కరిగిపోయేదే 'సుహృత్'. పట్టాభిషేకమునకు సిద్ధమైనపుడూ, వనవాసానికి కదిలినపుడూ కూడా శ్రీరామచంద్రుడు స్థిరచిత్తుడయ్యే ఉన్నాడు. కాని ఇతరుల కష్టాలను తన కష్టాలుగా తలచాడు. ఈ పుణ్యనామమును ధ్యానించినవారికి హృదయము కల్మషరహితమౌతుంది. ఓం సుహృదే నమః.

మోహిని అవతారపరంగా – దేవతలకు అమృతమును పంచి ఇచ్చిన నిజమిత్రుడు సుహృత్.

462. మనోహరః

మనసును హరించువాడు.

ఓం మనోహరాయ నమః

'సుహృత్' అనగా అందరికీ మేలుచేయనెంచువాడు. అందువలన అందరి మనసులను ఆకట్టుకొనేవాడు మనోహరుడు. నల్లనివాడు. పద్మనయనమ్ములవాడు. నవ్వు రాజిల్లెడు మోమువాడు. సుధారసమ్ము పై జల్లువాడు. గోపీజన మనోహరుడు.

ఏవం విసర్గ సౌహార్దాత్ తేషాం హృదయ హారకః
మనోహర స్సమాఖ్యాతో హ్యష్టార్ణా శ్శాంతిదాయకః
ఇటువంటి మంచి మనసుతో శత్రువులను కూడా ఆకట్టుకొంటాడు. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. శాంతిదాయకము. ఓం మనోహరాయ నమః.

శ్రీ వి.వి. రామానుజన్ ఇందుకు నమ్మాళ్వార్ తిరువైమొళి (7.2.6)నుండి ఉదాహరించారు – **మెయ్యల్ సెయిదు ఎన్నై మనమ్ కవరందానే.**

శ్రీ చిన్మయానంద – మనసు దోచుకొనేవాడు మనోహరుడు. శ్రీనివాసుని సౌందర్యము సకల కళ్యాణదాయకము. ఐహికదృష్టి నుండి భక్తులను తన దివ్యపదమునకు మళ్ళించును. అంబుజోదర దివ్యపాదారవింద మత్తమైన చిత్తము ఇతరములకేల వెడలును?

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – శ్రీదేవుని మనోహరత్వము ఆయన సృష్టిలో మరల మరల ప్రస్ఫుటమగుచున్నది.

ధర్మచక్రము రచయిత – సుఖభోగానురక్తులైనవారి చిత్తమును ఐహికానందమువైపునకు, మోక్షగాముల చిత్తమును పరమపద సోపానమువైపునకు ఆకర్షించు భగవానుడు ఇరువర్గములకు మనోహరుడు.

అన్నమయ్య కీర్తన

రాముడు లోకాభిరాముడు త్రైలోక్య
ధాముడు రణరంగ భీముడు వాడే

వరుడు సీతకు, ఫలాధరుడు మహోగ్రపు
శరుడు రాక్షస సంహారుడు వాడే

స్థిరుడు సర్వగుణాకరుడు కోదండ దీక్షా
గురుడు సేవక శుభకరుడు వాడే

ధీరుడు లోకైకవీరుడు సకలా
ధారుడు భవబంధదూరుడు వాడే
శూరుడు ధర్మవిచారుడు రఘువంశ
సారుడు బ్రహ్మసాకారుడు వాడే

బలుడు యిన్నిటా రవికులుడు భావించ, ని
ర్మలుడు నిశ్చలుడవికలుడు వాడే
వెలసి శ్రీ వేంకటాద్రి నిజనగరములోన
తలకొనె పుణ్యపాదతలుడు వాడే

---

463. జితక్రోధః

కోపమును జయించినవాడు.

ఓం జితక్రోధాయ నమః

క్రోధము, తదితర వికార భావములన్నింటిని జయించినవాడు. తన ఇచ్ఛానుసారమే కోపమును ధరించువాడు. శ్రీమద్రామాయణము ఆరంభములో వాల్మీకి 'జితక్రోధుడు' ఎవరు అని అడుగగా నారదుడు – **ఉచ్యమానోఽపి పరుషమ్ న ఉత్తరమ్ ప్రతిపద్యతే** – తనపట్ల పరుషమైన మాటలాడినా, తానుమాత్రము పరులకు పరుషమైన ఉత్తరమీయనివాడు రాముడే జితక్రోధుడు – అని చెప్పెను.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి మూడువిధములైన కోపములను పేర్కొన్నారు (1) మనసులో దాగిఉండి, మాటలు, చేతల రూపంలో బయటకు రానిది మన్యు (2) కండ్లు ఎరుపెక్కి ముఖం కటువుబారితే అది కోపము (3) పరుషములైన మాటలు, చేతలు, కదలికలతో వెళ్ళగక్కునది క్రోధము.

భగవంతుడు క్రోధాన్ని పరిత్యజించలేదు. జయించాడు. అనగా తన ఇచ్ఛానుసారము క్రోధాన్ని ధరిస్తాడు. శ్రీనారసింహుడు ప్రహ్లాదుని కాచుటకై హిరణ్యకశిపునిపై విరుచుకుపడ్డాడు. **క్రోధమ్ ఆహార్యాత్ తీవ్రమ్** – అని వాల్మీకి వ్రాశాడు (3.24.33). యుద్ధకాండము(59.147) – శ్రీరాముడు హనుమ భుజాలపై అధిరోహించి రావణునితో యుద్ధం చేస్తుండగా, రావణుడు తీవ్రమైన బాణాలతో హనుమను నొప్పించాడు. రక్తం వోడుతూ మోదుగచెట్టు పూలతో నిండినట్లున్న ఆంజనేయుని చూచి శ్రీరాముడు 'క్రోధమా, నన్నావహించు' అన్నాడు. అలా ఆయన క్రోధాన్ని జయించిన జితక్రోధుడు.

రక్షసాం దేవ విషయే యేన క్రోధో వినిర్జితః

స జితక్రోధ అఖ్యాతో హ్యష్టార్ణః క్రోధనాశకః

దేవతల విషయంలో రాక్షసులకుగల క్రోధాన్ని పరిమార్చినవాడు. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. క్రోధనాశకము. ఓం జితక్రోధాయ నమః.

అసురలపట్ల క్రోధంతో గాక, వేదధర్మోద్ధరణ కోసమే వారిని సంహరించిన భగవంతుడు జితక్రోధుడు అని శ్రీ శంకరులు వివరించారు.

సంపూర్ణ సమతులనముగల మనసు గలవాడు గనుక భగవానుడు కామక్రోధాది వికారములకు అతీతుడని శ్రీ సత్యదేవో వాసిష్ఠ వివరించారు. శ్రీ సత్యదేవో వాసిష్ఠ గొప్ప సంస్కృత పండితులు మాత్రమే కాదు. ఆయుర్వేద జ్యోతిశ్శాస్త్రాలలో దిట్ట. ఆయన ఇలా వివరించారు. క్రోధము అనేది శారీరిక గ్రంథులలో ఏర్పడిన ఒక వికారము. ఏవిధములైన వికారములు, వ్యత్యాసములు లేని అచ్యుతుడు సుహృత్, జితక్రోధుడు.

శ్రీ చిన్మయానంద – క్రోధమే కాదు. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములు లేశమంతయినా లేనివాడు గనుక శ్రీమహావిష్ణువు సుహృత్, జిదక్రోధః.

మోహిని అవతారపరంగా – జగన్మోహినిని చూచిన అసురులు మాయావివశులై, దేవతలపట్ల తమకున్న క్రోధమును విస్మరించిరి.

464. వీరబాహుః

గొప్ప బాహువులు గలవాడు.

ఓం వీరబాహవే నమః

శ్రీ భట్టులు ఈ నామమును క్షీరసాగరమధనం పరంగా ఇలా వివరించారు – దేవతలు, దానవులు అలసిపోయినపుడు శ్రీమహావిష్ణువే పాలకడలిని చిలకడం కొనసాగించాడు. శ్రీహరి వేల చేతులు మనోహరంగా, మహాద్భుతంగా మందరగిరిని త్రిప్పుతున్నాయి. ఆ చేతులు ప్రకాశమానములైన కంకణాలతో, కడియాలతో, భుజకీర్తులతో, పూలమాలలతో వెలుగుచున్నాయి.

శ్రీ వి.వి. రామానుజన్ పెరియతిరుమొళి (5.7.4)నుండి ఉదాహరించారు.

శ్రీ శంకరుల భాష్యము – శత్రువులను నిర్జించి వేదధర్మమును నిలిపిన భగవానుడు వీరబాహువు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – వెనుకంజ వేయకుండా, విరామం లేకుండా విజృంభించేవాడు వీరుడు. భగవంతుని నాలుగు చేతులు వివిధాయుధాలతో, ఒకేమారు, ప్రతిచేయి స్వతంత్రంగా, తమ కార్యములు సాధించును. కనుక ఆయన ప్రతిబాహువు వీరలక్షణములు కలిగియుండును.

ధర్మచక్రము రచయిత – ధర్మమును కాపాడేవాడు వీరుడు. కనుక ఇరవైచేతులున్నాగాని రావణుడు వీరబాహువు కాదు. ఎందుకంటే అవి కామానికి సహకరించేవి. మనము మన శక్తిని ధర్మకార్యాలకు వినియోగించాలని ఈ నామస్మరణముద్వారా గ్రహించాలి.

465. విదారణః

- చీల్చివేయువాడు. (ధర్మము తప్పినవారిని) ఖండించేవాడు. రాహువును, హిరణ్యకశిపుని ఖండించినవాడు.
- భక్తుల పాపములను ఖండించువాడు. భయమును హరించువాడు.
- విభజించువాడు.
- హేతి మొదలైన దివ్యాయుధములచే రాక్షసులను చీల్చువాడు.
- ఆత్మకు, శరీరానికి ఉండే బంధాన్ని త్రెంచేవాడు.

ఓం విదారణాయ నమః

అమృతమును పంచే సమయంలో రాహువును ఖండించినవాడు, దేవతలను కాచినవాడు విదారణుడు.

సమగ్ర ఉగ్ర భయ విదారణాయ – అన్నది భగవంతుని స్మరించే మంత్రము. సకల భీకర భయాలు శ్రీదేవుని స్మరణమువలన పటాపంచలవుతాయి.

బధ్వా గలే యమభటా బహుతర్జయన్తః
కర్షంతి చాత్ర భవపాశ శతైర్యుతం మామ్
ఏకాకినం పరవశం చకితం దయాళో!
లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్

ధర్మచక్రము రచయిత వివరణ – భవబంధములను ఖండించేవాడు. ఆత్మకు శరీరబంధమునుండి విముక్తిని కలిగించేవాడు విదారణుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – విభజించేవాడు విదారణుడు. స్త్రీ పురుషులను, రేయింబవళ్ళను, ఉత్తరాయణ దక్షిణాయనాలను, పృథివ్యాకాశములను, అగ్నిసోమములను వేరుచేసేవాడు. జన్మ సమయమున తల్లి గర్భమునుండి బిడ్డను వేరుచేసేవాడు.

శ్రీనారసింహుడు హిరణ్యకశిపుని చీల్చిన విధము –

చించున్ హృత్కమలంబు శోణితము వర్షించున్ ధరామండలిన్
ద్రెంచున్ గర్కశ నాడి కావళులు భేదించున్ మహావక్షము
ద్రుంచున్ మాంసము సూక్ష్మఖండములుగా దుష్టాసురున్ వ్రచ్చి ద

ర్పించున్ ద్రేవులు కంఠమాలికలు గల్పించున్ నఖోద్భాసియై

ఓం నమో శ్రీలక్ష్మీనారసింహాయ

ప్రహ్లాద వరదాయ నమః

హిరణ్యకశిపుని గుండెను నరహరి చీలుస్తాడు. నేలనిండా నెత్తురు చల్లుతాడు. కఠినములైన నరాలను తెంపుతాడు. రొమ్మును పగులగొడతాడు. మాంసాన్ని చిన్నచిన్న ముక్కలుగా చేస్తాడు. ప్రేగులు హారాలుగా మెడలో వేసుకొంటాడు. ఒక్క ఆయుధాన్ని కూడా ప్రయోగించకుండా తొడలపై వేసికొని హరి రాక్షసుని చీలుస్తుంటే, నరహరిగోళ్ళు గొడ్డళ్ళవలె ఉన్నాయి. లోతైన గుండెను బ్రద్దలుకొట్టేటపుడు గుద్దళ్ళవలెనున్నాయి. నరాలను త్రెంచేటపుడు గట్టి కొడవళ్ళవలె నున్నాయి. కడుపులోని ప్రేగులను తెంచేటపుడు రంపాలలా ఉన్నాయి. ఇట్లా ఏయే పనులకు తగినట్లు ఆయా విచిత్రములైన ఆయుధాలవలె నొప్పాయి.

ఓం నమో శ్రీలక్ష్మీనారసింహాయ

ప్రహ్లాద వరదాయ నమః

(మధ్వుల నిత్యప్రార్థనాశ్లోకాలు నరహరి నఖస్తుతితో మొదలై నరహరి నఖస్తుతితోనే ముగుస్తాయి.)

శ్రీనారసింహుని గోళ్ళను చూచి దేవతాముఖాలు వికసిస్తున్నాయి. రాక్షసరాజు శరీరాన్ని చీలుస్తున్నాయవి. అగ్ని జ్వాలలకన్న ప్రకాశమానంగా ఉండి, నరహరికి మ్రొక్కేవారలకు అభయదానం చేస్తున్నాయి.

ఓం నమో భగవతే తుభ్యం పురుషాయ మహాత్మనే
హరయేఽద్భుత సింహాయ బ్రహ్మణే పరమాత్మనే

సర్వవేదాంత వేద్యాయ కారణాయ మహాత్మనే
సర్వలోక శరణ్యాయ శ్రీనృసింహాయ మంగళమ్

(శ్రీ భండారు పర్వతాలరావు రచన "ఓం నమో శ్రీ నారసింహాయ"నుండి)

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

స్వాపనస్స్వవశో వ్యాపీ నైకాత్మా నైకకర్మకృత్ |
వత్సరో వత్సలో వత్సీ రత్నగర్భో ధనేశ్వరః || (50)

466. స్వాపనః

నిదురింపజేయువాడు. మాయామోహితులను చేయువాడు.

ఓం స్వాపనాయ నమః

కటాక్ష భ్రూవిలాసాద్యైః నష్ట శిష్టాన్ జనానపి

యోऽసౌ సమ్య మోహయతి స్వాపనః పరికీర్తితః

భగవానుడు విదారణుడై కొందరు దానవులను నాశనం చేశాడు. వారు నశింపగా మిగిలిన రాక్షసులు మోహిని క్రీగంటిచూపుతో సమ్మోహితులై, వివశులై తమకు అమృతం అందడంలేదనే విషయాన్ని విస్మరించారు. ఇది శ్రీ భట్టుల వ్యాఖ్య.

స్వాపయతి నిద్రాపయతి ప్రళయకాలే సర్వమ్ ప్రకృతావితి స్వాపనః – ప్రళయకాలంలో ప్రకృతినంతటినీ నిద్రబుచ్చువాడు. అని శ్రీ సత్యదేవో వాసిష్ఠ వివరించారు. భగవంతుడు మాత్రము జాగరూకుడై ఉంటాడు. కాని ఆయన నిద్రిస్తాడని ఇతరులు భావిస్తారు. ఎందుకంటే ఆయన పరమేశ్వరత్వము నితరు లెరుగజాలరు. అలా ఆయన తత్వము తెలియనివారు నిద్రిస్తున్నట్లే లెక్క. అని వివరిస్తూ శ్రీ వి.వి. రామానుజన్ గీతనుండి ఉదాహరించారు.

నాహం ప్రకాశః సర్వస్య యోగమాయా సమావృతః

మూఢోऽయం నాభిజానాతి లోకో మామజమవ్యయమ్ – గీత 7.25

నా యోగమాయయందు దాగియున్న నేను అందరికి గోచరింపను. కనుక అజ్ఞానులు నన్ను జన్మరహితునిగా, శాశ్వతునిగా, పరమేశ్వరునిగా తెలిసికొనలేరు.

ధర్మచక్రము రచయిత వివరణ – బుద్ధి, విజ్ఞానము వంటి విషయాలలో మనుష్యులు 'మెలకువగా ఉన్నారు' అని, అవి కొరవడిన జంతువులు 'నిద్రపోతున్నాయి' అని చెప్పవచ్చును. అంటే మానవులుండే ఆ ప్రాంగణంలో జంతువులు విహరించలేవని వివరించవచ్చును. అలాగే 'జ్ఞాని'కి సంబంధించిన స్థానంలో సామాన్యమానవులు నిద్రిస్తూ ఉన్నట్లే. "నారాయణ" మంత్రజపం వల్ల మాత్రమే అట్టి మానవులు జాగరూకులు కాగలరు. మోహపాశబద్ధులై, చైతన్యహీనులైనవారిని మేలుకొలిపేది ఈ పుణ్యనామము.

467. స్వవశః

- తనకు తానే వశమైనవాడు. వేరెవ్వరికి అధీనములో ఉండడు.
- సర్వస్వతంత్రుడు. అంతా తనకు వశమైనవాడు.
- మరేమీ అవుసరము లేనివాడు.

ఓం స్వవశాయ నమః

స్వకీయైస్సహ సుప్తేషు తేషు స్వైర విహారవాన్
భవతి స్వవశోऽపి నాన్యధీనత్వదో మనుః
రాక్షసులను మాయామోహితులను చేసి, నిదురబుచ్చి, దేవతలతో యధేచ్ఛగా విహరించెను. ఆయన అన్యులకు అధీనుడు కాడు గనుక స్వవశుడు – అని వివరిస్తూ శ్రీ భట్టులు మోహిని అవతారపరంగా వ్యాఖ్య కొనసాగించారు.

భగవానుడు సృష్టి స్థితి లయాది కార్యములు సంపూర్ణముగా తన ఇచ్ఛానుసారము చేయు సర్వస్వతంత్రుడు గనుక స్వవశుడు అని శ్రీ శంకరుల వ్యాఖ్య.

ఆయనకు కావలసినదేదీ లేదు. అంతా ఆయనలోనే ఉన్నది.

468. వ్యాపీ

- క్షీరసాగర మధన సమయంలో అందరిలోనూ వ్యాపించి శక్తిని ఇచ్చినవాడు.
- అంతటా విస్తరించియున్నవాడు. సూక్ష్మమై, అనంతమైనవాడు.

ఓం వ్యాపినే నమః

దేవ రక్షో మంధరేషు వాసుకి ప్రభృతిష్వపి

ఆప్యాయనాయ శక్త్యా చ వ్యాపీ స్స్యాద్వ్యసనాదసౌ

శ్రీ భట్టుల వ్యాఖ్యానం క్షీరసాగరమథనపరంగా కొనసాగింది. క్షీరసాగరమథన సమయంలో దేవతలకు, రాక్షసులకే కాక వాసుకికి కూడా శక్తి సన్నగిల్లుతున్నది. అప్పుడు శ్రీమహావిష్ణువు వారందరియందును వ్యాపించి, మందరపర్వతమునందు కూడా తానే వ్యాపించి, వారికి శక్తినొసగి, సాగరమథనానికి అవుసరమైన శక్తిని ప్రసాదించాడు. శ్రీ వి.వి. రామానుజన్ ఇందుకు నమ్మాళ్వార్ రచన (1.1.10)ను ఉదాహరించారు.

కార్య కారణ రూపమున అంతటను వ్యాపించి, విస్తరించి, విరాజిల్లినవాడగుటచేత పరమాత్ముడు 'వ్యాపీ'యను భవ్యనామమున భజనీయుడు. (శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి).

శ్రీ రాధాకృష్ణశాస్త్రి శృతినుండి చెప్పిన ఉదాహరణ – **అవ్యక్తాత్ తు పరః పురుషో వ్యాపకః** (ముండకోపనిషత్తు 2.3.8) – వ్యాప్తిత్వము సూక్ష్మత్వమును సూచించుచున్నదని శ్రీ చిన్మయానంద వివరించారు. సర్వవ్యాపియైన భగవానుడు సూక్ష్మమైనవానికంటె సూక్ష్మతముడు. కనుక ఆయన లేని చోటు లేదు.

ధర్మచక్రము రచయిత వివరణ – సర్వవ్యాప్తిత్వము అనంత గుణమును సూచించును. ఏదైనా ఎక్కడైనా ఉన్నట్లైతే దానిలో అక్కడ దేవుడున్నాడు. కనుక ఆయన సర్వవ్యాపి. అంతము, అవధి లేనివాడు. మన బుద్ధి, ఇంద్రియ, జ్ఞానములకున్న పరిధులనుబట్టి అంతవరకే ఆయనను మనము తెలిసికొన ప్రయత్నము సాధ్యము. ఈ నామధ్యానమువలన ఎంపెరుమాన్ అనంతత్వమును అనుభవించే దీక్షానుభవము మనకు సమకూరుతుంది.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ శృతులనుండి పలు ఉదాహరణలు చెప్పారు –

యజుర్వేదము – **పరీత్య భూతాని పరీత్యలోకాన్ పరీత్యసర్వః ప్రదిశో దిశశ్చ**

ఋగ్వేదము – **పృష్టో దివి పృష్టో అగ్నిః పృథివ్యామ్ పృష్టో విశ్వా ఓషధీరావివేశ**

అధర్వణ వేదము – **యో అగ్నౌ రుద్రో యో అప్స్వంతర్య ఓషధీర్వీరుధ ఆవివేశ**

469. నైకాత్మా

- అనేక రూపములలో, అనేక ఆత్మలుగా విస్తరించియున్నవాడు.
- విష్ణువు, కూర్మము, మందరము, మోహిని, వాసుకి – ఇలా ఒకేమారు బహురూపములలో నున్నవాడు.

ఓం నైకాత్మనే నమః

తదాతనై ర్బ్రహ్మ కౌర్మ మోహిన్యాద్యవతారకైః

నైకాత్మేతి శ్రుత స్స్మృక్ మున్యర్ణో బహురూపదః

బ్రహ్మ కూర్మ మోహిన్యాది అనేక అవతారములతో ఏకరూపముగా ఉన్నవాడు. ఈ నామము సప్తాక్షరీ మంత్రము. సౌందర్యప్రాప్తి. ఓం నైకాత్మనే నమః.

క్షీరసాగర మధనం – 1820 కాలపు చిత్రం. వికీపీడియానుండి

క్షీరసాగరమధనపరంగా శ్రీ భట్టుల వ్యాఖ్య – ఒకేమారు శ్రీమహావిష్ణువు క్షీరసాగర మధనానికి వివిధ అవతారాలు ధరించి తోడ్పడినాడు. శ్రీకూర్మస్వామియై మంధరగిరిని నిలిపాడు. మోహినియై అమృతాన్ని పంచాడు.

ఈ నామమునకు, 139వ నామము "చతురాత్మా"కు ఉన్న పోలికలను శ్రీ రాధాకృష్ణశాస్త్రి పేర్కొన్నారు. భగవంతుడు తన సృష్టిలోని వివిధ రూపములద్వారా మనకు స్ఫురిస్తున్నాడు.

ధర్మచక్రము రచయిత వ్యాఖ్య – వివిధ మతస్థులు భగవంతుని వివిధరూపాలను కొలుస్తున్నారు. నైకాత్ముని గుణమెరుగక వీరు తమ తమ దేవుళ్ళు వేరు వేరని తలచి తమలో తాము కలహిస్తున్నారు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – "ఆత్మ" అనగా నిలకడగా ఉండేది. తల్లిగా, తండ్రిగా, బిడ్డగా, గురువుగా, శిష్యునిగా, భార్యగా, భర్తగా, మిత్రునిగా పరమాత్ముడు అందరికీ అందుబాటులోనున్నాడు. ఎందుకంటే ఆయన సర్వాంతర్యామి. శృతులలోని పెక్కు వాక్యములు ఇందుకు ఉదాహరించవచ్చును.

తదేవ అగ్ని స్తదాదిత్య స్తదు వాయు స్తదు చంద్రమాః
తదేవ శుక్రమ్ తద్ బ్రహ్మ తా ఆపః స ప్రజాపతిః – యజుర్వేదము 32.1

త్వమ్ హి నః పితా వానో త్వమ్ మాతా శతకృతో బభూవిధ – ఋగ్వేదము 8.98.1

470. నైక కర్మ కృత్

అనేకములైన కర్మలనొనరించువాడు.

ఓం నైకకర్మకృతే నమః

శ్రీ భట్టుల వివరణ – క్షీరసాగర మధన సమయంలో మంధరగిరిని నిలుపుట, అమృతమును పంచుట, అందరకును శక్తినొసగుటవంటి అనేక కార్యములు చేసినవాడు.

క్షీరసాగర మధనం. ఏలూరువద్ద శనివారపుపేట ఆలయం గోపురం శిల్పం

శ్రీ శంకరుల వ్యాఖ్య – సృష్టి స్థితి లయాది సకల కార్యములను తానే చేయువాడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – సూర్యుడు, చంద్రుడు, అగ్నివంటి వివిధ రూపములలో జీవులకు అవుసరమైన కార్యములను నిర్వర్తించువాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – తల్లి, తండ్రి, గురువు, బిడ్డ, శిష్యుడు వంటి వివిధ రూపములలో ఆయా ధర్మములను నిర్వహించువాడు.

అన్ని విధములైన వ్యాఖ్యలను సమన్వయపరుస్తూ ధర్మచక్రము రచయిత ఇచ్చిన వివరణ – ఎక్కడ ఏ పని జరిగినా అది భగవంతునిద్వారా మాత్రమే జరుగుతున్నదని గ్రహించాలి. ఇందుకు చాలా ఉదాహరణలు చెప్పవచ్చును. దేవుని సృష్టికార్యములో మనము నిమిత్తమాత్రులమేగాని చేసేవారము కాము. కర్త మాత్రము భగవంతుడే. ఒక మామిడి టెంకనుండి మామిడిచెట్టు వస్తుంది కాని వేరొకటి రాదు. కనుక బహువిధములైన

సృష్టి, తదితర కార్యములు భగవంతునిద్వారా మాత్రమే జరుగుచున్నవి. ఇవి గ్రహించిన యెడల కర్మఫలములు మనలనంటవు.

471. వత్సరః

- సకల భూతములయందు వసించువాడు.
- సకల భూతములు ఆయనయందు వసించును.
- అనంతమైన కాలస్వరూపుడు.
- గోవులకడకు లేగలను తిరిగి చేర్చినవాడు.

ఓం వత్సరాయ నమః

పురుషార్థ స్థాపనాయ సర్వాంతర్య సనాచ్చతాః

ధర్మాత్మా వత్సరస్సస్స్యాత్ మున్వర్ణోऽభీష్టదో మనుః

పురుషార్థముల మర్యాదను కాపాడడానికి అందరియందు నివసించే ధర్మాత్ముడు. ఈ నామము సప్తాక్షరీ మంత్రము. కోరిన కోరికలు తీరుతాయి. ఓం వత్సరాయ నమః

వస్-అనగా నివసించుట – అనే అర్థమునుండి ఈ నామమును శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. ధర్మమును స్థాపించడానికి, మోక్షమార్గమున నడిపించడానికి శ్రీమహావిష్ణువు అంతర్యామియై అందరియందు వసించియున్న వత్సరుడు. ఇందుకు ప్రమాణముగా శ్రీ భట్టులు ఉదాహరించిన మంత్రము – **సర్వాంతశ్చారిణే ధర్మాత్మనే.**

శ్రీ శంకరుల వ్యాఖ్య – **వసతి అత్ర అఖిలమ్ ఇతి వత్సరః** – అంతయు ఆయనలో వసించును గనుక శ్రీహరి వత్సరుడు. అన్నింటికిని ఆవాసము.

పైరెండు వ్యాఖ్యలకును వర్తించే పెక్కు శ్రుతిప్రమాణములను శ్రీ సత్యదేవో వాసిష్ఠ పేర్కొన్నారు –

త్వయి రాత్రి వశాంసి స్వపిష్యామసి జాగృః – అధర్వణ వేదము 19.47.9

ఈశావాస్యమిదమ్ సర్వమ్ యత్కించిత్ జగత్యామ్ జగత్ – ఈశావాస్యోపనిషత్తు.

సంవత్సరోऽసి పరివత్సరోऽసీదా వత్సరోऽసీదా వత్సరోऽసీ – యజుర్వేదము 27.45

వత్సరము - అనగా ఒక సంవత్సరకాలము. కాలాకాశ స్వరూపుడైన భగవంతునిలో అందరూ ఉన్నారు. ఇది కూడా పై అర్థమునే పరోక్షముగా తెలుపును.

శ్రీ చిన్మయానంద – (శ్రీకృష్ణావతార పరంగా) **వత్సాన్ రాతి ఇతి వత్సరః** – గోపబాలకులనుండి వత్సములు (ఆవుదూడలు) శత్రువులచే తీసికొని పోబడినవి. వాటిని మరల భగవానుడు గోపాలకులకు అప్పగించినాడు. కనుక ఆయన వత్సరుడు.

472. వత్సలః

ప్రేమమూర్తి. వాత్సల్య స్వరూపుడు.

ఓం వత్సలాయ నమః

'వత్స'అనగా దూడ – ప్రేమను సూచించునది. (**వత్స అంశాభ్యామ్ కామబలే** – పాణిని). శ్రీమన్నారాయణుడు వాత్సల్యభరితుడు.

సర్వస్యాంతర్నివసనే హేతు స్స్యా ద్వత్సల స్మృతః
వత్సేదో నేరివ యతో వత్సలశ్శరణాగతే
అందరియందు గల వాత్సల్యమువల్లనే వారియందుంటాడు. పుట్టిన లేగపై ఆవుకు ఎంత ప్రేమ ఉంటుందో శరణాగతునిపై పరమేశ్వరునికి అంత ప్రేమ ఉంటుంది. వత్సరుడై ఆ భక్తవత్సలుడు వసించుటకు కారణము ఆయనకు భక్తులపట్ల, శరణాగతులపట్ల గల వాత్సల్యమేనని శ్రీ భట్టులు వివరించారు.

విదిత స్స హి ధర్మజ్ఞః శరణాగతవత్సలః (సుందరకాండము 21.20) – ఓ రావణా! శ్రీరామచంద్రుడు ధర్మజ్ఞునిగా, శరణాగత వత్సలునిగా మిక్కిలి వాసికెక్కినాడు. నీవు బ్రతికియుండదలచినచో ఆయనతో మైత్రి నెఱపుటయే క్షేమము. శరణుగోరినవారిని అనుగ్రహించునట్టి ఆ స్వామిని నీవు ప్రసన్నుని చేసికొనుము. నీవు జితేంద్రియుడవై, నిర్మల మనస్సుతో నన్ను ఆయనకు అప్పగించుము – అని సీతమ్మతల్లి రావణునకు హితవు చెప్పినది.

ధర్మచక్రము రచయిత – వత్సలుడు గనుకనే శ్రీరాముడు గుహుని మిత్రుడైనాడు. తానే స్వయముగా హనుమంతుని గుండెలో వెలసినాడు. శరణాగతులైన సుగ్రీవుని, విభీషణుని బ్రోచినాడు.

473. వత్సీ

- పెక్కు దూడలు కలిగిన గోపాలుడు.
- నిత్యము తనచేత పోషింపబడే ఆత్మవర్గములను దూడలుగా గలవాడు.

ఓం వత్సినే నమః

నిత్య పోష్యాత్మ గుణవత్ భూయస్త్వద స్సదా
వత్సీ స్యాద్ధి విశేషేణ షడర్ణో గోపదో మనుః

ఆత్మగుణాలతో అలరారే ఆత్మలను – గోవు తన దూడలను కాపాడునట్లు, గోపాలుడు గోవులను కాచునట్లు – ఎప్పుడూ పోషించేవాడు. అటువంటివారే అధికముగా కలవాడు. ఈ నామము షడక్షరీ మంత్రము. రక్షణనిస్తుంది. ఓం వత్సినే నమః

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – భగవానుని రక్షణాపరత్వము ఎల్లెడల మనకు ప్రస్ఫుటమగుచున్నది. బిడ్డ జన్మింపగనే తల్లి స్తన్యమివ్వగలగడం ఇందుకొక ఉదాహరణ.

474. రత్నగర్భః

- విశేషములైన ధనసంపదలు గలవాడు. కోరినంత ధనమును ప్రసాదించువాడు.
- రత్నరాసులు తనయందు కలిగియున్నవాడు. సాగరుడు.
- భక్తులను తన కడుపులో పెట్టుకొని రత్నములనువలె కాపాడుకొనువాడు.

ఓం రత్నగర్భాయ నమః

ధనాయద్భ్య యధారామం ప్రదేయ ధనవత్త్వతః
రత్నగర్భ స్సమాఖ్యాతో హ్యష్టార్ణో ధనదో మనుః
ధనము, ఐశ్వర్యము కోరి తనను సేవించేవారికి కోరినంత ధనమును ఈయగలవాడు. ఈ నామాన్ని మంత్రంగా జపం చేస్తే అష్టాక్షరి. ధనప్రాప్తి. ఓం రత్నగర్భాయ నమః

శ్రీ వి.వి. రామానుజన్ ఉదాహరించినది – **వైత్త మా నిధియామ్ మధుసూదనానై** (నమ్మాళ్వార్ 6.7.11) – భగవానుడు దాచుకొన్న నిధివంటివాడు. అవుసరమునకు ఆదుకొను ఆపద్బాంధవుడు.

గీత(10.24)యందు చెప్పబడిన - **సరసామస్మి సాగరః** – సరస్సులలో నేను సాగరమును – అన్న వచనము ఆధారముగా శ్రీ శంకరుల వ్యాఖ్యానము సాగినది. సారమును రత్నాకరము, రత్నగర్భ అన్నట్లే భగవంతుడు కూడ రత్నగర్భుడు. సకల నిధులు ఆయనయందే ఉన్నవి. కనుకనే ఆయన కొండలంత వరములు కూపెడు కోనేటిరాయడు. ఆపన్నులకు అభయమయ, అర్థార్థులకు ఐశ్వర్యము, శరణాగతులకు రక్షణ, ప్రపన్నులకు మోక్షము ప్రసాదించు కల్పతరువు కామధేనువు. నిధానము.

ఈ భావమును శ్రీ రాధాకృష్ణశాస్త్రి మరింత పొడిగించారు. నాగుపాము పడగలోని రత్నము, వెదురుకణుపులో ఏర్పడు రత్నము కూడ భగవంతునిలో సంభవించును. మరొక భావములో, భగవానుడు తన భక్తులను రత్నములవలె కాపాడుచుండును. మోక్షపథమువైపు నడుపుచుండును. రాజస, తామస ప్రలోభములకు లోనుకాకుండ శ్రీమన్నారాయణుని ధ్యానించినయెడల సత్యమార్గమున చరించు భాగ్యము లభించును.

శ్రీ సత్యేవో వాసిష్ఠ – రమ్ - క్రీడాయామ్ - క్రీడించుట – అన్న ధాతువునుండి, రత్నము అనగా ఆనందమునిచ్చేది అంతా రత్నమే. ఆనందము ఏదైనా సచ్చిదానంద పరమాత్ముడైన శ్రీమహావిష్ణువు కటాక్షమువలన కలుగవలసినదే గనుక శ్రీహరియే రత్నగర్భుడు. ఇందుకు శ్రీ వాసిష్ఠ శ్రుతినుండి పెక్కు ఆధారములను ఉదాహరించారు.

హిరణ్యగర్భః సమవర్తతాగ్రే భూతస్య జాతః పతిరేకాసిత్

అర్చామి సత్య సవం రత్నధామభి ప్రియమ్ మతిమ్

హిరణ్యాక్షః సవితాదేవ ఆగాత్ దధత్ రత్నా దాశుషేవార్యాణి

475. ధనేశ్వరః

ధనమునకు అధినాధుడు. సకలైశ్వర్యమలకు ప్రభువు. శ్రీలక్ష్మీవల్లభుడు. ధనమును ప్రసాదించువాడు.

ఓం ధనేశ్వరాయ నమః

ఏకేన చక్రమపరేణ కరేణ శంఖ
మన్యేన సింధుతనయా మవలంబ్య తిష్ఠన్
వామేతరేణ వరదాభయ పద్మచిహ్నమ్
లక్ష్మీనృసింహ! మమదేహి కరావలంబమ్

లక్ష్మీ మహీ తదనురూప నిజానుభావ
నీళాది దివ్య మహిషీకర పల్లవానామ్
ఆరుణ్య సంక్రమణతః కిలసాంద్ర రాగౌ
శ్రీ వేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే

ధనానామ్ ఈశ్వరః ధనేశ్వరః – సకల ధనములకును ప్రభువు ధనేశ్వరుడు – అని శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు. ఇంతకుముందు నామమైన 'రత్నగర్భః' అనగా రత్నములకు నిలయమైన సాగరమని శ్రీ శంకరులు వ్యాఖ్యానించిన విషయమును గమనించనగును

శ్రీ భట్టులు 'రత్నగర్భః' అనగా సకల నిధులు, సంపదలకు నిలయము – అని మరింత విస్తృతార్థములో వ్యాఖ్యానించారు. కనుక శ్రీ భట్టులు ప్రస్తుత నామము 'ధనేశ్వరః' అనగా – సంపదలు కోరుకొన్న భక్తులకు ధారాళముగా సంపదలొసగువాడు – అని వ్యాఖ్యానించారు. ఇందుకు ఉణాది సూత్రము 738 ఆధారముగా తీసికొనవచ్చును. **అశ్నోత్తర ఆసుకర్మణి వరత్ చ** – త్వరగా సఫలతను ప్రసాదించగలవాడు. ఇక్కడ "త్వరగా" అన్న పదమును నొక్కిచెప్పారు. మ్రొక్కుకున్నంతనే, అభ్యర్థించినంతనే కోరికలు తీర్చువాడు అనే అర్థములో. ఓం ధనేశ్వరాయ నమః.

శ్రీ వి.వి. రామానుజన్ నమ్మాళ్వార్ (3.9.7) రచనను ఉదాహరించారు. **శీరుమ్ కొడై పుగళ్ ఎల్లై ఇలానై.** భగవంతుడు ఒక్కసారిగా సంపదలు ఇచ్చే విషయంగురించి శ్రీ అనంతకృష్ణశాస్త్రి కుచేలుని కథను ఉదాహరించారు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి ఈ నామమునకు మరొకవిధంగా అర్థము చెప్పారు. భగవంతుని విభూతులలో కుబేరుడు ఒకరు. **విత్తేశో యక్షరాక్షసామ్** (గీత 10.23). విత్తేశుడనగా కుబేరుడు. కనుక ఆయన ధనేశుడు.

శ్రీ చిన్మయానంద – ఇక్కడ 'సంపదలు' అనగా సంతోషము కూర్చునవన్నియును అని భావించవలెను. శ్రీలక్ష్మీపతియైన శ్రీమహావిష్ణువు సకల ధనములకును నాధుడు. అన్నింటికంటె ఉత్తమ ధనమైన మోక్షమునకు కూడ ఆయనే నాధుడు. ప్రపన్నులకు సత్వరమే ధనమునొసగు శ్రీమన్నారాయణుడే ధనేశ్వరుడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.